శ్రీ

చింతామణి.

ఇది మాసమునకొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౫.] రాజమహేంద్రవరము. [సంచిక. ౫.
మన్మథసంవత్సర కార్తీకమాసము.

[ఇది యొక యింగ్లీషుకథ ననుసరించి మార్చి వ్రాయఁబడినది.]

బదరికాశ్రమయోగి.

బదరికావనమునందలి యొక నిర్జనప్రదేశమునందొకయోగి యొక యాశ్రమమును నిర్మించుకొని యందు వాసముచేయుచుండెను. అతఁడందు తపస్సుచేయుచు, మార్గాయాసపడి యాదారినిబోవఁ దటస్థించిన మార్గస్థులను తన కుటీరమునకుఁ బిలుచుకొనిపోయి యన్నపానాదులిచ్చి యాదరించుచు, ఋషివలె కాలముగడపుచుండెను. గడ్డమును గోళ్లును పెంచుకొని యేకాకియయి యరణ్యావాసమును జేయుచున్న యాయోగి నెల్లవారును గౌరవించుచు మహర్షినివలెఁ జూచుచుందురు. ఒకనాటిరాత్రి యాయాశ్రమ సమీపముననున్నమార్గమున నొకస్త్రీ తనకొమార్తెతోఁ గూడ బండినెక్కి యేదో తొందరపనిమీఁద గ్రామాంతరము పోవుచుండెను. ఇట్లాబండి యా యాశ్రమమునుదాటి కొంతదూరము పోవునప్పటి కెవ్వఁడో యొక దొంగ మొగముకనఁబడకుండ ముసుఁగువేసికొనివచ్చి యాబండి నిలిపెను. బండిలోనున్న యాఁడుకూఁతురాదొంగనుజూచి భయపడి వడవడవడఁకఁజొచ్చెను. అప్పుడాదొంగవాఁడు "అమ్మా! మీరు భయపడఁబోకుఁడు. నేను మీకేమియు హాని చేయఁ దలఁచుకొనిరాలేదు. నాకుఁగావలసినవెల్లను మీ నగలును ధనమునుమాత్రమే. అవి మీరు నాకిచ్చివేసినయెడల నేను మీజోలికిరాను. ఇయ్యక పెనఁగులాడినపక్షమున నేనవి మీవద్దనుండి క్షణకాలములో బలవంతముగా పుచ్చుకోఁగలను. అరుగో! ఆయుధపాణులయియున్న నా మనుష్యులను జూడుఁడు. మీరు నేనుకోరిన సొత్తు నియ్యక చిక్కులుపెట్టినపక్షమున నేను చేసైగచేయఁగానే వారందఱునువచ్చి మీమీఁద పడి మిమ్ము దోచుకొందురు. నా కటువంటి శ్రమ కలుగఁజేయక వెంటనే మీ నగలు

తీసి నాముందుపెట్టుఁడు." అని దూరముగా చెట్లక్రింద నాయుధహస్తులయి నిలుచున్న యిరువదిమందిని జూపెను. ఆ మనుష్యులను జూడఁగానే భయపడి బండివాఁడుం నోట మాటరాక వడఁకఁజొచ్చెను. అప్పు డసహాయురాలయియున్న యాకాంత మాఱుమాటచెప్పక తనయొక్కయు కొమార్తెయొక్కయు నగలన్నియుతీసి యా దొంగవాని యొడిలోవేసి బండిలోని సొమ్ము పెట్టెను వానికి సమర్పించి కట్టుబట్టలతో నిలువఁబడెను. అవి తీసికొని దొంగతన దారినిబోయెను. బండిలోనివారును ప్రాణములు దక్కినవని సంతోషించుచుండఁగా బండియు ముందుకు సాగిపోయెను.

మఱి కొన్నిదినముల కీ దొంగవలననే యాస్థలమునందు మఱియొక దారిదోపిడి జరగెను. ఈసారి దోచు కొనఁబడినవాఁడు ధనికుఁడయిన యొక పురుషుఁడు. అతఁడు ధైర్యశాలియైనను, ఖడ్గహస్తులయి తన యజమానుని యాజ్ఞను చెల్లించుటకు సంసిద్ధులై దూరముగా చెట్లక్రింద నిలువఁబడియున్న యాతస్కరుని సహాయులనుజూచి యొంటిగాఁడైనందునఁ దానంతమంది నెదిరించిన కార్యము లేదనుకొని తనసొత్తును దొంగపాలుచేసి వెడలిపోయెను. విస్తారధనమును గోలుపోయినందున ఆ పురుషుఁడు పట్టరాని దుఃఖమును క్రోధమును గలవాఁడయి యేలాగున నయిన కృషిచేసి యా దొంగలను పట్టవలెనని నిశ్చయించుకొనెను. అయినను వారిని పట్టుకొను వెరవు తోచక డోలాయమానమానసుఁడై తాను దిగినసత్రములోఁ గూరుచుండి తాను దొంగలనుబట్టుకొని రాజభటులకొప్పించి వారినెట్లు శిక్షింపఁజేయుదునా పోయిన సొత్తును మరల నెట్లు సంపాదించుకోఁ గలుగుదునాయని యాలోచించుచుండెను. ఇట్లతఁడు కూరుచుండియుండఁగా దైవికముగా నిరువదిమంది యాయుధపాణులయిన రాజభటులు తమ నాయకునితోఁ గూడి యేదో రాజకార్యముమీఁద పయికిఁబోవుచు నాఁటిమధ్యాహ్న మా సత్రములోనికి వచ్చి దిగుట తటస్థించెను. వారినిజూచి యా మనుష్యుఁడు వారి యజమానునితోఁ దనయవస్థ చెప్పుకొని యేలాగుననైనఁ దనకు తోడుపడి దొంగలను పట్టుకొని తనసొత్తును దనకిప్పించి పుణ్యముకట్టుకోవలసినదని బహువిధముల దీనముగా వేఁడుకొనెను. ఆ నాయకుఁడు రాజకార్యముమీఁద ముందుకు సాగిపోవలసినవాఁడే యయినను వాని దీనాలాపములను ప్రార్థనను విని మనసుకరఁగినవాఁడయి వానివెంటఁబోయి సాయముచేయుట కొడఁబడెను. భోజనము లయినతరువాత చల్లపాటువేళ బైలుదేఱి వారందఱునుగలిసి రాత్రి కొంత ప్రొద్దుపోవునప్పటికి దొంగలుకొట్టిన స్థలమును జేరిరి. కత్తులును కటారులును ధరించియున్న తమ్ముఁ జూడఁగానే దొంగలు పాఱిపోవుదురని యెఱిఁగి వారదివఱకే యాలోచించుకొని, యీల వినఁబడఁగానే వచ్చి తమ్ముఁ జేరునట్లు భటులకు తరువిచ్చి

వారిని వెనుక నడిపించి బండి నెక్కి ముందు నాయకుఁడును పురుషుఁడును వచ్చిరి. బండి సమీపింపఁగానే దీర్ఘకాయుఁడయిన యొక పురుషుఁడు వెనుకటివలెనే ాలెను కత్తినిధరించి ముసుఁగువేసికొనివచ్చి బండిబాని నదలించి బండి నిలుపుమని రస్వరముతోఁ బలికెను. బండివాఁడు బండి నిలిపెను. అంతట దొంగ వెనుక పునకువచ్చి బండిలోనివారిని బిలిచి "మీవద్దనున్న సొమ్మంతయు నిక్కడ పెట్టుఁడు. పెట్టనియెడల నా మనుష్యులవలన మీకు ప్రాణాపాయము సంభవించును." అని చెట్ల క్రింది మనుష్యులను జూపెను. ఆమాటలకుఁ బ్రత్యుత్తరము చెప్పక బండిలోనున్న నాయకుఁ డీలపట్టెను. వెంటనే మనుష్యులు పరుగెత్తుకొని వచ్చుచున్నట్లు చప్పుడు వినఁబడెను. అదిచూచి యాశ్చర్యపడి దొంగ పాఱిపోవఁ జూచుచుండఁగా బండిలోనుండి దుమికివచ్చి పురుషుఁడు వానిచేయిపట్టుకొనెనుగాని వాఁడు పట్టు తప్పించుకొని తన మనుష్యులున్నవంకకుఁ బలాయితుఁడయ్యెను. నాయకుఁడును పురుషుఁడును వానివెంటఁ బరుగెత్తిరి. ఇంతలో సైనికులునువచ్చి వారిని గలిసికొనిరి. కాని యా చెట్లక్రిందనున్న యాయుధపాణులు పాఱిపోవుటకుఁగాని ముందుకువచ్చి తమ యజమానునికి తోడుపడుటకుఁగాని ప్రయత్నించలేదు. భటులువచ్చి తన్నుఁబట్టుకొనఁబోఁగా దొంగ యెదురుతిరిగి నిలువఁబడి "మీరు నన్ను విడిచిపొండు. పోనియెడల మిమ్ములనందఱిని నఱికివేయవలసినదని నామనుష్యుల నాజ్ఞాపించెదను." అని బెదరించి పలికెను. వారామాటలకు బెదరక తనకు లోఁబడవలసినదని ముమ్మాఱుపలికి కడపట వానిమీఁదఁబడి బెత్తములతోఁ బొడిచిరి. వాఁడు మూర్ఛితుఁడయి క్రిందఁబడెను. వాని మనుష్యు లప్పటికినివచ్చి తమ యజమానునికి సాయముచేయలేదు; ఉన్నచోటనుండి కాలైనను కదలుపలేదు. అప్పుడు నాయకుఁడు తన భటులనుబిలిచి యామనుష్యులు ధరించియున్న యాయుధములను క్రిందఁబెట్టించి వారిని నిరాయుధులను జేయవలసినదని నియమించెను. భటు లాజ్ఞాపించినను వారాయుధములు క్రిందఁ బడవేయలేదు. భటులు కత్తులుదూసికొని యీటెలు చాచుకొని పోయి యా మనుష్యులమీఁదఁ బడఁగా నా విగ్రహములన్నియు ప్రాణములేని నిర్జీవప్రతిమలయ్యెను. నిజముగానే యవి లోపల గడ్డిపెట్టి కుట్టి మనుష్యాకారముగా నిర్మింపఁబడిన కృత్రిమ మనుష్య రూపములుగాని మనుష్యులుకావు. రంగులువేసి బట్టలుకట్టి నేర్పుచేత నిజమయిన మనుష్యరూపములయి నట్లెల్లవారికిని భ్రమకలుగునట్లుగా వానిని చెట్లక్రింద నిలువఁబెట్టఁగా, వానిని జూచినవారెల్లరును మోసపోయి యాయుధపాణులయిన మనుష్యులని జడిసి తమ విత్తములనా దొంగకు సమర్పించుచుండిరి. ఈవింత కన్నులపడి యా పురుషుఁడును నాయకుఁడును భటులును పడియున్నదొంగను మోచుకొని సమీప

మునసున్న బదరికాశ్రమయోగి యాశ్రమమునకుఁబోయిరి. పోయి పిలువఁగా నాశ్రమములో యోగిలేఁడు. అప్పుడు వారాశవమును పర్ణశాలలోఁబెట్టి దీపము వెలిఁగించి తెచ్చి పయినున్నబట్టను దీసిచూడఁగా నాదొంగయే బదరికాశ్రమదై యయ్యెను. అప్పుడెల్లవారికిని గలిగిన యాశ్చర్యమునకు మేరలేదు. ఆటుతరువా రాశ్రమమునంతను శోధించిచూడఁగా నొక గుడిసెలో మూలను బహుజనులఁ దోచుకొన్న ధనమును వివిధవస్తువులును కనఁబడెను. ఆయోగిపుంగవుఁడు చిరకాలమునుండి పగటిపూట మస్కరియయి జపతపములుచేయుచు రాత్రిపూట తస్కరుఁడయి కాసువీసములు గడించుచుండెను. ఎవ్వఁడును గడ్డము పెంచుటచేతను కాషాయవస్త్రములు కట్టుకొనుటచేతను నిజమైనయోగి కానేరఁడు. యోగులమని వేషములు వేసికొనువారిలో నిట్టి మహాపురుషు లిప్పుడు సహిత మనేకులుగలరు.

శ్రీసర్వేశ్వర సంకల్పజనిత భువనమత్త్వ నియత సత్యవ్యాపార ప్రదర్శక శ్రీ మహామహోపాధ్యాయ శ్రీమత్పరవస్తు వెంకటరంగాచార్యార్యవరగురు ప్రియశిష్య శ్రీమన్మృత్యుఞ్జయ నిశ్శఙ్క భూపాలవిరచిత చతుస్సంఖ్యాకపద్యాని.

ప్రశ్నము.

గీ. చనినవెనుకనురానివి సరవి నెవియొ। వచ్చినను జనకుండు వ్యవస్థ లెవియొ
మరలవచ్చుచుఁబోవు నామహిమ లెవియొ। తెలియఁజెప్పఁడిభువిలోన తేటమీగ.

ఉత్తరము.

గీ. మానమును జీవమును బోయి మరలరావు। క్షితినివచ్చినఁబోవ వకీర్తి కీర్తి
కలిమిలేములు వచ్చుచుఁ దొలఁగుచుండు। తేఁటగను జెప్పితిని విను తేజమలర.

ప్రశ్నము.

గీ. ఇంటనేయుండు నెప్పుడు నెవ్వియెవియొ। వెంటనేయుండు నెవ్వియో వేరుగాక
తప్పకయ చెప్పవలయును తత్క్షణంబె। విమలమతులైన విజ్ఞాన విబుధులార.

ఉత్తరము.

గీ. వాడికపవాడికయు రెండు వసతినుండు। పుణ్యపాపంబు లీరెండు బొదలు వెంటఁ
దప్పకయ చెప్పితివినుండు తత్క్షణంబె। విమలముగఁ జెప్పినాఁడను వేత్తలార.

దయానందసరస్వతి.

దయానంద సరస్వతులవారు ఉత్తర హిందూస్థానమందలి "ఆర్యసమాజ" పకులు. రామమోహనరాయులకును, కేశవచంద్రసేనుగారికిని, వీరికిని మిగుల వ్యత్యాసము కలదు. ఈయనకు హూణభాషయందుఁ బరిచయము లేకపోవుట గొప్ప లోపముగాఁ గానుపించుచున్నది. ఈయన చరిత్ర "థియాసఫిస్టు" అను పత్రికలో వ్రాయఁబడినదాని ననుసరించి యీ క్రింద వ్రాయుచున్నాము.

కత్తివార్ పరగణాలోఁ జేరిన మార్వీమండలాధిపతిగారి యధికారములోఁ జేరిన యొకపట్టణములో నివసించియున్న ఉత్తరదేశపు బ్రాహ్మణకుటుంబములో ౧౮౨౪వ సంవత్సరమునం దీయన యుద్భవించిరి. ఈయన కయిదు వత్సరముల ప్రాయము రాక పూర్వమే దేవనాగరీభాష చదువ నారంభించిరి. వీరి కుటుంబము యొక్కయు, కులముయొక్కయు ఆచారములనుబట్టి యీయనకు మంత్రములు శ్లోకములు విశేషముగా జెప్పుచుండిరి. ఆయన కెనిమిదవయేట ఉపనయనము జేసి గాయత్రీ మంత్రోపాసన జేసిరి. తండ్రిగారు శైవమతస్థు లగుటచే జిన్ననాడే పార్థివ లింగపూజ చేయు క్రమమంతయు వీరికి గఱపి ఈయనచేఁ బార్థివము చేయించుచువచ్చిరి. ఈయనకు దుర్బలశరీర మగుటచే నుపవాసములు మొదలగునవి ఈయనచే జేయించుట తల్లిగారి కెంతమాత్రము నిష్టము లేదు. కాని తండ్రిగారు బలవంతపెట్టుటవలన నట్లు చేయుట తప్పకపోయెను. అందువలన తలిదండ్రుల కన్యోన్యకలహములు జరుగుచు వచ్చెను. ఈలోపల సంస్కృతవ్యాకరణమును చక్కగ నభ్యసించి, వేదములను పఠించి, శివాలయములకు తండ్రిగారితో దరుచు బోవుచుండిరి. ఈయన తండ్రిగారికి శివపూజయందు విశేషముగా నాసక్తిగలదు.

తండ్రిగారు షాహుకారును, రివిన్యూకలెక్టరును అగుటచే వీరి కుటుంబ మనుకూలముగానే కాలము గడపుచుండెను. కాని పార్థివలింగపూజావిధానమునం దీయనను ప్రవేశపెట్టుట మొదలీయనకు గష్టము లారంభించెను. పార్థివపూజచేయించుటకు బూర్వమీయన యుపవాసముచేసి శివాలయములో నొకరాత్రి జాగరముండుట కీయన తండ్రిగారితోఁ బోయిరి. రాత్రి రెండుయామము లయినతరువాత అర్చకులు మొదలగు నవుకరులు, ఇతరభక్తులు కొందఱు గర్భగుడి విడచివచ్చి నిద్రపోవ నారంభించిరి. నిద్రపోయినయెడల ఫలము దక్కదను హేతువుచే నీయనమాత్రము నిద్రపోలేదు. కాని ఈయనతండ్రిగారుకూడ నిద్రపోయిరి. ఈయనతప్ప తక్కినవారందఱు నిద్ర జెందినవెనుక యీ ప్రకార మాలోచింపదొడగెను. "నందివాహనముపై గూర్చున్న

యీ విగ్రహము నడవగలదనియు, భుజించుననియు, నిద్రపోవుననియు, త్రిశూలమును ధరించుననియు, శపించగలదనియు ననేకులు చెప్పుచున్నారు. నిజముగా ఈవిగ్రహమే పరమేశ్వరుఁడగు మహాదేవుడై యుండునాయని నాలో నేనాలోచించి ఎంతవరకాలోచించినను నాకు నమ్మకము లేక నాతండ్రిని లేపి వేదములయందు [illegible] బడ్డ పరమేశ్వరుఁడు నాయెదుటనున్న శిలావిగ్రహమయ్యుండునాయని యడిగితిని. 'నీవెందుకట్లడిగితివని' మాతండ్రి యడిగెను. అట్టి పరమేశ్వరుఁడు నాయెదుట కనపడే విగ్రహమయ్యుండడనియు ఈ విగ్రహముమీఁద చుంచులు మొదలగునవి ప్రాకినను యేమియు మాట్లాడదనియు ఇట్టి క్షుద్రజంతువులనుగూడ మీద ప్రాకించుకొను నీ బొమ్మ పరమేశ్వరుఁడని చెప్పుటకు వీలులేదనియు నేను ప్రత్యుత్తరమిచ్చితిని. పవిత్రులగు బ్రాహ్మణులచే బ్రతిష్ఠ జేయఁబడిన యీ శిలావిగ్రహము భగవంతుఁడేయనియు, కలియుగమునందు శివుడు ప్రత్యక్షము గాకుండునుగనుక, ఈవిగ్రహము భగవంతుఁడే యని నిరూపించి భక్తులందఱు నారాధింతురనియును మా తండ్రిగారు చెప్పిరిగాని యీమాటలందు నాకంతవిశ్వాసము లేకపోయినది.

ఆకలిబాధ విశేషమగుటచే నింటికిఁబోవుటకు మా తండ్రిగారిని వేడగా నుపవాసఫలము దక్కదని వారు చెప్పినను వినక యింటికిబోయి మాతల్లి యొసగిన యాహారమును భుజించి గాఢనిద్ర జెందితిని.

తరువాత మా తండ్రిగారువచ్చి వ్రతభంగమువలన నాకు గలుగు పాపమును గూర్చి కొంతవఱకు ముచ్చటించిరిగాని విగ్రహములందలి నమ్మకము నాకదివరకే పోయినందున నా యభిప్రాయమును బయలుపుచ్చక కాలమంతయు విద్యాగోష్ఠియందు వినియోగపరచుచుంటిని.

మాకుటుంబములో నాకిద్దఱుతమ్ములు, ఇద్దఱు చెల్లెండ్రునునుండిరి. నాకు పదియాఱువత్సరముల ప్రాయమప్పుడు నా చిన్నతమ్ముఁడు జన్మించెను. ఇట్లుండగా నాతో బుట్టువులలో పదునాలుగేండ్ల వయస్సుగల యొక చిన్నది ఆకస్మికముగా నొకరాత్రి మరణమునొందెను. నేను పుట్టినతరువాత దుఃఖములకదియే ప్రథమము. కావున నాకు విచారమెక్కువగానుండెను. మిత్రులును బంధువులును విచారమగ్నులయి రోదనముచేయుచు నాచుట్టును జేరిరి. నేను ప్రతిమవలె నిశ్చేష్టితుఁడనై కదలనేరక నిట్లాలోచింపదొడగితి. 'ఈ ప్రపంచమందలి జీవకోటికి మరణము నిశ్చయము. ఎప్పుడో నాకును చావుతప్పదు. కాఁబట్టి యీ దురవస్థను తగ్గించుట కేమిచేయగలను? ఎక్కడికిబోదును? మోక్షముదొరకువిధమెద్ది" యని యాలోచించి, ఎట్టి శ్రమనైన నోర్చి మరణబాధనుండి తప్పించుకొనువిధ మారయుటకు కృతనిశ్చయుఁడ

నైతిని. కాని నా యుద్యమమును బయలుపరచక నుపవాసములు మొదలగు యాచారములు మానివేసితిని. పిదప కొంతకాలమునకు ఘనమైన విద్వాంసుఁడగు నా పితృవ్యాసోదరుఁడు కాలధర్మమునొందెను. ఆయన నన్ను మిగుల దయతో నాదరించుచుండెను. ప్రపంచమందలి పదార్థములన్నియు నస్థిరములనియు, వానిలో నేవియు జీవితేచ్ఛ గలుగజేయదగినవి కావనియు, నాకుగల యభిప్రాయములను ఆయన మరణము మరింత బలపరచెను.

ఆ సమయమందు నా తలిదండ్రులు నాకు వివాహముచేయ నిశ్చయించిరి. గృహస్థాశ్రమ మన్నచో నాకెప్పు డనిష్టమగుటచేఁ దద్వత్సరాంతమువరకు నావివాహ మాపవలసినదని వారిని నేను వేడుకొంటిని. అందులకు వారియ్యకొనిరి. సంస్కృత విద్యాభ్యాసమునకై కాశీపట్టణమునకుఁబోదలచినను, నన్ను బోనీయక మాగ్రామమున కారుమైళ్ళదూరమందున్న యొక వృద్ధవిద్వాంసునొద్దకు బంపుచుండిరి. నేనచ్చట కొంతకాలము గడపినవెనుక నా వివాహమునకై మరల నింటికి రావించిరి. నాకప్పటికి వయస్సు ఏకవింశతి వత్సరములు. వివాహమును దప్పించుకొను విధములేక, నేనెన్నటికిని వివాహమాడనని కృతనిశ్చయుడనై, రహస్యముగ గృహమువెడలి పారిపోతిని.

గృహమువిడచినవెంటనే, మాతండ్రి నావెనుక కొంతమంది రౌతులను పంపించినను వారిబారికి లోనుగాక ప్రయాణమై పోవుచుండఁగా మార్గమధ్యమందు కొందఱు యాచకబ్రాహ్మణులు కనుపడి ఈ జన్మమునందు విశేషముగా దానముచేసినయెడల ముందుజన్మమునందు మిక్కిలి లాభించునని బోధచేసి నాకుగల యావద్విత్తము నపహరించిరి. తరువాత కొన్నిదినములకు శైలాపట్టణముచేరి అచ్చట నివసించు లాలా భాగవత్ అను విద్వాంసునకు శిష్యునిగానుండ నిశ్చయించితిని.

నేను వారి యాశ్రమ స్వీకారముచేసినపిదప నాకు శుద్ధచైతన్యుఁడని నామకరణముచేసి, కాషాయ వస్త్రధారణము చేయించిరి. ఈ నూతనవస్త్రములతో అహమదాబాదు పట్టణసమీప ప్రాంతములకుబోయితి. నా దురదృష్టవశముచే మా కుటుంబము నెరిగిన యొక బైరాగి నాకు గనఁబడెను. సిద్ధపురములో జరుగు సభకు నేబోవుచున్నట్లు తెలిసికొని, ఆయన మా తండ్రిగారికి వర్తమానము జేసెను. దారాది స్వాములవారి శిష్యబృందముతో మహదేవుని యాలయములో నేనుండగా మాతండ్రి నాయొద్దకువచ్చెను. నేనెంతవేడుకొనినను సమ్మతింపక తనతోకూడ వచ్చిన కొంతమంది శిపాయిలకు నన్ను స్వాధీనపరచెను. కాని వారిని తప్పించుకొని అహమదాబాదు నగరమునకు దిరిగిపోవదలచి మార్గమధ్యమందు బరోడాపట్టము జేరితిని. అక్కడ కొన్నిదినములుండి చేతనమఠములోనుండు బ్రహ్మానందస్వామి మొదలగు

కొందఱు బ్రహ్మచారులతోను, సన్యాసులతోను వేదాంతశాస్త్ర విషయములగూర్చి చర్చించితిని. జీవుడు బ్రహ్మము నొక్కటేయనియు, నేనే బ్రహ్మమనియు బ్రహ్మానంద స్వాములవారివలన నేను స్పష్టముగా దెలిసికొంటిని.

పిమ్మట వారణాశికింబోయి యచ్చటి పండితులతో గృతపరిచయుడనైతిని. వారి సెలవుప్రకారము నర్మదాతీరమందలి యొకప్రదేశమునకుంబోయి పరమానంద పరమహంసస్వాములకు శిష్యుండనై వేదాంతసారము, వేదాంత పరిభాష మొదలగు గ్రంథముల నభ్యసించుచుంటిని. బాల్యుండనైనను సన్యాసాశ్రమమును స్వీకరించుట కిష్టపడగా, నాకు ఆశ్రమ స్వీకారముచేసి సన్యాసి దండమునొసగిరి. అదిమొదలు నాపేరు దయానందసరస్వతి యని వాడబడుచుండెను.

కొంతకాలమునకు బిదప యోగానందుల వారియొద్ద యోగాభ్యాసమునకై వ్యాసారామమునకుంబోయితిని. అచ్చట కొంతకాలము యోగాభ్యాసముజేసితినికాని యోగమందు సంపూర్ణప్రజ్ఞను పొందుటకై అహమదాబాదు పట్టణసమీప ప్రదేశములకు వచ్చి యోగవిద్యయందలి రహస్యముల నిద్దరు యోగినులవలన నేర్చుకొంటిని. తరువాత రాజపుత్రస్థానమునందలి ఆబూపర్వతమునకు యోగవిద్యయందలి క్రొత్తయంశములను నేర్చుకొనుటకుంబోయి ౧౯౧౨ వ సంవత్సరమునందు యోగాభ్యాసమునకై హరిద్వారమునందుఁ జేరిన యోగసమాజములోఁ జేరితిని.

మైడీపట్టణమున గొంతకాలము గడపినపిమ్మట అచ్చటి బ్రాహ్మణుల తంత్రశాస్త్రములును వారి మాంసభక్షణనుచూచి భయముజెంది అచ్చోటువిడిచితిని. (ఇంతవరకు వ్రాసిన దయానంద సరస్వతులవారిచరిత్రము వారు స్వయముగా వ్రాసినదే.

తరువాత కొన్నివత్సరములు హిందూస్థానమందలి దేశాటనముజేయుచు మహాత్ములకై వెదకుచుండిరి.

కొన్నిదినములు అన్నము, పాలతోను కొన్నిదినములు ప్రత్యేకము క్షీరములతోను కాలముగడపిరి. కొంతకాలము భంగు మొదలగు మత్తుద్రవ్యముల నలవాటు చేసికొనినందున విశేషము మత్తులో మునిగియుండుట తటస్థించెను అని మాక్సుముల్లరు దొరవారు వ్రాయుచున్నారు. ఒకానొకదినమం దొక శివాలయములో నందికేశ్వరుడుండు స్థలమున కెదురుగా దయానందులవారు కూర్చుని వారి పుస్తకములు మొదలగువానిని నందిమీదనుంచి, యాలోచనచేయుచుండిరి. అకస్మాత్తుగా నందికడుపుక్రింద చూడగా నొకమనిషి దానికడుపులో దాగియున్నట్టు కనపడినదట. వెంటనే దయానందులవారు చేయిచాపగా వాడు భయపడి పరుగెత్తెనట.

(సశేషము) ఆ. సుందరరామయ్య.

క. ధనమప్పుగొనినయాతఁడు । పనువడఁ దనచేత వ్రాసి పత్రిక దాని
ఇచ్చిన నది నిక్కపుఁబత్త్రం । బనుమానము లేదు పాడియాడెడుచోటన్. ౧౧౦.
క. చిరిఁగినఁ దునిసినఁ బత్త్రా । క్షరములు సందియములైనఁ గడుదూరముగాఁ
బరదేశమందు నున్నను । వరుసం బత్త్రాంతరంబు వ్రాయింపవలెన్. ౧౧౧.
క. తప్పక సాక్షులముందట । నప్పుగొనిన యతఁడు తనకు నాయతిగలచో
నెప్పటివారలు నెఱుఁగఁగ । నప్పుమగుడఁ బెట్టుమనిరి యాదిమునీంద్రుల్. ౧౧౨.
క. తులయును నగ్నియు విషమును । జలమును గోశంబు ననెడి సత్యములెల్లన్
వలయును సాక్షియుఁ బత్త్రముఁ । దెలుపఁగ లేకున్నఁ బాడిదీర్చెడుచోటన్.
క. తులవిప్రులకును క్షత్త్రియ । కులజులకనలంబు జలముకోమట్లకు శూ
ద్రులకును విషమిడి తెలిగొన । వలయుం గోశమదియొండు వర్ణులకెల్లన్. ౧౧౪.
క. అభియోగించినసత్యం । బభియుక్తుఁడు సేయవలయు నటుగాకయుఁ దా
నుభయానుమతముగల్గిన । నభియోగికి నైనసత్య మర్హముచేయన్. ౧౧౫.
క. వినుమూఁడుమాడలకు విష । మెనుబదిటికి నగ్ని యఱువదింటికిని జలం
బును నలువదింటికిని దుల । యును నిడి తెలిగొనుట ధర్మమువ్యాసులకున్. ౧౧౬.
తొలునాఁడు శోధ్యునిఁ దులఁదూఁచి యాతని యెత్తైన యిట్టికలెల్ల దాఁచి
సత్యదినంబున సరిత్రాసుపూజించి యందు దిక్పాలురనావహించి
పూర్వముఖంబుగాఁ దుల శోధ్యునెక్కించి యెప్పటి యిట్టికలెల్లఁ బెట్టి
దైవంబులార యీతఁడు శుద్ధుఁడవునేని నెత్తుఁడు దింపుఁడు హీనుఁడైన
ననుచుఁ బ్రాడ్వివాకుఁడు చెప్పు నవసరమున । శోధ్యుఁడున్నతిఁ బొందిన శుద్ధుఁడయ్యె
నొక్కరూపుగ దిగఁబడ్డ నోడెనండ్రు । సత్యనిర్ణయమెఱిఁగెడు సాధుజనులు.
క. ఇనుమున నేఁబదిపలముల । నెనిమిదివ్రేళ్లాయతముగ నేర్పడగుండై
నునుపైయుండఁగఁజేసిన । మనమున నిదిమద్దునకుఁ బ్రమాణంబయ్యెన్. ౧౧౭.
సీ. పదియాఱువ్రేళుల పరపుమండలమునై యంతియవెడలుపునైన దాని
భక్తితోనర్చించి ప్రాచీముఖంబుగాఁ బడమటశోధ్యునిఁ బరఁగనిలిపి
యాతనిదోయిట నశ్వత్థపర్ణంబు లేడిడి ప్రోఁగు లేడింటఁ జుట్టి
పరఁగనక్షతలుపై నెరపి కాఁగినమద్దు కాఱుననితికించి కడఁగి తెచ్చి
ప్రాడ్వివాకుండుమంత్రపూర్వకముగాఁగఁ । బెట్టుటయు మండలము లేడుమెట్టికడచి
పోవనైచినఁ జేతులు పొక్కవేని । శోధ్యుఁడెల్లరునెఱుఁగంగ శుద్ధుఁడయ్యె. ౧౧౮.
సీ. పరికింపఁగాఁ బొడ్డు బంటినీళులలోన నొకమానుచేతికి నూఁత గాఁగ
మూఁడవశరశబ్దమున శోధ్యుఁడగువాఁడు మునిఁగిన దరిసున్న జనుఁడు నడుప

లమ్మెసినంతదవ్వతివేగమునఁ బాఱ నందుండివేఱొక్కఁ డతిరయమునఁ
బఱతెంచి దరిమున్న పాతినతోరణ స్తంభంబు ముట్టినంతటికిమున్న
మునిఁగినతనిఫాలమును గ్రిందియంగముల్ । గానబడకయున్నఁ గలుగుగెలుపు
కానవచ్చెనేనివానికి నోటంబు । తప్పదండ్రు ధర్మతత్త్వవిదులు. ౧౨౦.

గీ. క్రొత్తకుండలోనఁ గ్రూరసర్పమునిడి । యర్చితముగఁ జేసి యందులోన
నిమ్మపండువేసి నెమ్మితోఁ దివియంగ । శోధ్యుఁడైనవాఁడు శుద్ధుఁడయ్యె. ౧౨౧.

క. తనపడసిన సొమ్మయినను । దనవలసినయట్లు పంపఁదగుఁ బుత్రులకున్
దనతండ్రి పడపుసుతులకు । జనకుఁడు పంచంగవలయు సరిపాళులుగన్. ౧౨౨.

క. జనకునితో రెండైనను । జననికి ఋతుసంభవంబు సమసినఁ బుత్రుల్
మునుకొని తమతమపాళ్లను । జనకునితోఁ బంచుకొంట సద్ధర్మముగున్. ౧౨౩.

క. పలువురు యువతులుఁ బుత్రులు । పలువురుఁగల యతఁడు వేఱువాయఁదలఁచినన్
లలనలుఁ బుత్రులుఁ దాసును । తలకొని మెయిపాలుగొనుట ధర్మంబెందున్.

క. నాయంతబ్రతుకనేర్తుం । బోయెదననుసుతుని రిత్తఁబుచ్చకతనికిన్
వేయింటికిఁ బదినైనను । దాయముగా నిచ్చిపుచ్చఁదగు జనకునకున్. ౧౨౫.

క. ఉత్తమమగు ద్రవ్యంబును । విత్తంబును నగ్రజునికి వింశాంశంబున్
బొత్తునసిచ్చి సహోదరు । లత్తిసమాంశంబుగొనుట యర్థ్యంబెందున్. ౧౨౬

గీ. పెండ్లిచేసిన నిలుచెడి పేదలైన । కూఁతులకుఁ దల్లిధనమైనఁ గొనుటయుచిత
మందఱును నొక్కభంగివారగుచుఁ రేని । దారుమెయిపాలుగొనుటయు ధర్మమెందు.

క. జనకునిధనమును బోరయక । కనినధనముఁ జెలిమివేరె గనినధనంబుం
దనయత్తవారువెట్టిన । ధనముం దనధనమయండ్రు తత్త్వవిధిజ్ఞుల్. ౧౨౮.

క. జనకుఁడు తనుఁ జదివించక । జనకుని ధనమైనఁ గుడిచి చదువక తనయం
తనకుడిచి చదివిపడసిన । ధనముం బాలడుగలేదు దాయాదులకున్. ౧౨౯.

క. పితృధనమితరులచే నప । హృతమై చెడియుండి పిదప నెవ్వనిచే సు
స్థితమగునది సాధించిన । యతనిధనము సోదరులకు నతఁడీఁగలుగున్. ౧౩౦.

క. నాలుగువర్ణములందును । నోలిని విప్రునకుఁ బుట్టియున్న తనూజుల్
నాలుగుమూఁడును రెండును । బోలఁగ నొక్కటియు నంశములుగొనవలయున్.

సీ. పొత్తునజనకుండు పుత్రుండునున్న నాఁడేర్పడఁ దమలోన నెవ్వఁడేని
గట్టినచీరలుఁ బెట్టినతొడవులు నెక్కెడివాహంబు లింటిలోనఁ
బాయనికొలుచును బానిసలోను గా నవరుద్ధలైయున్న యంగనలును
మంచంబుపీఠంబు కంచంబుచాపము చెప్పులుగొడుగులు చేటపెద్ద

పాయకెప్పుడుఁజెల్లు సంపదలువరుసఁ । దొల్లిచెల్లినభంగిని జెల్లనిచ్చి
పెఱధనంబులు తమలోన వేరువేర । నొక్కభంగిగఁ బాల్గొను టుత్తమంబు.

క. జనకునివస్త్రంబులు వా । హనములు శయ్యలునుఁ దొడవు లతఁ డీల్గిన నా
తని శ్రాద్ధంబునఁ గుడిచిన । తనికిం దగుఁబుచ్చుకొనఁగఁదగదు సుతులకున్. ౧౩౩.

క. మనుమలు తాత ధనము పా । ల్గొన యోగ్యతగల్గి పంచుకొనుచోఁ దమకుం
జనకులు పెక్కండ్రైనను । జనకులయంశములు గొనుట సద్ధర్మమిలన్. ౧౩౪.

క. కొడుకులు వేఱైనతుదిం । గొడుకుదయంబైనఁ దండ్రికొనినంశం బా
కొడుకు ధనము మునుపాసిన । కొడుకులకుం దండ్రిధనము గొనలేరెందున్. ౧౩౫.

క. వనిత పతిచేతఁ బడసిన । ధనముతగినవారి కియ్యఁదగు క్షేత్రము దా
ననుభవముకొనక యొరులకుఁ । దనచనవుననీగి యనుచితంబండ్రు బుధుల్. ౧౩౬.

గీ. స్త్రీధనంబుపేరఁజెల్లిన ధనమెల్లఁ । గూఁతుఁజేరుఁ గూఁతుకూఁతుఁజేరుఁ
గూఁతుఁగానకున్నఁ గొడుకుపాలగుఁగాని । వేరుపాలివారు వెదకలేరు. ౧౩౭.

క. కొడుకులుగలశూద్రులకుం । బొడమిన దాసీసుతుండు పుత్రులలోఁ దా
నొడఁబడి యాపాల్గొనఁదగుఁ । గొడుకులులేకున్నఁ దానెకొను ధనమెల్లన్.

క. ముందరవేఱైపిదపం । బొందినసోదరుఁ డొకండు పుత్రుండైపో
వందడవానియర్థముఁ । బొందినవారలకపోవుఁ బోదితరులకున్. ౧౩౯.

గీ. జనుతెఱుంగఁబాడి సవతులకొడుకులు । కలసిరేని యొకఁడు పొలిసెనేని
వానిపాలిధనము వానిసోదరుఁడును । వానిఁ గలసినతఁడు వరుసఁగొండ్రు. ౧౪౦.

క. అదటమునుపాసిన భి । న్నోదరులును సోదరులును నొక్కటియైనన్
సోదరులకువచ్చును భి । న్నోదరులకురాదు పుత్రునొడమి ధరిత్రిన్. ౧౪౧.

ఉ. ఆలునుదండ్రియున్ సుతసుతాలియు సోదరులుం గృహస్థులుం
బోలఁగ సద్గురుండు తనుఁబొందినశిష్యుఁడు పుత్రహీను సొ
మ్మేలిన నైకొనంజను మఱొక్కనికిఁబనిలేదు భూవిభుం
డేలినవాఁడుగానఁగొను నెవ్వఁడులేనిధనంబు లిమ్ముగన్. ౧౪౨.

క. గాలినిదెవులున నాప । త్కాలంబున మేటి రాజకార్యంబున ని
ల్లాలిధనము పతిగొనఁదగుఁ । బోలదు పెఱపట్లయందుఁ బుచ్చుకొనంగన్. ౧౪౩.

క. చీఁకుంబిచ్చుకకుంటును । మూకుశిఖండియును నిక్కముగఁ దమపాళ్లం
జేకొనఁజాలరువారిం । జేకొనఁగావలయు ధనముఁ జేకొన్నజనుల్. ౧౪౪.

క. తనయవిహీనుఁడు చచ్చిన । ధనముంగొని ఋణము నరుపఁదగు దాయాదుల్
ధనపుత్రహీనుపిమ్మటఁ । బనిలేదు ఋణంబుదీర్పఁ బత్న్యాదులకున్. ౧౪౫.

ఉ. పానియువేరువాయనని పైఁబడియొక్కఁడు పల్కెనేనియుం
బానిసనాఁటిపత్రములుఁ బాయుటెఱింగిన జ్ఞాతివర్గముల్
డానిసబంధుమిత్రులు నొడంబడనిచ్చిన కొన్నియప్పులుం
బానిసయిల్లు వేఱుతెలుపందగువానికి నూఱెలుంగఁగన్. ౧౪౬

సీ. గ్రామంబు పొలిమేర కలను చే నిలుపట్టుకాలాంతరంబునఁ గలసెనేని
వృద్ధుల గొల్లల వేఁటకాండ్రను బొంతఁజేలఁగర్షనమొప్పఁ జేయువారిఁ
బనిచిసీమకుమున్న పాతినబొగ్గుల నిసుకల రాలను నెమ్ముకలను
గట్టినకట్టలఁ బెట్టినమ్రాఁకులఁ ద్రొచ్చినబావులఁ గూపములను
సీమఁదెలుపవలయు నేమియులేకున్న । నూలిఁ జుట్టుపట్టియూళ్లఁగలుగు
ప్రజలుసాక్షిగాను బ్రతిపత్తుఁబట్టిన । నరుఁడు సీమదెలియనడువవలయు. ౧౪౭

క. మునులేని సీమసంధికిఁ । బెనఁకువయైయున్నచోటఁ బెనఁకువపొలముం
జన నెఱిఁగి యూరిధనమునఁ । బెనుపారఁగ రాజు పంచిపెట్టఁగవలయున్. ౧౪౮

గీ. ఒకనిపొలములోన నొకఁడు ధర్మార్థంబు । కొలనుబావినుయ్యి ద్రొచ్చుచోట
నడిగిచేయవలయు నొడయఁడుచేనికి । హానికల్గునేని నాఁగఁదగును. ౧౪౯

చ. చెఱువొకరుండుకట్టిన విశేషపులాభము లేకయున్నచో
నెఱయఁగ వేఱొకండు తననేర్పునఁ గట్టఁదలంచెనేనియుం
జెఱువొగిఁ గట్టినాతనికిఁజెప్పి యొడంబడఁగట్టుటొప్పుఁ దా
నతిమఱిఁగట్టెనేని ఫలమంతయు ముందటివానిపాలగున్. ౧౫౦

క. దున నియ్యకొన్నకృషికుఁడు । దునకయయున్నని యొకనిఁ దున్నింపఁదగున్
దునకదునసీకయాఁగినఁ । గొననగుఁజేనియరియుఁ గోరు నతనిచేన్. ౧౫౧

క. తజ్ఞులకుఁ దెలియునట్లుగఁ । బ్రాజ్ఞులు మదిమెచ్చఁ దెలుఁగుపద్యములను ద
త్వజ్ఞుఁడు మ్రానయకేతన । విజ్ఞానేశ్వరము జగతివెలయఁగఁజెప్పెన్. ౧౫౨

సంపూర్ణము.

క. శరములు గురియఁ దొడంగిన । నరనాథులు ప్లవగయూథనాథులుఁ గడుస
చ్చెరువొంది యిపుడు వోయెక్ । బురిఁబడ నరిబలము ద్రోలఁ బొడగనమే దిక్.

వ. పయినుండి ఘోరనారాచంబులు పడుచున్నయవి రావణాను మఱిం గాలమేఘం
బులు గురియు నిడువాలుం బిడుగులు గావు గదా యనుటయు విభీషణుండు.

క. మొదలఁ బొడకట్టిపోవఁడె । యదృశ్యుఁడై యొక్కరథికుఁ డతఁ డగ్నివరో
న్మదుఁడై వచ్చిన రావణి । యిదె యిప్పుడు మింటఁ డాఁగి యేయం జొచ్చెన్.

చ. అనవిని రాఘవుండు నిశితాస్త్రము లంబరవీథికేయఁ దొ
ట్టినకుహనాపయోదముల టెక్కునఁ దాఁకిపడం దొడంగె నం
దున వెలుఁగంది తోఁడతని తూపులు ద్రుంచుచునుం దెవాఁడునుం
జునిఁగి జునింగి తూపడరుచో టెలుఁగంబడ నీకమాయలన్.

వ. గగనంబున నెల్లెడలం దానై గర్జిల్లుచుం గఠినబాణంబులు గుప్పుచుం గపులకుం
గాలంబు వచ్చెననిపించుచుం దెంపు చేసి.

సీ. పెడకుమీఁగాలికిఁ బుడమికిఁ గొననేయఁ బొగడదండలతోన పొలియువారు
నలువుర నేవురఁ దలలంటఁ గొననేయఁ దిక్కట్లతోడన తిరుగువారు
తొడలు వక్షంబులు దూరంగఁ గొననేయ మూటిలెక్కల మూడిక్క మ్రొగ్గువారు
నైకళేబరములు బరులునోఁ గొననేయ నెడకువతోడన మడియువారు
నగుచుఁ దచ్చరముల నగచరప్రళయంబు । పుట్టెననఁ బ్రసిద్ధ పూజ్యుఁడైన
యూథనాథుఁ డనక యొంటరి కాఁడన । కాకసమున కసువు లప్పగింప.

వ. కనుంగొనుచుం గౌసల్యానందనుండు సేయునదిలేక వింటికొప్పున దాకేలు వైచు
కొని యయ్యంధకారంబులో నిలువంబడి వారెవ్వరు విభీషణా నీవా సుగ్రీవా
నీవా నిన్నెన్నిదాఁకెన్ జాంబవంతుండున్నాఁడా యంగదుండా హనుమంతుండు
పడఁడు గదా యనుచు డగ్గుత్తిక వెట్టి పలుకుచున్నం జూచి లక్ష్మణుండు దేవా తాళినం
బని మెత్తిపోవుచున్నయది యరాతుసంబయ్యెడుం గాక జగంబని ప్రయోగింతు నే
బ్రహ్మాస్త్రం బీతులువయు నందులోనివాఁడై పోయెడు నటుగాదేని మన్నకైవచ్చి
యనేక దూరదేశవాసు లివ్వానరవీరు లాకసంబునకుఁ బ్రాణంబు లప్పగింపు
చున్నారిది చూచినం గడుపు దరికొనియెడు ననవిని యవ్విభుం డతని మొగంబై
యేమిచేయువార మొకనిపైఁ గినిసి పెక్కండ్ర నయుద్ధసన్నద్ధులం జంపరాదుగదా
యని వారించె నప్పుడమ్మేఘనాదుం డయ్యిరువుర నన్నదమ్ములమీఁదనుం బన్నగప్రదర
ప్రయోగంబు గావించె నంత.

క. కలయ డిగి కీలుకీల్లకుఁ । జిలువలు దగులుకొని పడఁగ చెలఁగులకుం దో
కలు ముళ్లుగొని బిగించెన్ । నిలిచిన నిలువున నెవారు నేలన్ వ్రాలన్. వ. అంత.

చ. బిసరుహ బంధునందన విభీషణు లుమ్మలికంబుతోడ వె
క్కసముగ బాష్పధార లొలుకంగని వీరవినోదచాతురీ
రసికుల రామలక్ష్మణుల రాజకుమారుల మోసపుచ్చె నే
డు సికిలి డాఁగిపోయి యొకతుచ్ఛుఁడు నేఁడని చింతనొందుచున్.

గీ. ఉండికొంతవడికి నుపశాంతసంతాపు । లైనవెనుక రావణానుజుండు
దండు గలయ నరయుచుండెఁ దన్నింద్రజి । ద్దృష్టిఁ జూచి కపులఁ దెలిసికొనుచు.

వ. అంత.

క. అచ్చిలువకోల్లచేత । న్నొచ్చిపడిన రాఘవులఁ గనుంగొని తనచేం
జచ్చిరను నిశ్చయంబునఁ । జెచ్చెరఁ దండ్రికడ కింద్రజిత్తుఁడు చనియెన్.

క. చని మ్రొక్కి రామలక్ష్మణు । లనియెడు వారన్నదమ్ములయ్యిరువురు నా
యనిమొనఁ జచ్చిరి చచ్చిరి । వనచరులుం బఱికపాలు వసుధం జిక్కెన్.

గీ. అనిననందనుఁ గౌఁగిట నలమియెత్తి । గజముపైఁ గంటవేయించి కలయవీటఁ
జాటఁ గాఁబంచె నతఁడు రాక్షసులకెల్లఁ । గ్రోఁతిమాంసమగ్గువయయ్యెఁ గొనుఁడటంచు.

వ. ఇట్లు రావణుండు పరమానందంబునం బొంది జానకిం దలంచి.

క. జలజానన యిఁక నేనియుఁ । గలయు నొకో నన్ను నన్నుఁ గదరించుటకున్
వలఁతులగు చెలులు చెనకులఁ । బలుకులఁ దేలింప ననుచుఁ బాతకియంతన్.

క. అక్కాంతఁ బుష్పకముపై । నెక్కించుకొని చని చూపి యదె రాఘవులన్
మక్కించె మేఘనాదుం । డొక్కఁడ యని యతని యాసయుడుపుఁ డటంచున్.

వ. తనకూడిగంబు సేయు రక్కసి మగువలం బనిచినం బోయి వారలత్తలోదరిం బుష్పకంబునం బెట్టుకొని చని పాలికలనిలోనం బడియున్న పిన్నయుం బెద్దయుం జూపి వీరిరువురు నీమఱఁదియు మగండును గద చచ్చిరి కనువిచ్చి చూడుమన నల్లతాతన్వి యుల్లంబు ఝల్లనం ద్రెళ్లి యుల్లంబోయి యల్లన యెట్టకేలకుం దెలిసి లేచి తేరికొనం జూచి.

క. హా రాఘవ నీనయనము । లారక్తాంతములు మొగిచె నవి యేమియొకో
నేరాఁగానో దాసుల । నేరము లెంచని దయాంబునిధికిటు దగునే.

క. తహతహఁ బెట్టితిఁ గానినుఁ । గుహనామృగవాంఛ ఫలము గుడిచితిఁ గా నీ
సహజన్ముఁడె యవ్వలిదోర । మహాత్మ సౌమిత్రి నీవు మాటాడఁగదే.

చ. అని విలపించుచున్నఁ ద్రిజటాసురి యల్లలితాంగిఁ జూచి యో
వనజదళాక్షి నీహృదయవల్లభుఁ డాయురుపేతుఁ డౌటనున్

నినుభరియించు పుష్పకము నిక్కము దెల్పెడు దివ్యయానముం
గని విధవన్ భరింపదటు గానఁ జలింపకు మమ్మ నెమ్మదిన్.

గీ. మేనికాంతికందమిని నీమఱందియు । బ్రతికియున్నవాఁడు పతివిహీన
యైన ఖలము నిలుచునా వారికడదోర । లున్నవారు చూచు మూరడిలుము.

క. అని తెలిపి క్రమ్మఱం దో । కొనిచనిరి యశోకవనికిఁ గోమలిన సురాం
గనలంతనిచట శోకం । బున మునుఁగుచు భానుసుతుఁడు మొదలగువారల్.

వ. రఘుకులరాజన్యులం బరివేష్టించి మీఁదెట్లోకోయని చింతించుచున్నం గనుంగొని
ఖేదంబునం గ్రోధంబు వెరిగి హనుమంతుండు.

చ. నమలెద నేతదాది భువనంబులు మంథనగాఢులైన రా
లుమిసెదఁ బంటి సంధిఁబడియుండఁగ నీకయజాండమంతయున్
జిమిడిచెదం బ్రతాపశిఖిచేతఁ బ్రపంచము చేసి నాతనిన్
నెమకెదఁబట్టెదం బిదప నేనతఁడేలెడు పట్టమేలెదన్.

క. అప్పటికి రాముఁ డించుక । తెప్పిరి తనదండమూర్ఛఁ దెలియనియనుజుం
దప్పక కనుఁగొని యిఁకనీ । వెప్పుడు కనుదెఱచి చూచెదే సౌమిత్రీ.

చ. అరులకుఁ గోరువెట్టితిగదా నినుఁదమ్ముఁడ వైరిఁ జంపి యో
వ్వారిపలమూపుమీఁద విలువైతు నయోధ్యకు నెట్లుపోవుదున్
మరలిసుమిత్ర నన్నడిగినం దలవంచుట యుత్తరంబె నీ
వరిగెడుచోటికే పయనమైతి విభీషణునప్పుబొంకితిన్.

చ. అనివిలపింప నారదమహాముని వచ్చి నృపాలుచేత వా
చనికనమస్కృతుల్ వడసి సంస్తుతితో వలచుట్టి దేవ నిన్
గనుఁగొనినన్ బ్రసాపడినశయ్యము నీరయిపోయెఁ గంటికిన్
జనునెయిటుండ నీకుఁ దలఁపన్ వలదయ్య సుపర్ణు నిత్తఱిన్.

క. ఈకుట్టిపురుగులేమగు । నీ తేజీవచ్చినపుడు నిఖిలేశ్వర నీ
వే తెలివిఁదెచ్చుకొమ్మని । యాతఁడు దీవించి చనియె నధిపుఁడు నాత్మన్.

వ. వైనతేయుం దలంచిన.

ఉ. ఎక్కడవచ్చునో యమృతమిమ్మని క్రమ్మఱనంచు వేలుపుల్
బొక్కలుదూఱఁగా నెగసి భూరుహకోటులు బారువెంబడిం
ద్రొక్క మహానినాదములతో వలితెక్కవెలుంగు దిక్కులం
జిక్కటిలన్ బిలేశయవిభేది నభోగతి వచ్చుచుండఁగన్.

క. మెదలెన్ మొదలనెుకించుక। వదలెన్ ముడిగొన్నముళ్లు వడిఁబుడమిఁబడన్
బ్రిదిలెం బిదపం బదమని। కదలెన్ రాఘవులఁబొదివి కట్టినపాముల్.

సీ. అంతనాగాంతకుం డరుదెంచి గరుదంచలామృతశీకర వ్యాప్తివెనుప
మునుపాజిభూమిఁ జచ్చిన వానరులు లేచివచ్చిరి చానున్నవారు బ్రతికి
రినవంశమణితమ్ముఁడును దానుబడలికల్ దేఱికూర్చుండిరి తిమ్ముఁబడియె
బలమెల్లఁ దల్లడంబులుమాని యావేళ భువనంబులకు మహోత్సవము దోఁచెఁ
బతియతనిఁ బిల్చి రమ్ము సుపర్ణ నీవు। దశరథుని మాఱు మాయాపదలు దలంగె
నీవలన నన్న దేవ నేనీకుబంట। నంతవలదని సేవించి యరిగెనతఁడు.

క. రవితోఁచఁ బ్రాచి నలుఁగడ। గవనులకుం బ్రాఁకి వీరకపులార్చిరి యా
రవమువిని రావణుండిది। సవిశేషముగా నెఱింగెఁ జారులవలనన్.

వ. ఎఱింగి యీయాపద గడచివచ్చినప్పుడ రాఘవులజేయులు కపులాడినవి యాటలని విచారించుచున్న ధూమ్రాక్షుండు.

క. తలకేలనీకు రాక్షస। కులనాయక కపులనృపులఁ గూల్చెద ననుచున్
నెలవందివచ్చె బహువిధ। బలములుగొలువంగఁ బటుహాంకృతులెసఁగన్.

గీ. ఇట్లుగవనివెడలి యేతెంచి తాఁకినఁ। గపులు చెట్టులెత్తి గట్టులెత్తి
వైచివైచి తురగవారణస్యందన। భటులఁ బిలుకుమార్చి పయికిఁగవియ.

శా. ఆధూమ్రాక్షుఁడు ఘోరసింహముఖవాహవ్యూహసన్నాహలీ
లాధౌరేయరథత్వరోద్ధతుఁడు గోలాంగూల ఖిత్రాభుభు
క్షాథోవద్విశిఖుండువచ్చె నడుమంజచ్చెన్ మరుత్పుత్ర బా
హాఘాత్రీధరపాదలంబడిన రథ్యస్యందనోపేతుఁడై.

క. ఆవార్తవిన్నయప్పుడ। రావణుఁ డతిరోషభీకర భ్రుకుటిముఖుం
డైవజ్రదంష్ట్రుఁ బంచిన। వేవచ్చెనతండపార వివిధబలముతోన్.

వ. ఇత్తెఱంగునం బురద్వారంబు నిర్గమించి మృత్యుముఖంబున వెడలివచ్చు చిచ్చు చందంబునం దోఁచి యవ్వజ్రదంష్ట్రుండు నిజబలంబులం గూర్చుకొని కపులం జుట్టుముట్టి చతురంగంబులం బట్టిసపరశ్వధప్రాసపాశ కృపాణాదులముంచినం గొంచించక యదలించి వానరవరులు శిలాపాదపాదులం జెండాడి గండడంచిన దానవసేనలు కనుకనింబఱచిన నపుడు గఱచి తరుచరవ్యూహంబు దెరలించికొని చౌరంబడి వజ్రదంష్ట్రుండు యూథాధినాథులకుఱికి పెంపరనంపరంబఱపి వెంపరలాడుచుం జంపుచున్నంగని యంగదుండెదిరి యతని యరదంబుఁగరంబులంబట్టి నేలంగొట్టినం బుట్టచెండు కరణి నెగసి ధరణికిలంఘించి యాదైత్యుండు.

గీ. ఉగ్రకరఖడ్గమెత్తి పైకుఱుకనంగ । దుండు వాఁడెత్తుకైదువుతోడికేలు
పెనఁగిపట్టి మోచేతఁబట్టునకువిఱిచి । నడుముతెగవ్రైచె వానినాయడిదమునన.

క. అంతనకంపనుఁ డనువాఁ । డంతకనిభుఁ డసురవిభుని యనుమతిగని య
త్యంతరభసమున సేనా । సంతానముగొలువఁ బటహశంఖములులియన్.

క. వెలికిఁజనుదెంచెనపుడ । ప్పలభుక్కుల కన్యవన్య ఫలభుక్కులకున్
గలనయ్యెనందుఁ బైకొని । గెలుపునఁ గపివీరులొడ్డగిల దొరకొనినన్.

పంచచామరము. అకంపనుండు తేరిపై శరాసనంబుగ్రాలఁ గా
లకంఠదోఃపినాకలీలలంగరంబుగ్రాల సా
యకప్రకాండకృత్త వానరాంగుఁడై వెలుంగఁ గా
డ్పుకూర్మిపట్టిముట్టి వానిపుట్టిముంచె గట్టులన్.

వ. అంత.

క. అభయము పతికొసఁగి వెసన్ । ద్రిభాగసేనాధిపతి యతిస్ఫురితబలుం
డుభయబలభయదభూరి । ప్రభతోడఁ బ్రహస్తుఁడాత్మ బలములుగొలువన్.

వ. నిర్యాణనిస్సాణధ్వానంబులు మిన్నుచించుకొని చనం దనవెంటం గుంభహనుం డును మహానాదుండును నరాంతకుండునుం జనుదేర నుత్పాతంబులకు భీతిల్లక తన ధాటికి నచ్చెరువంది రాఘవులు విభీషణుం బిలిచి యితండు రావణుండేయని యడుగునట్లుగాఁ ద్రోచి నడచినం దదీయసేనలుం గోపులుముంచివచ్చెం బ్లవంగ బలంబులు చలంబులంజొచ్చి వియచ్చరులు పిచ్చలింప శిఖరమణిగణ ఘృణికదంబం బులు చెదలంజెదర భుజాగ్రంబుల గిరులుద్రిప్పుచు నాయోధనాధిదేవతలకు నీరా జనంబులిచ్చు పోల్పుదెల్పినవారై కరిహరిశతాంగ భటాంగంబులు నుగ్గుగావించి రప్పుడు నరాంతకుండు శరధారాసంపాతకంపితాఖిల వనచరుండైవచ్చిన ద్వివి దుండు వానింబట్టి ఖరనఖరధారలంజీరి నొప్పించినంత మహానాదుండు మార్కొనిన వానిం జాంబవంతుం డంతకరాజధానికనిచెఁ గుంభహనుండు విజృంభించిన నీలుండు సంరంభించి యొక్కయెత్తురాయి నెత్తిన్వైచి వాని వధించెనంత.

ఉ. ప్రోలసహాయబంధువులు ముప్వురుఁ గూలుటఁజూచి కార్ముకో
చ్చాలనభీముఁడై రథము సారథిఁదోలఁగఁబంచి సాయక
జ్వాలలఁజుట్టుపట్టి కపిసంఘముసేర్చుచురాఁ బ్రహస్తునిన్
నీలుఁడెదిర్చిచంపె నవనీధరశృంగనిపాతనంబునన్.

మ. పలభుక్కుల్ హతశేషులెల్లఁజని చెప్పం జచ్చె నేలంకకున్
గలసేనాధిపుఁ డింద్రవహ్నిముఖ దిక్పాలప్రధాహారి క్రోఁ

తులచేనంచుఁ బ్రహస్తునెంచి దనుజేంద్రుండాత్మఁ జింతించి కో
ట్లలనేఁ జేసిజయింతు వైరిననియాత్రాభేరి వ్రేయించినన్.

ఉ. కూలఁబడెందిశల్ కుధరకూటము లుర్వికిరాలె నేల పా
తాళముదాఁకవీలె జలదప్రకరోదరముల్ చిరిఁగె దం
భోళితటిల్లతాశకలపుంజము నల్లడఁ గుప్పగూలె ది
క్పాలురగుండియల్ గరఁగికాఱె విభిన్నహృదంతవీథులన్. వ. అయ్యవసరంబున.

ఉ. ఎండలఁ జుట్టుముట్టుకొని యేర్చుచు భూరిభుజాని దీధితుల్
మండఁగ భానుమండలము మాడిన నిప్పటివోలెనుండ ను
ద్దండ హలాహలార్చులగదా జగదాహుతి కప్పళించు న
ట్లొండొరుమీఱుచున్ వెలిఁగిరుగ్రపలాశ పదాతులెల్లెడన్.

క. నడచి హుటాహుటిఁబూడిచి । విడిచె మహాబిలము నొక్క విఘటికలోనన్
బుడమిపొడిగొరిజచెంగుల । వెడలంగా రేఁచి దనుజ వీరహయంబుల్.

క. దిగనేకపములగుండెలు । పగిలిపడెన్ బ్రథమపటహఘాంకృతిననుచున్
జగతీ స్వయంవరమునకు । మగలై వెడలుగతివెడలె మత్తేభంబుల్.

క. పొడవులకు నింగిచాలని । కడఁకంబలెఁబుడమికిం దిగంబడినెమ్ముల్
బిడువుల్ ద్రవ్వఁగవెడలెన్ । దిడిమిలిడిమ్ములు చెలంగఁ దేరులబారుల్.

సీ. కంఠీరవధ్వజాంకవిభాసి రథమెక్కి మేఘనాదుఁడు విజృంభించినడచెఁ
దనతేరుదిగియ వాహన సహస్రము చాలుటరుదుగా నతికాయుఁ డరుగుదెంచె
సింగపుఁగొదమతేజీరాపురవ్రొక్కఁ బొగరెక్కి త్రిశిఖుండు దగిలివెడలె
నెలుఁగులుఁ బులులుఁ గారెనుపోతులును బూనుబండిపై దేవాంతకుండుగదలె
నచ్చరలకుభ్రమనఁ బ్రహస్తాది వీర । పరిణయముగల్గఁ దద్వధూవరులమీఁద
సాలయవీనుల బలధూళిసుంకుచెరుగ । నుగ్రకరిఁబోలి యూపాక్షుఁడురవడించె.

క. సంభృతపరిఘుచ్ఛవిపరి । రంభుఁడగునికుంభుఁ డుగ్రరథరారజ్య
త్కుంభీనస ఘనకేతు । స్తంభుఁడు కుంభుఁడును మఱియుఁ దక్కినదొరలున్.

ఉ. సైరిభవారిభద్విరదశాసన ఖడ్గఖరాధిరూఢులై
తారలుబూరగొమ్ములును దప్పెటలున్ బటహంబులున్ బదుత్
నూఱులువేలుమ్రోయఁ గవనుల్ వడివెల్వడి హత్తియుత్తర
ద్వారమువంకఁదార యిరువంకలఁబౌఁజులుదీర్చి రయ్యెడన్.

సీ. పంచముఖున కిన్మడించితోఁచిన దేవ్రముక్కులెక్కటిగొను మొదలివేల్ప
యనరణ్యరాజభోజనపిచ్ఛిండిలబాహ కలధౌత శిఖరిలాఘవవదాన్య

యలకాధిపతివిపజ్జలధి జైవాతృక కాలదండకథాసికాభుజంగ
వరుణకృకాటికావలమాన కాలాహి వజ్రిలోచనవారివర్ధమాన
రావణేశ్వర యనిమ్రోల రాజవంది । బిరుదభీషణచాటువుల్ బెట్టుచదువ
మేరుశిఖరంబుఁదొలిచి నిర్మించినట్టి । తనరునపరంజి తేరెక్కె దశముఖుండు.

వ. ఇత్తెఱంగున రథారూఢుండై.

శా. క్రాలం దద్దశకంఠునెట్టయెదురన్ రాకాసులశ్వేశ హే
ద్ధాఖుల్వట్టిరి యూర్పు గాడుపులబుగ్గల్ వాంగి గండోపల
స్థూలాభీలములై తనర్పఁగఁ దదుద్భూతధ్వనుల్ దాఁకి లో
కాలోకాద్రిగుహల్ ప్రతిధ్వనులొసంగంబోయి వ్రయ్యంబడన్.

క. చిందములుపట్టి రిందున । నందున సుడివడి హయంబు లంబుజబంధు
స్యందనముపై చిపడఁగా । నందుకొని పురస్థమొక్క హర్మ్యమునిలిపెన్.

సీ. వనచరేంద్రులకు దిమ్మనఁదలల్ దిరుగంగ నిలువునమూర్ఛలు నివ్వటిల్లెఁ
గణతలెల్లను గాతు కలఁగిదిక్కరులకుఁ బొటఁబొటఁగన్నీటి బొట్లువడియె
బ్రహ్మలోకంబుతారలకు వీనులలోన నానించి మొరయించినట్లయుండె
లచ్చితోనుద్దులెల్లనుమాని వైకుంఠపతికిఁ బేరెలుఁగెత్తి పలుకవలసె
నమ్ముఖరశంఖ పటుకాహళాదికాధి । కారవము విశ్వమంతయు నాక్రమింప
నేమివాక్రువ్వఁగావచ్చు నిత్తరంబు । వాఁడిమి ప్రకాశముగ దైత్యవల్లభుండు.

క. తనదొరలుపన్నినిలిచిన । పెనువాఁకిట నిర్గమించి పృతనాభారం
బునమేదినినలినలిగాఁ । జనుదేరఁగఁజూచి రామచంద్రుండంతన్.

వ. విభీషణుంబిలిచి.

శా. ఊర్ధ్వాజాండకటాహముచ్చిచన భూయోభూయనిర్యన్నిజాం
తర్ధ్వానంబులు విస్మయంబువెనుపన్ మధ్యాహ్నమార్తాండ రో
చిర్ధ్వంసంబొనరించుకొంచునదె ప్రాచిందోఁచెనకోటపై
దుర్ధ్వాంతంబిదియేమొకోయనినఁ జేతుల్ మోడ్చి యాథన్వికిన్.

గీ. రావణానుజుఁడనియెనో రఘువరేణ్య । యీ నలుపు దానవేంద్రుని సేనసుమ్ము
కారుక్రమ్ముచురోఁజుచుఁ గదలివచ్చె । నీలధూళినిచోళమై నింగిమోచి.

కవిరాజవిరాజితము.

తెలిసినవాఁడుపొయల్ విలువిద్యకు దిక్పరిపాలురదీపులకున్
వెలసినవాఁడు ప్రహస్తుఁడు మానవినీతుఁడునై తనరాణువకున్

పలికినమంత్రి తదీయభుజాబలగర్వకథల్ మునుసీతునిచే
వెలసిన నన్నెగులాత్మ సహింపక వెల్వడెఁ బంక్తిముఖుండరికిన్.

వ. అవ్వీరుండవార్యశౌర్యుండయిన తెఱంగెఱింగింతు నవధరింపుము.

శా. ఆదింబన్నగరాట్ప్రభంజనులలో నన్యోన్యసామర్థ్య సం
వాదంబొక్కటిపుట్టి చిల్వదొర దేవగ్రావముం జుట్టి వి
చ్ఛేదింపంగఁ బ్రతిజ్ఞవల్కుకొని వీచెన్ గాడ్పు దానన్ దిశల్
దూదుల్ దూలినయట్లు తూలుటయు నింద్రుండాదిగా దిక్పతుల్.

సీ. కంపించి శేషుని కడ కేగి యోభోగికులనాథ యీయద్రికూటమొకటి
వైవవే యీమహావాతూలవరువాత వరువాత నినుఁ బ్రతివాసరంబు
తలఁచియే మేము భుజించెదము గాని యంతటఁ గాని పోఁడీ భూతఘాతుకుండు
నావుడు నతఁడొకింతఫణాగ్రమెత్తిన విఱుగవిసరి యిందు వేసెగాడ్పు
లంకయయ్యెఁ దదకలంకభూధరశృంగ । భంగమంతనుండి బలిగృహంబు
విడిచివచ్చి విడిసిరడరిమాలి సుమాలి । మాల్యవంతులిచట మనుజనాథ.

గీ. విష్ణుదేవుచేత వెసమాలి పసమాలి । కదుసుమాలి మొదలితోడు సుమాలి
పొలియ బలిని జేరెఁ బూర్వస్థితికి మువ్వు । రేమి మాల్యవంతుఁడో మహాత్మ.

ఉ. రక్కసులుక్కడంగి చన రాజయి రాజ్యము చేసె రాజరా
జిక్కడవచ్చినాఁటి మొదలిప్పరి నంతఁ బులస్త్యపుత్రకుం
డక్కడ మాల్యవత్తనయయందుఁ గనెన్ మము ముప్పురన్ దిశల్
పొక్కఁగఁ జేసి రుగ్రతపముల్ దశకంఠుఁడు గుంభకర్ణుఁడున్.

సీ. జలజసూతి మదగ్రజులకుఁ బ్రసన్నుఁడై యడుగుఁ డిష్టవరంబులనివచింప
నిద్రవేఁడుకొనియె నిర్దయత్వము వేఁడికొనఁబోయి వాతప్పి కుంభకర్ణుఁ
డీరావణుఁడు మర్త్యులే లెక్కయని తక్కువారిచేఁ జావుండవరము వడసి
యేగుదెంచి కుబేరునియూర్వారు వెడలంగఁగొట్టి తాఁ బట్టము గట్టుకొనియె
నతనిపుష్పకము పథఁగా నందుకొనియె । వాసవాదులఁ గమతులఁ జేసికొనియె
నిరువది యినుపకంబాల యెత్తుమేడ । నైనయబాహులఁ గైలాసమెత్తిపట్టె.

గీ. ఇతఁడు మూఁడుకోట్లు నేఁబదిలక్షలు । వత్సరములు హరునివరమువలన
నుండువాఁడ కాఁడె యొకవృద్ధవిప్రుఁడై । వచ్చి శౌరి మోసపుచ్చెఁగాక.

క. కోఁతియని తెగడెవలిమల । కూఁతున్ నంది మొగమందికొని యిట్టిదివో
క్రోఁతియనినవ్వెఁ గడపటఁ । గోఁతియుఁ గ్రోఁతియును జేటగుటగనిపించెన్.

క. పాటించి నారదాదుల । పాటలపైఁ జూపఁ డితఁడు బందీదివిష
త్పాటలగంధులకొండల । పాటునఁ బలవించురోదలపైఁగల ప్రేమల్.

వ. అని యిత్తెఱంగున విభీషణుండు నిజాగ్రజుండయిన రజనీచరరాజు సామర్థ్యంబు నౌద్ధత్యంబు నభివర్ణించిన విని విభుండు విస్మితుండై వీక్షించుచుండె నయ్యవసరంబున.

సీ. పెరికికుత్తుకలకు విరివిబల్మ్రాఁకులు గదలుగాఁ గొనిమ్రోలఁ గదలువారు
ముఖరఝరీవారి మోచేతులకుజాఱఁ గరములగిరులెత్తి కదలువారు
నేనుంగు తేరు తేజీనిల్పు నేయంచుఁ బిడికిళ్లతో నార్చి పిలుచువారు
నావచ్చురిపులవాహనములే సమరసాధనములు తమకంచుఁ దాఁకువారు
నేరుపడినాల్గుపోఁజులై యొప్పదెప్ప । దుర దురంబనుచున్న వానరులఁ జూచి
తనదారలతోడ నొక్కింత తడవునన్నుఁ । జూడుఁడీయని దశకంఠుఁడాడియపుడు.

ఉ. పైఁడిరథంబుతోఁ బ్రళయపావకపట్టము నేఁడు కట్టుకొ
న్నాఁడొయితండనం గనలునం గనుగ్రుడ్లుగదల్చి కాయము క్రొ
వ్వేఁడిమిచేదిగంతములు వెచ్చపడన్ బలభేదిమీఁదికూ
స్టీఁడతఁడొక్కఁడున్ గడువడిన్ గదియం గపిరాజు దగ్రుఁడై.

క. ఒకపాదపంబు కేలం । బెకలించికొని యెదుర భిదురభీకరబాణం
బొకటియతఁడేయ నగ్గా । లికనినజుఁడువడిఁద్రుంచె జెట్టులేచెంబయికిన్.

వ. ఇత్తెఱంగున సుగ్రీవుండు మూర్ఛిల్లిన నల్లంబుల ఖేదక్రోధంబులు గ్రమ్మంజిమ్మరేఁగి.

క. గజగవయగవాక్షాదులు । గజిబిజియదలుపులు చెలఁగఁ గదిసి గురుగిరి
వ్రజములు గురియఁ గనుంగొని । రజనీచరరాజు రౌద్రరసవివశుండై.

చ. శరశతకోటులం దొరుఁగు శైలములం జిలుసగ్గుచేసి వా
నరులపుడెంద ఓర్పడి రణంబొనరించిరి వారినందఱన్
బరిఘుపరశ్వధాదులసబాలుగ మూర్ఛమునుంగఁ గ్రమ్మి మ
చ్చరములు మానియుండుఁ డికఁ జచ్చినయట్లని నవ్వియార్చినన్.

క. పట్టినగట్లుం జెట్లుం । గట్టెదుటన్ వైచి మరలి గట్లుం జెట్లున్
బట్టెఁబ్లవంగానీకము । లట్టిట్టయి కలఁగఁబడి భయభ్రాంతములై.

వ. అప్పుడు.

చ. బలములపాటు దాయ తలపాటును జూచి పుడక్కపాటుకో
ల్తలకొడఁ బాటువెస్సయని లక్ష్మణుఁడన్న యనుజ్ఞగాంచి వ
ల్కలములఁ గాసెగట్టి జడలన్ సికవేసి వెడందవిల్లు న
మ్ములపొదిదోఱుదాల్చి విలుమ్రోయఁగఁ జేయుచుఁ బోరఁబోవఁగన్.

సీ. తలకడచిసమీరతనయుఁ డద్దశకంఠుఁ । దారసిల్లి యేమి దనుజనాథ
క్రొత్తయిండ్లుగట్టుకొంటివే నేఁజూమీ । నాఁటివాఁడమఱచినాఁడవేమొ.

ఉ. ఎక్కటిఁగా నెకోక బిగియించితివేమి సహాయసేన న
ల్లిక్కడఁబెట్టి నీయొకనియాగడమిందఱిగోడునైన నేఁ
డక్కటికంబుపుట్టెను మహాగుణమేయిది నిక్కమైన నీ
మిక్కిలి మూఁకనెల్లఁ దునిమించక చావవుగాని రావణా.

వ. అనవుడు నద్దశకంఠుండు హనుమంతుం జూచి.

సీ. ఏమఱిన వేళఁగాఁ జూచి యెలుకయొకటి । దిగదిగనవచ్చి ప్రమిదలో దీపకళిక
కఱచికొనిపోయి తుంజూచుకాలఁబెట్టి । నట్లయైనది యైన నేనుయ్యెనోరి.

ఉ. మీదొరమేదురాగ్రహ సమేతుఁడు సూర్యసుతుండు దేవతా
సూదనబాణవేగమున సొమ్మసిలెం జెవిలోన సొంటికొ
మ్మూదినవాఁడనైతివె యరయా యిటువంటివె కృత్యకృత్యముల్
కాదనిపించుకోఁ దడవుగాదుర వానర యెందునాపుడున్.

క. నినువరియింపఁగనున్నది । యినతనయుని మూర్ఛవచ్చి యిపుడనుడునటే
మునునీసత్త్వమెల్లం । గొన నిన్నొకపెట్టుఁ జూచుకొనియెద ననినన్.

క. బండికలుదన్ని పైఁబడి । గుండె లగలఁ బవనసుతుఁడు గుద్దిన బాహా
దండములు పొలఁజాచి యు । తండువడెం బోరగిలరథం బ్రదువంగన్.

క. పడిమూర్ఛిలి యొక్కించుక । తడవునకున్ లేచి మఱియుఁ దలతిరిగిపడన్
బడఁబోయి నిలిచిపవనజుఁ । బిడికిట మూర్ఛిల్లఁబొడిచి పిలిచెన్నీలున్.

వ. అతండతనిమార్కొనియె నంత హనుమంతుండు మూర్ఛదేఱి తనకన్నకున్న తెలిసి నేదలుదీర్చుకొని జగడంబునకుం దివురు రవితనయప్రముఖులంగూడుకొనియె నప్పటికి నీలుంటు కయ్యమందుకొని పెనంగుచునికిం దమకుం దఱియనుఱికి దొమ్మినేయం దగవుగాదని చూచుచుండిరయ్యెడ రావణుండు.

క. అబ్బురపుటంపబోనున । గబ్బరపుంగడఁకయుడిపి నిలిపెన్ వలచే
గుబ్బలితో బొబ్బలతో । బెబ్బులివలె వచ్చునీలు ఖిదురాఖిలున్.

ఉ. ఇట్టటుమొట్టనీక యసురేశ్వరుఁడీగతి నడ్డపెట్టినం
బట్టినగట్టువైచి యతిమాత్రతనూకృతగాత్రుఁడైతనుం
జొట్టినయంపపెండె మొకచొప్పున వెల్వడి మేనువెంచి కే
స్పట్టి ప్రభంజనప్రియునిపట్టిదిశల్ వడఁగూకవెట్టుచున్.

వ. గొప్పసంగకుప్పతి భయంకరు పైఁ గుప్పించి.

క. నిడుపెక్కఁ గొమగు నెక్కెన్ | పెడఁద్రొక్కుం గ్రిందనక్కు మీఁదన్నిక్కెన్
జిడిముడి ముడివడు నెమ్ముపుల | దడపెట్టుం దలలుమెట్టు దవడలుగొట్టున్.

క. ఆలోనాలోకించిన | వేలుపులయ్యసుర చెవికి వినరా నౌరా
నీలా నీలావెంతయు | మేలనియచ్చెరువుపడుచు మెచ్చిరియతనిన్.

గీ. అప్పుడమరారిమదిఁ గోపముప్పతిల్లఁ | గిరిశరమేనెఁ గాలిపోకాలుమనుచు
నస్త్రశిఖినీలునకు విమోహంబొసఁగెఁ | బగరపనుపునఁ గొడుకుపైఁ దెగునె తండ్రి.

క. ఈలీలన్నీలుఁడు మూ | ర్ఛాలసుఁడై వ్రాలి లేచునంతటిలో వీ
రాలాపముఖరుఁడై రాఁ | గా లక్ష్మణుఁడద్దశాస్యుఁ గని మార్కొనుచున్.

గీ. అపుడుమించి మించనాడినమాటల | కెన్నియక్షరంబు లన్నిశరము
లసురనొల్లఁ గ్రుచ్చె నతఁడు నయ్యమ్ములఁ | గొటికి యుమిసి పెక్కుకోలలేసె.

వ. వెండియు నయ్యిరువురుం బరస్పరజయాభిలాషంబున.

క. మ్రోఁగుచుఁ దూపులుతూపుల | నాఁగుచు దుస్తరశరక్షతారుణవారిం
దోఁగుచు మూర్ఛాదశలం | దూఁగుచు రేఁగుచుఁ బెనంగ దొరకొనిరాజిన్.

ఉ. అత్తఱిలక్ష్మణుండొక మహావిశిఖంబునఁ దూపుతోడవాఁ
డెత్తినవిల్లుద్రుంచిన బళీయని విశ్వవిధాయిదేవతా
దత్తమహోగ్రశక్తి తనదక్షిణపాణినతండుఁ బూని యీ
మిత్తికిఁ గూడుగాఁగనెఁజుమీ నినునీజనయిత్రిలక్ష్మణా.

చ. అనియటుచెప్పిత్రిప్పి వెసనార్చుచు వ్రేసినయయ్యసాధ్యసా
ధనము నినాదనిష్ఠురము తాపధురీణము నిర్భరప్రభం
జనభరితంబు దివ్యశరజాలనిరోధనిరాసకంబు దో
ర్ధనురమిత ప్రహారకుపితంబును నైతనుఁజేరిగ్రక్కునన్.

గీ. ఱొమ్ముఁగాఁడిన సౌమిత్రి దిమ్మదిరిగి | పుటమెగసి కేలివిలుజాఱ బోరమోవఁ
బడఁగ శేషాంశమైన యాభవ్యశీలు | ధరణితలఁదాల్చె మేలు కృతజ్ఞురాలు.

వ. ఇట్లు మూర్ఛావివశుండై నేలవ్రాలియున్న యన్నరనాథకుమారుం గొనిపోవువాఁడై వాసవారి తేరుడిగియెత్తంబోయి తద్గురుకంబై విష్ణుతేజంబున్న కతంబునఁ గదలింపలేక విశాకుండై తనలోన.

క. మునువెండికొండతూఁచిన | తునుకోలగదా మదీయ దోర్దండ మితం
డననెంత యున్నిచేతులు | వెనువెనుకకె వచ్చెనెత్త వెక్కసపడుచున్.

ఉత్సాహము. అంచునెంచుకొంచు నుండ ననిలజుఁడు తటాననే
తెంచితలతలంగు రోరి దిట్టకూళయంచు గ

ద్దించి క్రుద్ధియద్దురాత్ముఁ డెల్లఁ ద్రోఁచె లక్ష్మణుం
గొంచునరిగిడించె భానుకులవరేణ్యుచెంగటన్.

క. నక్తంచరుఁడు సురఘువతి। భక్తుని గుద్దిన ధరిత్రిపైఁబడి పిదపన్
రక్తంబుగ్రక్కికొనియు వి। రక్తుఁడుగాకపుడు లేచి రథమెక్కె వెసన్.

వ. బవరంబునకుం దివురుచుండె నట సుమిత్రాపుత్రునురంబు దూరిన శక్తియు నతండు
వైవశ్యమగ్నుండై యుండంజేసి తిరిగిపోయి రావణుంజేరె నప్పుడు.

ఉ. తాదృగవస్థనున్న తనతమ్మునిఁ జూచుచు దాయఁ జూచి యో
రా దనుజాధమాధమ దురాగతముల్ కొనకెక్కెనంచు సీ
తాదయితుండు కట్టలుకఁ దమ్మికనుంగవ యెఱ్ఱఁజేసి బ్ర
హ్మములఁ జొచ్చినన్ విడుతునా యిఁక వీని వధింతుఁగాక నిన్.

గీ. అనిపలికి వీరసన్నాహ మలవరించి। హనుమదంసాధిరూఢుఁడై యనికిఁగదలె
రక్కసుల ఱేఁడు నెదురుగా రథము దోలె। నొగలు వాహనకపితొడల్ వగులఁ దాఁక.

వ. ఇత్తెఱంగున నుత్తరంబై జగత్తులు త్తలపడ నొత్తివచ్చిన యత్తేరిమ్రోలఁ గోసలేశ్వర
కుమారుండు.

క. అభ్రంకషరథకపి చి। త్రభ్రమణంబులవెలింగెఁ బ్రళయాంతక ఫా
లభ్రాజిష్ణు భ్రుకుటీ। విభ్రమధౌరేయమైన విల్లుం దానున్.

మానిని. రావణుఁడేసెశరంబుల ఘోరతరంబుల నేరి తరంబులనుం
గావలితాఁకినఁ దాళుకొనం బెనఁగం బవికల్పము లల్పములం
బోవనిపాటివి పావనిచిల్లులుపోవఁ జలింపఁడతండునుగ్రాం
బూవులతోఁ బొడవైతగు దాసనపుం బొదచందమునం బొలిచెన్.

సీ. దశరథాత్మజుఁడును దనదిట్టతత్తఱి నెత్తుట జొత్తిల్లి నెఱకుగాడ
నేయుటకలిగి కట్టెఱ్ఱచూపులఁ జూచి యుడువీథియురుల విల్లువుఁ బట్టి
విశిఖంబులేయ విద్విషదిషుత్రుటనంబులవి యమేయజ్వాల లలమఁ బొదివి
పగభస్మమయ్యెగట్టిగ నిప్పుడన సవాహనసారథికముగా నరదమెరియఁ
జేయ బూడిదప్రోవులై చిన్నవోయి। కానఁబడెఁగంటె నిశ్శేష గళితతప్త
దశమకుటకాంచనద్రవధారలున్న। తనువుతో రిత్త తలలతో దనుజరాజు.

క. ఇలు కాలికూల నిట్టిక। నిలిచిన నిట్రాడువోలె నిజరథమటులం
బొలియన్నిలఁబడి రాకా। సుల ఱేఁడుండుటకునగుచుఁ జూచిరివేల్పుల్.

వ. కౌసల్యాకుమారుండునుం బంక్తిముఖుని వీక్షించి.

రామా—(లోపలనే యానందమునొంది) మరియొకపనియును జరుగును. ఆమె నింటికి తెచ్చినతరువాత తమతో ఈమెకన్నులయందు మచ్చమొదలగు నవలక్షణంబు లేవియు లేవనియు, కన్నులు మిక్కిలి యందముగనే యున్నవనియు, చెప్పి నమ్మకముపుట్టించి, తాముచూచి వ్రతభంగము చేసికొనినతర్వాత మహారాజులుంగారే స్వయముగా మిమ్ముఁబిలిచి "అబ్బాయీ! ఏలాగైనను నీవ్రతభంగముకానే అయినది. ఈచిన్నది బుద్ధిమంతురాలు. కాఁబట్టి నామాటవిని యీమెను జేపట్టుము. లేనియెడల నిక నీముఖముచూడను." అని బలవంతపెట్టుదురు. అప్పుడేమిచేయగలరు?

రాఘు— ఏమిమాటచెప్పితివి? లోకములో నందరు నబద్ధముచెప్పుదురా? ఇంటియందుండెడి దాసీవాండ్రనైనఁ గనుగొనకుందునా?

రామా—(నవ్వుచు) ప్రభువువారి యాలోచన యింతేనా? రాజశాసనము మీరి యేదాసి మీతో నిజముచెప్పఁగలదు?

రాఘు—(కొంత యోచించి) అవును. నీవు చెప్పినదంతయు జరుగఁగలదు. ఇక నీవిషయమై నేనెవ్వరెన్ని చెప్పినను నమ్మను.

రామా—(పొంగుచున్న యానందమును లోపలనే యణఁగద్రొక్కి, మరలఁ దనయందనుమానపడకుండునట్లును, రాఘువుని పట్టుదలను బరీక్షించుటకును) నేనేమో ముందీప్రకారము నడుచువచ్చునని మనవిచేసితినిగాని యమ్మగారి గృహప్రవేశమునకు తమరు మరియొక యభ్యంతరము చెప్పకయుండుటయే నా యభిప్రాయము.

రాఘు— సరి. సరి. నాపట్టుదల నీవెరుగవా? మరి యట్టిమాటలు చెప్పకుము. నీయందుఁ దగిలిన మనసు మరియొకవైపుదిరుగదు.— ఇటురమ్ము.

అప్పుడు రామామణి "ఇక నేను కృతార్థురాలనైతిని. ఇంకను గొంతకాలమీయనను వంచించి ధనాకర్షణచేయవచ్చును" అని పరమానందమునొందెను. ఆరాత్రి తెల్లవారుజామున లేచి, రాఘువుఁ డింటికివచ్చి, తన యభిప్రాయము నట్లేయుంచిన యెడల మరి యెప్పటికైనను దనభార్యను దీసికొనివచ్చెదరనియు, ఇప్పుడే తగిన జాగ్రతపడవలెననియు నెంచి, యారోజున దన నిత్యకృత్యములు వేగముగ నెరవేర్చుకొని, తనతండ్రి రాజసభకుఁ బోవుచున్నప్పుడు తానును వెళ్లి, రాజుగారికి నమస్కరించి, తనతావునఁ గూర్చుండెను. ఆరోజున రాజు మొదలగువారందఱు నీపెండ్లివిషయములతోనే కాలముపుచ్చిరి.

రాజు— అంతయు సరిగాని యిద్దఱకును సరిగా వివాహసమయముననే కండ్లు కలకవచ్చుటయే వింతగానున్నది. ఇందుకొక కారణముండునేమో.

రాఘు— కారణములేకపోలేదు. ఆచిన్నది గ్రుడ్డిది. అది తెలియకుండున

ట్లీయెత్తు చేసినారు. ఇది మీరెవ్వరును గనుఁగొనఁజాలకున్నారు.

(అందఱును పరమాశ్చర్యమునొందిరి.)

వీరనమంత్రి— అదియబద్ధము. నిజమేయైనయెడల మీకెట్లు తెలిసినది?

రాఘు— నేను పటమునందే చూచినాను. దాని సౌందర్యము కంటిలోని మచ్చను మఱుగుపరచుటచే మనమెవ్వరము గ్రహించనేరకపోతిమి. మరి నాలుగు రోజులనాటికి నాకే బోధపడినది. మించినదానికేమిచేయవచ్చునని యూరకున్నాను. లోపము మనది, ఒకరిని నిందించవలసినపని లేదు. (రాజుగారితోడను తండ్రితోనును) జరిగినదానికి విచారమేల? ఇక నామెమాత్రము నాయింటికివచ్చు ప్రయత్నముఁ జేయకుండను. నేను గ్రుడ్డిదానిముఖము చూడను. ఇది నా నియమము. అందుకే కన్నులకు మూతలుగట్టితిని. (ఆమాటలతో నందఱును విచారసాగరమున మునిఁగి యేమియు ననఁజాలరైరి.)

సోమయాజి— (సమయముదొరికినదని లేచి) వివాహములందనుసరించవలసిన పద్ధతులను దరుచుగా మన వీరనమంత్రిగారుపన్యసించుచుందురు. అట్టి యీమంత్రిగారే స్వయముగా నీకార్యముచేసినారు. ఇక వీరి దాంపత్యమును జిత్తగించుఁడు. ఈశ్వరఘటనఁ గనుఁగొన నెవ్వరికి శక్యము? వృథాగా నన్నును పూర్వాచారములను నిందింపనేల?

ఈమాటలు వినియును వీరనమంత్రి యేమియుఁ జెప్పజాలక యూరకుండెను. అదిమొదలు రాఘవుఁడు పేరాళముగ వేశ్యాగృహమునకుఁ బోవుచు దానిచెలిమితోఁ గొంతకాలము గడపెను.

ఎనిమిదవ ప్రకరణము.

మాలతీ మాధవీ సంవాదము.

అట మాలతికి వివాహమైన కొన్నిదినములలోనే కండ్లకలక కుదిరెను. అత్తవారు తన్ను గృహప్రవేశమున కెప్పుడు దీసికొనిపోదురాయని విచారించుచు నొక్కొక్కరోజొక్కొక్క మహాయుగమువలెఁ గడపి, తుదకుఁ గారణము దెలియక, ప్రాణము విసిగి, యొకనాడు తనగదియందొంటరిగా నున్నప్పుడు, తనలోతానిట్లని చింతించెను. "నేనిదివఱకు నా పురుషుని ముఖమైనఁ జూడలేదు. వివాహసమయమున కాకండ్లకలక నాపాలిఁటి మహాభూతమువలెఁ బట్టి పీడించి యుత్సాహభంగముఁ జేసినది. గృహప్రవేశమున కింతకాలము విడంబమునకుఁ గారణమేమో తెలియకున్నయది. నాతల్లి

దండ్రులకుఁ జెప్పి యొకదూతను బంపునట్లు చేయుదునా? ఛీ! అది సరికాదు. రాజులలో నిట్టి వర్తమానమంపుట మిక్కిలి యవమానకరము. ఇందుకొక యుపాయము నేనే చేయవలయును." అని యందుకుఁ దగిన సాధనము నాలోచించుచుండఁ దన బహిఃప్రాణమగు మాధవియను చెలికత్తె వచ్చినిలచి—

మాధవి— అమ్మా! మీ విచారము నేనెఱుఁగుదును. ఎగరవేసినబంతి యెన్నాళ్లుండఁగలదు. మీకోర్కె నెరవేరకపోదు.

మాలతి— ఓసీ! నన్నూరక యేల వెతలముంచెదు? నేనూహించునది మరి యేమియుఁగాదు. మన గిజిగానికింక నేమివిద్యలు నేర్పుదమని.

మాధవి— మీకేమియుఁ బనిలేకయుండుటచేత నీచిలుక యన్నిమాటలు నేర్చినది. పిగిలిపిట్టలు మొదలగు నీపక్షులు పలుతెఱఁగుల విద్యలు నేర్చినవి.

మాలతి— సరి. అది పోనిమ్ము. నేఁడేమివిశేషములు?

మాధవి—అమ్మా! ఒక్కవిశేషమున్నది. తమరే ఆ సంశయమును దీర్చవలెను. నేడు రాజుగారిసభలో మంత్రిగారికిని శాస్త్రులుగారికిని విద్య తెలివి అను రెంటిలో నేదిముఖ్యము అని యొక వివాదముపుట్టినది. ఈవిషయములో శాస్త్రివాదమేబాగు. అని నాకు తోచుచున్నది.

మాలతి— మంత్రివాదమేమని? శాస్త్రివాదమేమని?

మాధవి— తెలివితేటలుగలవాఁడనని మంత్రికిని విద్యగలవాఁడనని శాస్త్రికిని మత్సరములు పెరిగినవి. మంత్రి తెలివియే ముఖ్యమనియు శాస్త్రివిద్యయే ముఖ్యమనియు పట్టువిడువక వాదించిరి.

మాలతి— ఓసీ! నీవును చిన్ననాటనుండియు నాతోఁగూడి సకలవిద్యల నభ్యసించితివిగాన చక్కగా యోచించిచెప్పుము. నీకేమితోచుచున్నది?

మాధవి— యోచించుటకేమియున్నది? విద్యలేక తెలివి యెట్లుకలుగును? ఒకవేళకలిగినను అట్టి తెలివివలనఁ బ్రయోజనమేమి?

మాలతి— అది సరికాదు. విద్యవలనఁ దెలివికలుగును. అంతమట్టుకు నిజము. కొందఱికి విద్యలేకయే తెలివితేటలుండవచ్చును. అట్టి తెలివి వ్యర్థముకాదు. బంగారుపిచ్చుక ఎంతమట్టుకు విద్యాభ్యాసము చేసినది? అది కట్టినగూడు చూడుము. ఎంత రమ్యముగను తన కనుకూలముగ నుండునో—

మాధవి—అగును. ఆబంగారుపిచ్చుకకది స్వాభావికధర్మము. ఏదీ గరిడీసాధన మెఱుఁగనివాని కొక ఖడ్గమిచ్చి యుద్ధమున కంపుఁడు. వాఁడేమిచేయఁగలఁడో చూతము. శిల్పశాస్త్రమెఱుఁగనివాని నిండ్లుకట్టుమనుఁడు. అదియంతయు నేల? మన

మాటచూచుచుండుము. మొట్టమొదట మనమిద్దరము నశ్వారోహణ విద్య నభ్యసించు నప్పుడు మొదటిరోజునఁ జెరియొక గుఱ్ఱము నెక్కి నప్పు డెంతభయము నొందితిమి? ఎన్నిమార్లు గుఱ్ఱములమీఁదినుండి పడితిమి? ఎన్నిపర్యాయములు కత్తిద్రిప్పుచు గాయములుచేసికొంటిమి. ఇప్పుడో, చెరియొకకత్తిబట్టి గుఱ్ఱములెక్కి బయలుదేరితిమా గ్రామమంతు——

మాలతి—— (మెల్లగా) ఓసీ! గట్టిగానరవకు. ఎవరైన వినిపోదురు. మనమతి రహస్యముగా నేర్చుకొనినవిద్యలవి. ఇతరులు వినినచో నవ్వుదురు.

మాధవి—— అవునుగాని మనుష్యుల విద్యలకును తక్కిన జంతుసామాన్య ధర్మములకును సంబంధమేమియున్నది? ఏవిద్య నభ్యసించినవాఁడాపనులు చేయఁగలఁడు. మిక్కిలి తెలివిగల యొకనికి వాని యబ్బనాడు నెఱుఁగని యొకయోడ నొప్పగించి నడుపుమనుఁడు. చూతము.

మాలతి—— వినుమిను. ఆపనులు వారి విద్యవలననే సాధ్యములై తెలివివలన వృద్ధిలోనికివచ్చును. సమానముగ విద్యాభ్యాసముచేసిన యిద్దరిలో నొకఁడు మిక్కిలి రసజ్ఞుఁడైన కవియగును. రెండవవాఁడు తనకుఁదెలిసిన విషయమునైన నొక సభయందు వివరించి చెప్పఁజాలకయుండును. సమానముగా విద్యాభ్యాసముఁజేసిన యిద్దరు శిల్పులలో నొకఁడు క్రొత్తక్రొత్త చిత్రములను స్వయముగాఁ గల్పించి పని చేయును. రెండవవాఁడు తాను నేర్చిన పాతపలకలు చెక్కుటలోనే యణఁగి యుండును. కాఁబట్టి తెలివిలేని విద్యలవలనఁ బ్రయోజన——

మాధవి——ఏమి? విద్యగలవాఁడెప్పుడును వ్యర్థుఁడు కాఁడు. వ్యర్థుఁడేనైనచో

గీ. విద్యయొసఁగును వినయంబు వినయమునను
బడయుఁ బాత్రతఁ బాత్రత వలనధనము
ధనమువలనను ధర్మంబు దానివలన
నైహికాముష్మికసుఖంబులందునరుఁడు.

అనిమనము చదివియున్న యనేకపద్యములను జెప్పినవారు తెలివిగలవారలై యుండవలయును.

మాలతి—— నీవు చదివినపద్యము తెలివిగలవారివిషయమై గాని తెలివితక్కువవానికి విద్య వినయము నీయఁజాలదు. తెలివిలేనివారివిషయమై నేఁజెప్పెదవినుము. విద్య గర్వమునిచ్చును. గర్వమువలన పరనింద; పరనిందవలనఁజీవాట్లు; అందువలన క్రోధము; అందువలనఁ దుదకు దెబ్బలముచ్చుతనము సైతము గలుగును. ప్రపంచజ్ఞానము లేని విద్యవలన కాసంతయు బ్రయోజనములేదని నిశ్చయముగాఁ జెప్పఁగలను. "చదువుకొనిన మూఢులు" అను కథ నెఱుఁగవా?

మాధవి— కట్టుకథలకేమి? మీరుచెప్పినది నిజమైనయెడల మరి విద్యవలనఁ బ్రయోజనమేమి? తెలివిమాత్రము చాలదా?

మాలతి— ఇప్పుడను మార్గములోనికి వచ్చితివి. అట్లడుగుము చెప్పెదను. ఒకయింటియం దిద్దరన్నదమ్ములున్నారు. అందొకఁడు గ్రుడ్డివాఁడైయైనను దరుచుగాఁ దన యన్నతోఁగూడ గ్రామమంతయుఁ దిరుగుచుండుటచేత నాయూర నెచ్చట నేది కలదో అదియెల్లను గ్రహించి యొక్కొక్కప్పుడు కఱ్ఱ చేతఁబట్టి యొంటరిగాఁ దిరుగుటయు దన తెలివిచే నేర్చుకొనెను. అయినను గన్నుగల తన యన్నతో సమానుఁడు కాఁగలఁడా? కాఁజాలఁడు. అట్లే విద్యానేత్రము.

మాధవి— అయినను మీవాదము నాకంత తృప్తికరముగ నుండలేదు.

మాలతి—ఉండదు. ఒక దృష్టాంతముఁ జూచినచో నీకే బోధపడును. పోనిమ్ము. ఒక్కపనిచేయుము. నాకు వివాహమై చాలకాలమైనది. ఇదివరకు నన్నత్తవారు గొనిపోక యూరకున్నారు. నీవు చిన్నతనమునుండియు నేర్చినవిద్యను వినియోగించి నీనెచ్చెలియగు నాకోర్కె నెరవేర్పుము.

మాధవి— సరి! ఇదియేమికష్టము? ఒక్కయుత్తరము వ్రాసితినా—

మాలతి— అదిగో! నీవిద్య అంతలోనున్నది. అట్టియుత్తరము వ్రాయుట మాయనగారి కెంత యవమానము!

మాధవి— ఏది మీ తెలివిని వినియోగింపుఁడు. చూతము.

మాలతి— చూడుము. మనయూరియందున్న గారడి వీరన్నను ఎవ్వరికిని దెలియకుండునట్లిచ్చటికిఁ దీసికొనిరమ్ము. తరువాత నేజెప్పెదను.

అదివిని మహాశ్చర్యముతోఁ బోయి యతివేగముగ నితరులకుఁ దెలియకుండు నట్లు గారడివానిని దీసికొనివచ్చెను. వాఁడతివినయముతో మ్రొక్కి చేతులుజోడించి నిలిచెను.

మాలతి— వీరన్నా! నీవు మాకొక యుపకారముచేయవలసియున్నది.

వీరన్న— అమ్మా! నేను మీకుపకారముచేయునంతటివాఁడను గాను. చిన్నతనమునుండియు మీయన్నముతిని జీవించితినిగాన మీకు భృత్యుఁడనై మీ యాజ్ఞలను శిరసావహించుటమాత్రమే నాపని.

మాలతి— (సంతోషించి) మరియేమియులేదు. నీవు నీమేళముతో బయలుదేరి కాంచీపురమునందు బ్రవేశించి యక్కడ రాజుగారియెదుటను బ్రధానియెదుటను నీవిద్యలం గనపరచి, నేనుచెప్పెడి విద్యలు సైతము అక్కడచూపి, నేఁజెప్పెడిపాటలు పద్యములు నక్కడపాడి, వారివలన బహుమతులొందిరమ్ము. మార్గవ్యయములకు

నేనే కొంతద్రవ్యమిచ్చెదను. నేను పంపినట్లు మాత్ర మితరులకు అర్థమము నీజట్టువారికి సైతము తెలియరాదు సుమీ.

వీరన్న— మహాప్రసాదము. ఇందువలన నాకు నుపయోగమే. తమరు సెల విచ్చిన విద్యలును పాటలు మొదలగునవియు దయచేయుండు.

అట్లు మాలతి వానికిఁ గాంచీపురమునందు నడపింపవలసిన రీతియంతయు నేర్పి, తాను జేసిన పాటలు పద్యములునిచ్చి, తాను పెంచిన పక్షులనిచ్చి, వాని నాడింపవల సిన రీతులు తేటగ నుపదేశించి, కొంతధనమిచ్చి పంపెను. వాఁడక్కడనుండి సెలవుఁ దీసికొనిపోయి, యాగ్రామమునందుఁ గొన్నిరోజులుండి, యాపక్షులను మచ్చికచేసి కొని, యాపాటలను గట్టిగ వల్లించి, యాధనముతో గుడారములు ఒంటెలు మొదలగు నవి కొని, కావలసిన సామగ్రిని సిద్ధముఁజేసి, తన మేళమును జేర్చుకొని, బయలుదేరి, కాంచీపురము వెలుపలితోటయందుఁ బ్రవేశించి, యక్కడ గుడారము వేసికొనెను.

తొమ్మిదవ ప్రకరణము.

గారడివాని ప్రచ్ఛన్నరాయబారము. మాలతి శ్వశురగృహప్రవేశము.

అట్లు వీరన్న మఱునాఁడుదయమున లేచి, తన పరివారమును జేర్చికొని, వేషము ధరియించి, డోలుమాత్రము తీసికొనిపోయి, కోటయెదుట నిలిచి గట్టిగ డోలువాయిం చుట కారంభించెను. అంతటఁ గోటలోపలినుండి యొక భటుఁడువచ్చి “మీరందఱు నెవ్వరు? ఏలవచ్చితిరి? అని మహాప్రభువు వారడుగుచున్నారు” అనెను. అదివిని వీరన్న “మాది యుత్తరదేశము. మేము అనేకవిద్యలు నేర్చియున్న గారడివారము. ఉత్తరదేశమునందనేకరాజులను మెప్పించి బహుమానము లందియున్నాము. ఇప్పు డీమహారాజుగారిదర్శనము చేయుటకై వచ్చినాము. గొప్పగొప్పరాజులనుదప్ప తక్కిన సామాన్యజనులను యాచించువారము కాము” అనిచెప్పగ నారాజభటుఁడు “మంచిది ఉండుడు” అనిచెప్పి కోటలోనికిఁబోయి మరలివచ్చి “ఓయీ! రేపటి యాది వారమునాఁడు పగలు ఇరువదిగడియలకిచ్చటనే రంగస్థల మేర్పఱుపవలెననియును, అప్పుడు మీవిద్యలెల్లఁ జిత్తగించెదమనియును మహారాజుగారానతిచ్చిరి. ఇప్పుడు మీరు పోయి మరల నాదివారమునాడు రావలసినది” అని చెప్పిపోయెను. వీరును దమ గుడారము జేరిరి. అది మొదలుకొని యాపట్టణమున నుత్తరదేశమునుండి గారడివాండ్రు వచ్చిరనియు, వారనేకవిద్యలు చేయఁగలరనియు, నాదివారమునాడు కోటయెదుట నాడుదురనియుఁ బ్రచురమై, యాబాలవృద్ధులకెల్లరకుఁ దెలిసెను. ఆదివారము

ఉదయముననే కోటయెదుట నొక విశాలమగు పందిరి వేయఁబడి, యందు మహారాజు ప్రధాని మంత్రులు మొదలగువారి యంతరువుకుఁ దగినట్లుగ నాసనము లమర్పఁబడెను. వీరన్నయు మేళమువారును వేషములుధరించి కావలసిన సామగ్రితో రంగమునఁ బ్రవేశించిరి. అది మొద లొక్కొక్కరుగను గుంపులు గుంపులుగను పౌరులెల్ల వచ్చి ప్రవేశించిరి. తరువాత మంత్రులును, సామంతులును, బ్రధానియు, రాఘవరాజును, గ్రమక్రమముగ వచ్చి కూర్చుండిరి. రామరాజును రాఘవుఁడును వీరనమంత్రియు సమీపములుగనున్న యాసనములమీఁద గూర్చుండియుండిరి. అంతట మహారాజులు గారును వేంచేయుచుండుటఁజూచి సభవారెల్ల దిగ్గున లేచిరి. రాజు తన యున్నతాసనమున గూర్చుండి యందరను గూర్చుండ నియోగించెను. అప్పుడు వీరన్న ముందుకు వచ్చి, సభవారికి మ్రొక్కి, వారి యనుజ్ఞగొని, తనవిద్యలం జేయుట కారంభించెను. క్రమక్రమముగ హస్తలాఘవము, కనుకట్టు, అగ్నిస్తంభన, జలస్తంభన మొదలగు తానదివరకు నేర్చియున్న తంత్రములన్నియుం జూపి, సభవారికిఁ బరమాశ్చర్యముం గలిగించి, తరువాత మాలతి నేర్చిన విద్యలం జేయుటకారంభించి, "మహాప్రభూ! ఇదివరకుఁ జేసినదంతయు వట్టిమాయ. ఇకఁ జేయఁబోవు దానిలో మాయలేదు. మర్మము లేదు. ఈశ్వరసృష్టియందలి చమత్కారమును జిత్తగింపుఁడు" అని పిట్టగూళ్ళను దీసి, సాహూయా పాటలుపాడుచు, పిగిలిపిట్టల యుద్ధములు కోఁజుల జగడములును జూపి, యొకపుష్పమును మిక్కిలి దూరముగ విసర దాని వెనువెంటన యొక బంగారుపిచ్చుక యెగిరి యాపుష్ప నేలబడకుండఁ బట్టితెచ్చి తన యజమానుని కిచ్చుట మొదలగు చిత్రములం జేయించి, తుదకా పక్షులను గూళ్ళయందుంచి, యొక మర్కట మిథునమును దీసి యాడింపఁజొచ్చెను. అప్పుడు పాడెడిపాటలు మిక్కిలి మోహసూచకములైన యిద్దరి స్త్రీపురుషుల వాక్యోపవాక్యములు. ఆయాయర్థముల కనుగుణముగ నాయా సమయములయందు స్త్రీపురుషులవంతుప్రకారము స్త్రీపురుష మర్కటములు నాట్యము నభినయము నెంతో ముచ్చటగఁ జేయుచుండును. ఆపాటలు పద్యములు వినునప్పటికి రామరాజు మొదలగు నచ్చటి తెలుఁగుదెలిసినవారలు పరవశులైరి యని చెప్పవచ్చును. ఆకవిత్వధారకు సంతసించి ప్రధాని "యీపాట లెవరుచేసినవి?" అని యడిగెను. "మహాప్రభూ నేను దేశమునెల్లం దిరుగువాఁడను. ఒరంగల్లునందొక బాలిక యీపాటపాడుచుండ విని వ్రాసికొంటిని" అనిచెప్పి వీరన్న యింక నక్కథను బాహుళ్యముగ వినిపించి తదనుగుణ్యమగు నొకసమయమునందు

ఉ. మాలతిఁ జేరి, యొక్కతటి మన్ననఁ జేసియు, దారిఁదప్పి, యి
క్కాలవిపర్యయంబు నళికాంతుఁడు గానక, సాంధ్యకించి దు

స్మీలితపద్మినీరతిఁ దమింబడి, చిక్కెనో; యేమియూడెనో;
కాలగతిన్మఱల్చి, యిక్కఁ గాంతుని మాలతిఁగూర్పు మీశ్వరా!

అనుపద్యమును జదివెను. అదివిని రామరాజుగారును వీరనమంత్రియు రాఘవుఁడును మాత్రము అర్థము గ్రహించి యొకరిముఖ మొకరుచూచుకొనిరి. వీరనమంత్రి యాపద్యమునే మరల రెండుపర్యాయములు చదివించి రాఘవునివైపుచూచి చిన్ననవ్వునవ్వెను. రాఘవుఁడు ముఖమువంచి యూరకుండెను. అదిచూచి మహారాజు "అదేమి" యని వీరనమంత్రి నడిగెను. ఆమంత్రి యాపద్యమును మరలఁ జదివించి ద్రావిడభాష యందుఁ దేటగనర్థముచెప్పి రాజుగారికి వినిపించెను. అప్పుడు వారిపద్యము మాలతి చేసినదని గ్రహించిరి. తరువాత నా గారడివాఁడామర్కటనాటకమును ముగించి "మహారాజ! ఇవియన్నియు మనుష్యులు నేర్పినవిద్యలు. ప్రకృతిసిద్ధములగు మరికొన్ని చిత్రములను జిత్తగింపుఁడు" అనెను. రాఘవుఁ డదివిని "వేళ చాలనైనది. ఇక చాలించినమేలు" అని రాజుగారివంక చూచెను. "ఇంకను వేళయున్నది. తొందర యేల? ఆచిత్రమునైతము చూతము." అనిచెప్పి వీరనమంత్రి గారడివానిఁ బురికొల్పెను. అందుకు మహారాజును సమ్మతించెను. తరువాత గారడివాఁడు రంగప్రదేశమునఁ గొన్ని పెసరిగింజలనుజల్లి, యొక పురుషకపోతమును దీసి విడిచెను. అది యొకవైపున వాలి, గింజలేరికొని తిననారంభించెను. మరియొకవైపున నొక స్త్రీపక్షి విడువఁబడెను. రెంటికినడుమ గొంతమారగమున్నను, నిమిషములోనే రెండును జేరి, యన్యోన్యమైత్రిని జూపుచు, జోడుగా మేయుటకారంభించెను. అప్పుడు మరియొక గువ్వ యాజోడు సమీపమున విడువఁబడెను. గాని అది వానితోఁగూడక, ప్రత్యేకముగా మేయుచు, మాటిమాటికిని గారడివానివంకను, పిట్టగూటివంకను జూచుచుండెను. గారడివాఁడు "యేలచూచెదవు. ఇదిగో నీ ప్రియురాలును వచ్చుచున్నది." అని మరియొక కపోతమును విడిచెను. ఈరెండును జతగా మరియొకమూలను మేయఁ జొచ్చెను. అప్పుడు వాఁడు మొదటిజతలోని మగపిట్టను, రెండవజతలోని యాఁడుపిట్టను, దీసి మరల గూటియందుంచిమూసెను. మిగిలిన రెండుపక్షులు నొండొంటిం జూడక, చేరక, మేతలుమాని, గూటివైపుఁ జూచుచు, దుఃఖకరముగ నరచుట కారంభించెను. అప్పుడామేయుచున్న పక్షులనుబట్టి, మరియొక గూటియందు మూసి, మొదటి రెండుపక్షులను మరలవిడిచెను. అవియును బూర్వోక్తపక్షులవలెనే విలపింపఁ జొచ్చెను. పిమ్మట నన్నిపిట్టలు నొక్కమారు విడువఁబడెను. అవియన్నియు మిగుల సంతోషమును సూచించుచున్న పలుకులు పలుకుచు, జతలుగట్టి, మేయనారంభించెను.

తనకొక మైలుదూరమున నున్నట్లు కనిపించిన యీనెలయేరు కొంతదూర మరిగిన నింకను భూమ్యాకాశములు కలిసికొనునట్లు కనఁబడు ప్రదేశము (Horizon) వఱకు పూర్వమున్నంతదూరముననే యగపడుచుండెను. ఇట్లామార్గంబునఁ బోవం బోవఁ గొంతవడికామార్గము విశాలమైనదై పుట్టలు గిట్టలులేనిదై కానంబడెను. అప్పుడాతనిమనస్సున కెట్టి యానందము జనించెనో నాకు వర్ణింప నలవికాదు. కాని యది చదువరులకు హృద్గోచరము కాకపోదని నా నిశ్చితాభిప్రాయము. అట్లా బాటం బడి యొక యరమైలుదూరమైనఁ బోవుటకు పూర్వమే యాతఁడు మున్ను వీక్షించిన నెలయేటినీళ్ళాతని పాదములం దడిపెను. అంతట నచ్చో నొకరాతిపై కలఁకదీఱి వికసీకృతమగు ముఖారవిందముతోఁ గూరుచుండి దంతధావనముచేసికొనుచు, దిక్కులఁ బరికింపుచుండెను.

నాలుగవ ప్రకరణము.

అప్పుడు మందమందముగా చలిగాడ్పులు వీచుచుండెను. ఉదయకాలము కావున నాయడవియందలి పూలనెత్తావులచే భారముచెదికాఁబోలు, వాయువు మెల్లగా చలించుట. అక్కడనుండెడి ఫలవృక్షముల పండ్లను తినుచు, ఈ నెలయేటినీళ్ళను పానముచేయుచు నందంద మధురములగు ధ్వనులనుచేయుచు చిలుకలు, కోయిలలు మొదలగు పక్షులు కన్నులపండువు గావించుచుండెను. వసంతకాలము కావున నా సమయమున నాయటవీ కాంత లతాంగియై పుష్పించె. ఈ నిర్ఝరమున కావలిగట్టున నొక మంచితోఁటకలదు. అందు మామిడి, పనస, జీడిమామిడి మొదలగు ఫలవృక్షములు చక్కఁగ ఫలించియుండెను. ఆ వనసౌందర్యమును నీప్రభాత వాతప్రభావంబును, ఆ వసంతసమయ సౌభాగ్యంబును నీతనిమనంబునఁగల చింత నొకకొంతవాప కలఁక దీరిన మనంబుతో తాను వెనుకఁజేసిన యొక ప్రబంధములోని యీ రెండుపద్యములను నిట్లు పఠింపఁజొచ్చెను.

౬౬చ. తెలతెలవారుజాలునను దెమ్మెరలెమ్మలు గుమ్ముగుమ్ముగా
నలసతనొందియున్న సతినట్టిని భర్తను సేదఁదేర్పఁగా
నలువుగ సర్వలోకనుతనాథుని పంపునవచ్చివీవఁగాఁ
దలిసిరివానువేకువది దేనువ వచ్చెనటంచుఁ బ్రీతిగఁ.

* * * *

సీ. చెలువ కాపతికి చెల్లెఁబోయనివంత నల్ల ధారలఁ గార్చి నభమదేడ్చె
సతికి రసికునకు సఖ్యంబు వోవుటఁ దెలిసినట్లిక్కులు తెల్లవాఱె
పతికిఁ గావరునకు పగలు గల్గునటంచు సూచింపఁగా డాసె చూడఁబవలు
ముగుద కాపతికిని మొండెడల్ దెలుపంగఁ గూసె కాకులు దుశ్శకునముగాఁగ.

❊ ❊ ❊ ❊

ఇంతలో నా యెదుటి వనములో నెవ్వరో మనుష్యు లిద్దఱు మాటలాడుకొను చున్న శబ్దము వినరాఁగాఁ ద్రివిక్రమునకుఁ బ్రాణము లేచివచ్చినట్లయి వెంటనే మొల బంటిలోతుఁగల యా సెలయేరు దాటి యా వనములోనికిఁబోయెను. అందు నలువురు రాజభటులు సంచరించుచుండిరి. వారిని చూచినతోడనే త్రివిక్రమునకు మరలఁ బ్రతుకు నాశ లంకురించెను. ఆతఁడు సంతోషముతో నుబ్బి యా రాజభటులతో నేమో ముచ్చ టింపఁబోయెను కాని, యాతఁడేమియు మాటలాడుటకుఁ బూర్వమే వా రమితమగు సంతోషముచే నీతని గౌగిలించికొని ఓఢ్రిభాషతో "బాబూ ఏలినవారు దేశసంచార మున కేగినవార్త తమ తండ్రిగారిచే చెప్పఁబడగానే 'ఎవరు మాకుమారుం దెత్తురో వారికి పెక్కులు బహుమతుల నిచ్చెదము' ని వారు ప్రకటింప నా రాజ్యమున నొక పల్లె టూరులోనుండు మేము దానినివిని తమ్ము వెతుకవచ్చినారము" ని చెప్పిరి. త్రివిక్రమునికి ఓఢ్రిభాష రాకున్నను హిందూస్థానిభాషనుగూడ బాగుగా నభ్యసించినవాఁడు కావున నా నలువురు భటులును దెలిపిన వృత్తాంతము లాతనికిఁ గొద్దియో గొప్పయో తెలిసెను. కాని వారలకు మరలఁ బ్రత్యుత్తర మొసఁగనేరక, "ఇదె మీతోడ నరు దెంచుచున్నాఁడను నడుఁడీ" యని చేసన్నఁ జేసెను. త్రివిక్రముఁడు మొదట వారల పలుకులను విన్నప్పుడు తనతండ్రి యొకవేళ నెంత ధనవ్యయమునకైన నోర్చి యిట్లు ప్రకటించియుండునని భావించెను కాని ఓఢ్రిదేశములో నెవ్వరో తన్నెఱుఁగని క్రొత్త మనుష్యులు కొందఱు తన్నంత మర్యాదగాఁ బలుకరించుటచేత, అది తనతండ్రికృత్యము కాదని భావించి యెవ్వరో యొకరాజు నిజసుతుఁడు పారిపోవుటచే నిట్లు చాటింపించ వచ్చునని యూహించి మొదటియూహను పూర్వపక్షము చేసెను. అట్లు వారితో నీతఁ డరుగ నరుగ నాదినము సాయాహ్నమునకు వీరలాయడవిం గడచి యొక పల్లెటూరు చేరిరి. ఆదినమున నుదయమునుండియు భోజనము లేమిచేతను, ఆ వెనుకటిరాత్రి నిద్ర లేమిచేతను, నేఁడు కొంచెము మించుమించు నలువది మైళ్లు నడచుటచేతను బడలి భోజ నము కాగానే త్రివిక్రముఁడు సుఖసుప్తుఁడయ్యెను.

ఆ మఱునాఁడుదయమునఁ ద్రివిక్రముఁడు నిద్ర లేచువరకు నాతఁడొక దివ్య భవనములో నొక మంచిప్రదేశమున నుండెను. అది యా రాజ్యములో రాజవద్దఁ

గ్రొత్తగా మంత్రిపదమునందిన యొక విదేశీయునియిల్లు. ఆ పురమేలికయగు విక్రమసేన మహారాజుగారి కుమారుఁడును మంత్రియును నొకనాఁడు వేఁటకని బయలుదేరి పోయిరి. వారుపోయి నాలుగుమాసములైనను నా మఱునాఁడే వచ్చెదమని వాక్రుచ్చినవారు, మరల రానేలేదు. దానంజేసి ఆరాజు తన కుమారుం గొని తెచ్చినవారికి విశేషముగా బహుమతుల నర్పింతునని ప్రకటించి, వేగి దేశమునందు విశేషము ప్రసిద్ధిఁ జెందిన వక్కలంక యజ్ఞేశ్వరరావుగారిని పిలువనంపి, యాయనకు నేటికి తొమ్మిది దినములకుఁ బూర్వమే మంత్రిపదము నొసంగెను. రాజుప్రకటనలను విని పైఁజెప్పిన నలువురు భటులును వీరు వేఁటకేగిన యరణ్యములో నలుదెసలం బరికించుచువచ్చి, యొకచో నీ త్రివిక్రముంగాంచి రాజకుమారుఁడని భ్రమసి తమతోఁ దీసికొనివచ్చిరి. ఆరాత్రి వారాపల్లెటూరిలో భోజనముచేసి నిద్రచే నొడలు తెలియక పడియున్న యా త్రివిక్రముని నిద్రలేపకయే యొక సవారిలోనుంచి యా మంత్రియింటికిఁ గొనితెచ్చి యుంచిరి. అక్కడ నాతఁడుదయమున మేల్కాంచి చూచువరకుఁ దానొక రాజభవనములో నున్నట్లు తెలిసికొనెను. అక్కడనుండెడి సుగంధద్రవ్యములు, చిత్తరువులు, నిలువుటద్దములు, పటములు, పరుపులు, పట్టెమంచములు మొదలగువాటింగాంచి యచ్చెరువొంది "ఇదియేమి? నేను రాత్రి యొక పాడుగుడిసెలో నొక శిలవలె కఠినమగుచోట నిద్రించితి. నేడిట్టి దివ్యభవనంబుననుంటి"నని కొంచెమాలోచించి, తన్నొకవేళ నిద్రపోవుచుండఁగా నీ నలువురు భటులును బండిలో నిచ్చోటికిఁగొని రావచ్చున"ని తలంచి యదియే రాజునిల్లని భ్రమసి ముందు జరగవలసినసంగతి నాలోచించుచుండెను. ఆపురమేలు రాజకుమారునకుఁ దెక్కుభాషలఁ బాండిత్యంబున్నట్లు ఆపురజను లూహింతురు. కావున నీమంత్రీంద్రుండా చిన్నవానిని రాకొమరుఁడని భ్రమించుటచే, తెలుఁగుమాటలాడు సేవకురాండ్ర నొకకొందఱ నీతనింగాచికొనియుండి వలయుకృత్యంబుల నొనర్చుచు నాతని యాజ్ఞానుచరులు గండని యాజ్ఞ నిచ్చెను. ఈతఁడు నిద్రలేచి యిట్లు కళవళపడుచుండఁగా నాసేవకురాం డ్రీతని నిట్లు పలుకరించిరి.

౧ సే— ఏలికా! తమరింతకాల మేయేదేశములలోఁ జరించినారు.

త్రి— ఒకయూరినుండి యొకయూరు, అచటనుండి మఱియొకటి యిట్లు దేశాటనము సలుపుచు నేటికిచ్చటికివచ్చినాను. అని 'ఇది రాజగృహమేనా ? అట్లయిన నీసేవకురాలు నన్ను రాకొమరుఁడని యేల భ్రమపడును. నిశ్చయముగా నిది రాజగృహముకాదు' అని తెలిసికొని

'ఇది యెవరియిల్లు' అని యడిగెను.

౧ సే— తమరెఱుఁగరులెండి. మంత్రిగారు తమతో వేఁటకువచ్చి మరల కాన రాకుండుటచే నాయన లోకాంతరగతులైరని తలఁచి నాయనగారాంధ్రదేశమునుండి యీయనను పిలిపించి మంత్రిపదమునిచ్చినారు. ఇది మంత్రిగారిల్లు.

త్రి— ఎన్నిదినములయినది ఈయన యరుదెంచి.

౨ సే— నెలదినములగును. మహాప్రభూ! దంతధావనముచేయరా?

త్రి— ఛీ! నీవు శూద్రదాసవు. నీవు తెచ్చిన నీళ్ళను నేను ముట్టుకోను.

౧ సే— మహాప్రభూ! బ్రాహ్మలచేతనే తెప్పిస్తాము.

త్రి— మంచిది. త్వరగా తేవలసినదనిచెప్పు.

౨ సే— అయ్యా! మంత్రిగారేరీ? వారు మరలవచ్చెదరా?

త్రి— ఎక్కడా మాకాయన దర్శనమే కాలేదు.

౧ సే— జీవించియుందురేమో.

త్రి— ఏమో. మాకవన్నీ ఏమీతెలియవు.

ఇంతలో బ్రాహ్మణుఁ డుదకమును తెచ్చెను. త్రివిక్రముఁడు వెంటనే దంతధావనము చేసికొనుచుండెను. ఇంతలో మంత్రివచ్చి

యుక్తే— మహాప్రభూ! తమసేవకుణ్ని. తమరు మా గృహము పావనముచేసినట్లు తమ తండ్రిగారి పాదపద్మముల సన్నిధికి కబురంపుకొన్నాను. తమదర్శనలాభం నాకు కలగడమూ, నాకు మంత్రిత్వము వచ్చిన వెంటనే తమరు మరల యీరాజ్యమును తమ పాదధూళితో పవిత్రముచేయడమూ చాలా శుభాస్పదము.

త్రి— స్వామీ తమ సుధారసధారా పూర్ణంబులైన మాటలచే నాచెవులు ఎంత సౌఖ్యమైన ననుభవించెను. తమరి నొకటి రెండు ప్రశ్నముల కుత్తరమడిగి తమకు శ్రమనీయుటకు నాకుల్లాసముగానున్నది. సెలవేని—

యుక్తే— చిత్తము. మహాప్రభూ! తమ పాదసేవకుణ్ని.

త్రి— శా. ఏరాజ్యంబు పవిత్రమయ్యె నరదేవేంద్రాభవత్పాదధూళీరక్షణ?

యుక్తే— ... ... మమనాథ! వేగ ... ...

త్రి— సరె యేవేనామమ్మెంజేఁ

బళ్ ! సారంబందికృతార్థతన్ గనియెనే చాలక్కరాల్ సెప్పవే

యుక్తే— ఊరూరన్ నను వక్కలంకకులజున్ యుక్తేశ్వరున్ జెప్పరే.

ఈవిధముగా వీరు నోటికివచ్చినట్లు పద్యములను చెప్పకొనుచుండఁగా నింతలో జయజయధ్వనులతో నాపురినేలు విక్రమసేన మహారాజుగారరుగుదెంచిరి. పోయిన తమ కుమారుని మరలఁ గనులారగాంచు నుద్దేశముతో మిక్కిలి సంతోషముగా మంత్రి

యింటికి నాయన రాగా నింతలో నీసడివిని మంత్రియెదురుగాఁబోయి రాజునకుఁ గైదండయొసంగి లోనికిఁ దోడుకొనిపోయి త్రివిక్రముని గదిలో నాయనను దించి త్రివిక్రముని కను సన్నవలన నావలకొక మిషచేఁబోయెను. వెంటనే త్రివిక్రముఁడు లేచి నడుమునకు బట్టచుట్టుకొని చిన్ననాటినుండియుఁ దనకు వచ్చిన కష్టములనన్నింటిని చక్కని మృదు మధురోక్తులతో రసోచితముగా నాశుకవిత్వధార వెల్లువలై పారఁ ముద్దులు గులుకునట్లు చదువనారంభించుటయేకాక దానికి రాజును గృతిపతినిగాఁ జేసెను. తెలుఁగుభాష రాజునకు రాదనికాఁబోలు నీతఁడు సంస్కృత భాషతో నీగ్రంథమును చెప్పఁ బూనుట. రాజు ఈ బాలుని యాశుధారా ప్రభావమునకును, లలితవాక్య రచనకును యుక్తి చమత్కృతికిని హృద్యాలంకార సమితికిని రసికత్వమునకును గడు మెచ్చి యాతని పాట్లనాలించి మనంబు నీరుగాఁ దనపురిలో నొక మంత్రివిగా నుండుమని సెలవొసంగి యాతఁడు రాజభటులు తన్నుకొనివచ్చిన భాగమునువదలి, యచ్చో నొక యితిహాసమును చెప్పుచున్నందున నింకను తన కొమారుఁడు లోపలనున్నాఁడని మనంబున నూహించుచుండెను. ఇంతలోఁ ద్రివిక్రముఁడేయితిహాసమును ముగించి తన్నేరాకొమరునిగా నారులుభావించిన తెలుఁగును చెప్పి సాంతముచేయగా రాజు విన్నబోయి పున్నమనాటి తెల్లవారగట్ల నగుపించు చంద్రుని మాడ్కి ముఖచ్ఛాయఁ గనుపింపఁ ద్రివిక్రమునితో నిజగృహంబునకేగెను.

ఐదవ ప్రకరణము.

ఇట్లు త్రివిక్రముఁడా రాజునొద్ద నొక మంత్రిపదమునంది యచ్చోట వసించుచుఁ దనకుఁ దొఱపిగల కాలమును సంస్కృతభాషాగ్రంథములను చదువుకొనుటయందు వినియోగించుచు యుక్తిచమత్కృతిచే నెట్టి ఘనకార్యములైన నిమిషములో ముగింపఁ జేయుచు, రాజుగారికి విశేషప్రీతిపుట్టునట్లుగా జరిగించుచు శతావధానమునుచేయు దిట్టతనమును సంపాదించి ప్రవర్తించుచు రాజుగారూరకయున్న సమయములం దాయనకుఁ దన కవిత్వపటిమం జూపించి సంతసింపఁజేయుచు నప్పుడప్పుడు శతావధానములను, నష్టావధానములో శతావధానములనుగూడఁ జేయుచు మిగులఁ బ్రసిద్ధిఁ జెందెను. ఇట్లొక రెండుసంవత్సరములు గడచినవెనుక త్రివిక్రముఁడు మఱింత పాండిత్యమును సంపాదించి కాశికేగి వ్యాకరణము నేర్చికొను నుద్దేశముతో మరల నీ రాజువద్ద సెలవుదీసికొని బయలుదేరెను. ఈతఁడు మునుపటికంటె నెక్కుడు స్థితిలో నుండుటచే నిప్పుడీయన వెంబడివచ్చిన జనులసంఖ్య మునుపటికంటె నాలు

మఱుఁగు లెక్కున. ఇంతమందిరోను బయలుదేరి త్రివిక్రముఁడు పూర్వము జాగరూకత లేమిచే వచ్చిన తనపాట్లను తలఁచికొని యిప్పుడు తగినంత జాగ్రతతోఁ బ్రయాణము సేయుచుండెను. ఇట్లాతఁడు కతిపయదినంబులకు వారణాశిఁ (కాశి) జేరి, యచ్చో నొక మంచియిల్లు కుదుర్చుకొని యొక సకలశాస్త్ర సంపన్నుఁడైన పండితునివద్ద కుశాగ్రబుద్ధితో వ్యాకరణము నభ్యసించుచుండెను.

ఒకనాఁ డా కాశీపట్టణమున నుదయము ఏడుగంటలవేళ నొక రాజకుమారుఁ డామార్గమునఁ బోవుచుండెను. అతఁడు మాసినబట్టలనుగట్టి కృశించి, దేహచ్ఛాయ యొక కొంతవరకు మారిపోగా మిక్కిలి పేదవాఁడై సంచరించుచున్నను ఆతని ముఖమునందలి కళమాత్రమాతఁడు ఉన్నతపదవిం జెందినవాఁడని ఘోషించుచున్నది. బంగారము నిప్పులపాలంబడి పుటము వెట్టఁబడినను తన పచ్చఁదనమును వీడునా? త్రివిక్రముఁ డా రాకొమరు నీక్షించి ముఖలక్షణములనుబట్టి యీతఁడు గౌరవనీయమగు వంశమున జనించియుండునని తలఁచి “స్వామీ! తమరొకపరి నిచ్చటకు విచ్చేసెదరా?” యని యడిగెను. ఆపలుకులను వినినతోడనే సంభ్రమముతో నా రాజకుమారుఁ డచ్చోటికివచ్చెను. త్రివిక్రముఁడును నాయనను గౌరవించి యొక యున్నతాసనమునఁ గూర్చుండనిచ్చి ఆయనతో నిట్లనియె.

త్రి— అయ్యా! తమదేపూరు కాపురము. మీరున్నతవంశస్థులని తోఁచెడిని. నాయందనుగ్రహించి—

రాకొ— అభ్యంతరమేమి (విఱునగవుతో) కాని తుదకు నన్ను గట్టెక్కించెదరేని తమకు నేనెన్నియైన వందనములనిడుదు.

త్రి— నా చేతనయిన యెడల నేను చేయఁగల సహాయమును చేస్తాను.

రాకొ— చిత్తము. అయ్యా! మాది కటకం కాపురము. మాతండ్రి కటకమునకు రాజు. ఆయన పేరు విక్రమసేనమహారాజు. వారి యింటిపేరు జగపతులవారు. నేనును మామంత్రియు నొకనాఁడు ఒకయడవికి వేటకై బయలుదేరి పోగాపోగా నడుమ త్రోవఁదప్పితిమి. మేమొక ఘోరారణ్యమధ్యమునకుఁ బోతిమి. అందు మా మంత్రి యొక పులివాతంబడియె. నేను ప్రాణములను దక్కించుకొని ఎట్లో ఆ యడవులం దిరుగగా దిరుగగా తుదకీ కాశికొక యేబదిమైళ్ళదూరమున నొక చిన్నపల్లెటూరిలో నన్ను విడిచెను. అక్కడనుండి కలిగినచోటఁ దినుచు లేనిచోట పస్తుపడుచు, ఎవరైన మీవంటి మహారాజుల నాశ్రయించి— (అని యేడువసాగెను)

త్రి— (విచారముతోడను సంతోషముతోడను మాటాడనేరక యా రాజకొమారునిఁ గౌగిలించికొని) స్వామీ. నన్ను మన్నింపుఁడు. ఏనుభవదీయదాసుండ.

కటకం మహారాష్ట్రములో తమ తండ్రిగారి సభలో నాకమంత్రిని. ఇటు వ్యాకరణము నేరిచికొన నిశ్చయించి రెండుసంవత్సరములకుఁ బూర్వ మిటకరుదెంచినాను. తమరు నాకు నేడు లభించుటచూడ చిత్రముగానున్నది.

రాజ— (సంతోషముతోఁ ద్రివిక్రముని మరలఁ గౌఁగిలించికొని మాటాడ నేరక కన్నులనుండి యానందభాష్పములురుల నేలఁగూలఁబడెను.)

త్రి— (కొంచెము తడవాగి) నాపేరు త్రివిక్రముఁడు. మాయింటిపేరు విస్సావారు. మాది వేగిదేశము. రాజమహేంద్రవరము మాకాపురస్థలము.

రాజ— నాపేరు మానసారుఁడు.

త్రి— తమ సంచారకథను నాయందలి దయచే నాకుఁదెలుపఁగోరెదను. నాకు_

రాజ— అందులకభ్యంతరమేమి (అని తనకథ పూర్ణముగా వాక్రుచ్చెను)

చదువరులు నేనా రాజకుమారుని కథ నిట వివరింపమికి నన్ను మన్నించెదరుగాక. నేను ఒకరిమనస్సునకు వృథాప్రయాసమును గలిగింతునేమోయను భయముచే దాని నిట వివరింపలేను. నిష్కారణముగా మీమనసులకుఁ బ్రయాసముఁ గలిగించుట నాకు ధర్మముకాదు. కావున దాని నిచ్చో వివరింపనొల్ల.

త్రి— (అతనిని కౌఁగిలించికొని) సోదరుఁడా! మన మిరువురము నొకట యడవినే సంచరించితిమి. ఒక్క విధముగానే ప్రయాసములనొందితిమి. ఒక్కటఁ బరితపించితిమి. మన మిరువురము నొక్కయెడనే కలిసికొంటిమి. ఇది చిత్రముగా నున్నదే. అని త్రివిక్రముఁడు తన కథనంతయు బూసగ్రుచ్చినట్లుగా చెప్పెను. త్రివిక్రముఁడు చెప్పనంతసేపును నా మానసారుఁడు కీలుబొమ్మవలె త్రివిక్రముని వచనానుసారముగా నాడుచుండెను.

ఆకాలములో బంగాళారాజధానిలో మతవిషయిక చర్చలు విశేషముగా జరుగుచుండెను. జన్మాంతరము, విగ్రహారాధనము, స్త్రీపునర్వివాహములు, జాతిభేదములు మొదలగువిషయములను గుఱించి జనులు కూడునా కూడవాయనియు, నిజమా, అసత్యమా, అనియును, నిట్లు వాదించుకొనుచుండిరి. అప్పుడు దేశము రెండు భాగములాయినది. ఒకతెగవా రివియన్నియుఁగూడునని రి. రెండవతెగవారు కూడవనిరి. కొంతవరకు మొదటివారి వాదములు గెలుచుచువచ్చెను. ఇంతలో వాదమను మహాసముద్రమునందు జన్మాంతర విగ్రహారాధనాదులను నావలు పూర్వనాగరిక, నవనాగరికులను మహావాయువుల బలిమిచే నొకసారి మునుగుచు, మరియొకసారి లేచుచు, మరల మునుగుచు నీవిధముగా నల్లకల్లోలమయ్యెను. ఈ వివాదములలోఁ ద్రివిక్రముఁడు పూర్వనాగరిక పక్షమువాఁడు. ఆ రాజకుమారుఁడు నవనాగరికుఁడు.

అప్పుడు మతవిషయమై వారి యుభయులకీక్రింది చర్చజరిగెను.

త్రి—అయ్యా! తమరు పూర్వనాగరికులా? లేక—

మా—నేను నవనాగరికుఁడనే.

త్రి—నవనాగరికులమను వారేకాని ఎవరికైనా ఒక్కముక్కనచ్చునా. ఋషులు అనుభవసిద్ధముగా వ్రాసినదాన్ని ఒక్కసారిగా కొట్టెయ్యడానికివల్లా.

మా—మనము చేసినయితే నమ్ముతామో అది యుక్తియుక్తముగానుండి ఖండింప వీలులేనిదిగా నుండవలెను. చిత్తగించినారా?

త్రి—చిత్తము. అంతవరకు నేనొప్పుకుంటాను. కాని దేవదత్తములైన వేద ప్రమాణాలనుమాత్రము ఖండిస్తే నేనూరుకోను. వాటిలో తప్పుపట్టడానికి మనమెంత. మనకేమివచ్చునని సంస్కృతంలో ఒకవెయ్యోవంతైనా చదివామూ పంగనామాలు పెట్టడానికి—

మా—ఏవేదమైనప్పటికి యుక్తికాగవలెను. మనయుక్తులకే ఆగకపోయి నప్పుడు యింకా అందులో దేవదత్తం అని యెక్కడ. దేవదత్తమైతే దేశానికో వేదంవుంటుందా? అందరికిన్నీ సమానముగా ఒకవేదమే వుంటుందిగాని. అందుచేత మనవేదములు నిజముకావు. భగవంతుఁడు దయచేసిన అందరికినియున్న మనస్సాక్షి యొక్కటియే సత్యవేదము.

త్రి—తమరు చెప్పినదానిలో నొకటి పొరబడినారు. వేదములో మన యుక్తులకాగనివికూడా కలవా? అది అటుండనిండు. తమరు వేదమంటే అందరికిని ఒకటే సామాన్యముగా నుండవలెనుకాని దేశమున కొకటాయని సెలవిచ్చినారు. అది నిజమే. పూర్వము ఒక్కటేభాష కలదనియు, అది సంస్కృతభాషయనియు తమరొప్పుకొందురుగదా. ఇప్పటి భాషాశాస్త్రజ్ఞులుకూడ సంస్కృత మాదిభాషయని యొప్పుకున్నారు. కావున నప్పుడు జనులందరొక్కభాష—

ఇంతలో వంట అయినదని లోపలినుండి కబురువచ్చెను. వెంటనే త్రివిక్రముఁడు లేచి లోనికిఁబోయి త్వరగా సంధ్యావందనాది కృత్యములను నిర్వర్తించుకొని భోజనముచేసి వెంటనే యారాజకుమారునికి భోజనముపెట్టించి యాయన కాసాయంకాలమునుండియు వేరుగా వంటచేయుటకుఁ దగు పరికరములం గూర్చుచుండెను. కాని వీరిరువురికిని నింక కొంచెముకాలము పృచ్ఛజరిగిన పైవిషయమై నిజము తేలనే తేలును. అయినను ప్రస్తుతము చదువరులేది నిజమో తెలిసికొన యత్నింతురని తలఁచి వారల యుపయోగార్థమై యిట సత్యముజయించెననిచెప్పి వారికి ముదమును కలుగఁజేయకపోదునా?

కనుపర్తి - అబ్బయామాత్యుఁడు.

ఈకవి యాఱువేలనియోగిబ్రాహ్మణుఁడు; రాయన మంత్రిపుత్త్రుఁడు, కౌండిన్య గోత్రుఁడు. ఈతనితల్లి నరసమాంబ; అన్న యోగానందము. ఈకవి యనిరుద్ధ చరిత్రము, కవిరాజమనోరంజనము, అను రెండు ప్రబంధములను రచియించెను. ఇందు మొదట రచియింపఁబడిన యనిరుద్ధచరిత్రములో

ఉ. నిండుమనంబు సత్యమును నీతియు శాంతియుఁగల్గి కీర్తిమం
తుండయి భోగభాగ్యములతోఁ జెలువొందుచుఁ గొండవీటి భూ
మండలనాయకుల్ మిగుల మన్ననచేయఁగఁ బెంపుమీఱె స
త్పండితుఁ డబ్బమంత్రి కనుపర్తి పురాన్వయవార్ధి పూర్ణచం
ద్రుండని లోకులందఱు నెఱుంగుటకున్నతిచేయ నేటికిన్.

అని కవి తనతాతయైన యబ్బయ్య కొండవీటిరాజుల మన్నన నొందినట్లు వ్రాసికొనెను గాని యాతనికాలమునాటికిఁ గొండవీటిరాజ్యము తురుష్కుల యధీనమయినది. ఈహేతువుచేత నేకాఁబోలును కవి తాను తరువాత రచియించిన కవిరాజ మనో రంజనములో

చ. సుగుణకదంబమెల్ల నొకచోటనె కాపురమున్నయట్లు గా
నగునని వేయినోళ్ళఁ గొనియాడుచు భూజను లెంచ ధన్యుఁడై
తగు కనుపర్తియబ్బనకుఁ దత్ప్రియసాధ్వికి లచ్చమాంబకున్
బొగడికకెక్కి రిద్దఱు సుపుత్త్రులు రాయన నిమ్మనాహ్వయుల్.

ఉ. వేయనవచ్చుఁగాక సుభవేయనపాయవదాన్యవైభవం
బాయనవద్యబుద్ధి తగు నాయనకే యనఁ గీర్తిచంద్రికల్
గాయనయస్వగీతికలు గాయనశీలురుపాడ నొప్పమా
రాయనమంత్రి మేలు బళిరాయన సూరిజనాభినంద్యుఁడై.

అను పద్యములయందుఁ దనతండ్రి తాతలు కొండవీటి రాజులయొద్ద నున్నట్లు చెప్పక తనతాతకు ముత్తాతయైన బసవామాత్యుఁడుమాత్రమే కొండవీటిరాజుల మంత్రియైన ట్లీ క్రిందిపద్యమునఁ జెప్పెను—

శా. శ్రీపేర్మిన్ శశివోలె బ్రహ్మకులవార్ధిం బుట్టి కౌండిన్యగో
త్రాపస్తంబపవిత్రసూత్రకలితుండై రామసింహాసనా
ఖ్యోపేతస్ఫుట కొండవీటిపురరాజ్యోర్వీశ్వరుల్మంత్రిగాఁ
జేపట్టన్ బసవప్రధానుఁ డిలమించెన్ భాగ్యసంపన్నుఁడై.

కవియొక్క తండ్రితాతలు కొండవీటిసీమలోని కనుపఱ్ఱుగ్రామమునకు కరణములని తోఁచుచున్నది. కవికి మంగళగిరిలోనున్న పానకాలరాయఁ డిష్టదైవము. మంగళగిరి కృష్ణామండలములో గుంటూరునకు సమీపముననున్నది. అబ్బయామాత్యుఁడు పదునెనిమిదవ శతాబ్ద మధ్యమునందుండినవాఁడు. ఇతఁడు ౧౭౭౦ వ సంవత్సర ప్రాంతము వఱకును జీవించియుండవచ్చును. ఇతఁ డా శతాబ్దమునందుండిన ప్రబంధకవీశ్వరులందఱిలోను మిక్కిలి ప్రౌఢుఁడు. వసుచరిత్రమునకుఁ దరువాత నీతని కవిరాజమనోరంజనముతో సరితూఁగఁదగిన ప్రబంధము లొకటి రెంటికంటె నెక్కువగా లేవు. కవిరాజమనోరంజనములోని యీ క్రిందిపద్యమువలనఁ గవి సాహిత్యమునందుమాత్రమే కాక సంగీతమునందును బ్రవీణుఁడయినట్లు కనఁబడుచున్నాఁడు—

క. శ్రీమంగళగిరి నరసిం । హామేయకృపా విజృంభితాద్భుతకవితా
శ్రీమంతుఁడ గానకళా । ధీమంతుఁడ దేవతాస్తుతివ్రతపరుఁడన్.

కవిరాజమనోరంజనమునకుఁ బురూరవశ్చరిత్రమని నామాంతరముగలదు. బాల్యమునందు రచింపఁబడినదగుటచే ననిరుద్ధచరిత్రము పురూరవశ్చరిత్ర మంత ప్రౌఢముగా లేదు. ఈరెండు పుస్తకములనుండియుఁ గొన్నిపద్యముల నుదాహరించుటకన్నఁ గవి విషయమున వ్రాయఁదగిన విశేషాంశము లేవియుఁ గానఁబడవు.

అనిరుద్ధచరిత్రము.

చ. విచికిలగంధియున్ విభుఁడు వేడుకతోఁ దెర రెండువైపులన్
రుచిరకటాక్ష పంక్తులమెఱుంగులునిండఁగ నిల్చిరయ్యెడన్
బ్రచురతరానురాగ రసబంధురతం దెరచీరదూరి పా
ఱుచు హృదయాబ్జములో మొగమెఱుంగని చుట్టఱికంబుసేయఁగన్. ఆ. ౧.

ఉ. కన్నులతెప్పలార్పని వికాసపుఁజూపును మౌనముద్రతో
నున్నమొగంబు నిశ్చలతనొప్పు శరీరముఁగాఁ బటంబుపై
నున్నతలీలవ్రాసిన ప్రియుంగనిసొక్కనఁ దానునట్టిదై
చిన్నెలు దక్కియుండె సఖిచేసిన జంత్రపుబొమ్మకైవడిన్. ఆ. ౨.

ఉ. మీసముతీరుఁజూచి జిగిమేనిపటుత్వముఁజూచి మోములో
హాసముఁజూచి చేతులయొయారముఁజూచి మనోజ్ఞరూపరే
ఖాసమలీలఁజూచి యహహాయనుచుం దలయూఁచి ముందు తా
వ్రాసినభావమెంచి తలవంచుకొనెం జలజాక్షి సిగ్గునన్.— ఆ. ౩.

చ. అనఘుఁడు మందహాసముఖుఁడై హరి నీభుజశక్తినీవె నె
మ్మనమున లజ్జలేక పలుమాఱును మెచ్చుకొనంగ నీతియే

యనిమొననిత్చినప్పుడు నిరర్థకమీవెడ మాటలేల నాఁ
కొని భుజియింపఁబోవుచును గూరలమేలడుగంగ నేటికిన్.— ఆ. ౪.

ఉ. భూసురవేదనాదములఁ బుణ్యసతీజనమంజులోక్తులన్
భాసుర నృత్తగీత రసబంధురరావములం బురీవనీ
వాసశుకానులాపముల వారణబృంహితవాజిహేషలన్
శ్రీసముదంచితంబగుచుఁ జెల్వువహించెఁ బురంబునవ్యమై.— ఆ. ౫.

కవిరాజమనోరంజనము.

చ. కొడుకులు గల్గువాఁక నొక కొన్నిదినంబులుచింత నందనుల్
పొడమిన నాయువున్బలము బుద్ధియు విద్యయుఁ జాలఁగల్గఁగా
నుడుగనిచింత కల్గి తనునోలిభజింపనిచింత తండ్రి కె
ప్పుడుఁ గడుచింతసేయుదురు పుత్రులు శత్రులుగాక మిత్రులే.— ఆ. ౧.

సీ. ధరనల్పులకుఁ బ్రభుత్వంబువచ్చిన మనుష్యుల వికారపుఁజూడ్కిఁ జూచినట్లు
పల్లవుల్తుదిలేమిపడియింటిచాయరా ముగిలంజెతల్లులు మూల్గినట్లు
పరదేశియతిలోభ పరునియింటికిఁబోవఁ దెగి కోఁతివలెను గద్దించినట్లు
వంతువాసికి హీనవైశ్యులు తమలోన నేకంబుగాఁ గలహించునట్లు
తెరలియొండొక్కటిని రూక్షదృష్టిఁజూచు
గొఱగొఱనుమూల్గుఁ గద్దించుఁ దఱిమి తఱిమి
కవిసి కలహించు భౌకృతి కలకలముగ
జాగిలమ్ములు రోషభీషణములగుచు.— ఆ. ౨.

చ. కరమనురక్తిఁ గొమ్మ కరకంజమునందిడిమీకుఁ బాలుఁ జ
క్కెరలును బెట్టి పెంచి పలికింపుచు మాటలునేర్పినందుకా
విరసపుఁ గూఁతల న్మిగుల వేదనగొల్పెదరింతికియ్యెడన్
గురువుకు బొమ్మవెట్టితిరి క్రూరవిచారమ కీరవారమా.— ఆ. ౩.

ఉ. నిప్పులురాలు గ్రీష్మమున నిక్కినగాడ్పులు వార్షికంబునన్
జప్పుడుసేయకే మరలసాగెఁ బ్రతీచికిఁ బ్రాచినుండి తా
రప్పటిపొంగుచేఁ బ్రజల నాపదఁబెట్టి నిజాధికారముల్
దప్పినఁ జిన్నఁబోయి మరలం జనుచుందురుగాదె దుష్ప్రభుల్.

చ. మలయజగంధి తాళపరిమాణ మనోహరరాగగీతికా
కలననినదంబు జంత్రమున గాత్రమునన్ జెలఁగింపు నింపుచే

శిలలు ద్రవించెఁ జిత్రములు జీవకళల్ ధరియించె వారువుల్
పొలుపుగ నంకురించె మృగముల్మదిఁ జొక్కి వసించె నంతయున్.— ఆ. ౪.

మ. తగునే రాజకుమార మన్మథ మనస్తాపంబుచే నింత నె
వ్వగలం బొందఁగ ధైర్యశాలివి గదా వారాంగనాస్నేహ మో
హగుణంబుల్ చపలాయతాయతము లెంతైనన్ సతంబే లగున్
నగరే లోకులు నీ మనంబిటులు మగ్నంబైన రాగాంబుధిన్.— ఆ. ౫.

కంకంటి - పాపరాజు.

ఈకవి యారువేలనియోగిబ్రాహ్మణుఁడు. ఇతఁడు తన యుత్తరరామాయణమునం దారువేలవారి నిట్లు వర్ణించుచున్నాఁడు—

సీ. అఖిలరాజాధిరాజాస్థాన జనహృద్యవిద్యావిహారు లార్వేలవారు
కల్పకబలికర్ణకలశార్ణవోదీర్ణ వితరణోదారు లార్వేలవారు
సజ్జనస్తవనీయ సతతనిర్వ్యాజహారి పరోపకారు లార్వేలవారు
ఘనకర్ణుటస్వామి కార్యనిర్వహణ ప్రవీణతాధారు లార్వేలవారు
విమతగర్వాపహారు లార్వేలవార। లట్టి యార్వేలవారిలో నలఘుకీర్తి
వెలయు శ్రీవత్సగోత్రారవిందహేళి। మహితగుణశాలి వల్లభామాత్యమౌళి.

కవి శ్రీవత్సగోత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; అప్పయామాత్యపుత్రుఁడు. ఈతని తల్లి నరసాంబ; తమ్ముఁడు నరసింహుఁడు. ఈతని వాసస్థానము నెల్లూరు మండలము. అక్కడక్కడఁ గొన్ని వ్యాకరణదోషము లున్నను మొత్తముమీఁద నీతని కవిత్వము మిక్కిలి రసవంతమయినది. ఇతఁ డుత్తరరామాయణమును బురాణశైలిని మాని ప్రబంధపాకమునఁ జెప్పినవాఁడు. పూర్వ ముత్తరరామాయణము తిక్కన సోమయాజిచేఁ దెనిఁగింపఁబడినను దాను గ్రొత్తఁగా మరలఁ దెలిఁగించుటకు రామకథ యగుటయే కారణమని కవి యీ క్రిందిపద్యమునఁ జెప్పెను—

మ. వరుసం దిక్కనయజ్వ నిర్వచనకావ్యంబై తగం జేసె ను
త్తరరామాయణ మంచు నన్మతిప్రబంధంబూని నిర్మించు టే [1]
సరసత్వంబని ప్రాజ్ఞులార నిరసించం బోకుఁడీ రాఘవే
శ్వరు చారిత్రము లెందఱెన్నిగతుల న్వర్ణించినం గ్రాలవే?

కవి యుత్తరరామాయణమును రచించుటకుముందు విష్ణుమాయావిలాసము యక్షగానమును రచించినట్లు తన్నుగూర్చి యిష్టదైవము పలికినరీతిగా నీ క్రిందిపద్యమునఁ

జెప్పుకొన్నాఁడు—

గీ. శ్రీశైలయమున్న కిష్ణుమాయావిలాస । యక్షగానంబు మాకు సమర్పణముగఁ
జేసి తదియాదిగా మేము నీసుధాను । సారి వాక్యాలఁ జొక్కి యున్నారమనఘ.

ఉత్తరరామాయణము కంకంటి పాపరాజు చెప్పినట్లున్నను నిజముగాఁ బుష్పగిరి తిమ్మన్న రచియించి యాతని పేరు పెట్టెనని వాడుకగలదు. ఈతని కవిత్వమునకును బుష్పగిరి తిమ్మన కవిత్వమునకును భేదమున్నందున, ఈలోకప్రవాదము సరియైనదిగా నుండదు. పుష్పగిరి తిమ్మన్న గొప్ప కవి యగుటచేతను, పాపరాజునకు మిత్రుఁడును సహశ్రోతయునయియుండుటచేతను, కావ్యరచనయందుఁ గొంత తోడ్పడియుండుటచేతను, ఇట్టి ప్రవాదము కలిగియుండవచ్చును. పుస్తకరచనయందుఁ బుష్పగిరి తిమ్మన్న తనకు తోడ్పడినట్లు కవియే యీ క్రిందిపద్యములలోఁ జెప్పియున్నాఁడు—

మ. హనుమద్దివ్యపదారవింద మకరందానంద సేందిందిరా
త్మ ననేకాంధ్రకృతి ప్రకల్పన సమర్థుం బుష్పగిర్యప్పనా
ర్యుని సత్పుత్రునిఁ దిమ్మనాఖ్యకవిచంద్రు న్మత్సహశ్రోతఁ బ్రౌ
ఢ్యున నేపిల్వఁగఁబంచి కన్నకలసంతోషంబునం దెల్పినన్.

మ. అతఁ డానందముఁ జెందినన్నుఁగని యన్నా జాలువాపైడిం
గృతవర్ణాంచితరత్నమబ్బి నటులయ్యోన్నీవు వాక్ప్రౌఢిమం
గృతిసేయంగఁ దొడంగు రామకథకుం గృష్ణుండు రాజౌటఁ బ్ర
స్తుతిగావింపఁగ నాకు శక్యమె భవత్పుణ్య ప్రభావోన్నతుల్.

గీ. అనికిరీటికి శౌరి తోడైనయట్లు । లమ్మహాకవి సాహాయ్యమాచరింపఁ
గృతి నొనర్పఁగఁబూనినయేను మొదట । నెంతుమద్వంశ విధమది యెట్టులనిన.

కంకంటి పాపరాజు ప్రళయకావేరిపట్టణములో నమీనుగా లౌక్యాధికారమునందుండిన వాఁడు. ఆకాలమునందే యీయనవద్దఁ బుష్పగిరి తిమ్మన్న కొంత ఋణముచేసి యాయప్పు తీర్పలేక యీ పుస్తకమును దానిక్రిందఁ జేసి యియ్యఁగా, ౧౭౮౦ వ సంవత్సర ప్రాంతమున నుత్తరరామాయణమును పాపరాజు తన పేరితోఁ బ్రచురించెనని చెప్పుచున్నారు. కవి యిప్పటికి నూఱుసంవత్సరముల క్రిందట నుండినవాఁడు. కవిత్వశైలి తెలియుటకయి యుత్తరరామాయణమునుండి కొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను—

మ. పలుమాఱుం దనువేఁడు రామవిభునిం బాటింపకుత్తుంగభం
గ లసత్తోయభుజంగసంఘుఘణభంగ ప్రౌఢరంగత్తిమిం
గిలవాల ప్రహతప్రవాళ శకలాకీర్ణారుణార్ణః ప్రభా
కలనం దేజముచూపెవార్ధి జడధుల్ గైకొందురే ధీరులన్.— అ. ౧.

ఉ. ఓయినిశాచరప్రవర యొప్పఁగనిప్పుడు పల్కు నీరణా
న్యాయము లెందుఁబోయె సురనాథులఁ దోలెదు వేళఁ జాలుఁ జా
ల్న్యాయము చేతఁ గాదె జయమందుట మీరు జగంబెఱుంగదే
న్యాయము మేము దప్పమొకనాఁటి కదెట్లునవిన్ము తెల్పెదన్. — ఆ. ౨.

ఉ. తమ్ముఁడవంచు నీకొక హితంబెఱిఁగింపఁగ దూతఁ బంచినన్
వమ్మొనరించి నాపలుకు వానినిజంపి ననున్ జయింప రే
ద్రిమ్మరిగుంపుతోడ నరుదెంచితి నిన్నననేల నీకు డెం
దమ్మున మేలు గాఁదలఁచు నన్నె యనందగుఁ గాక దుర్మతీ! — ఆ. ౩.

మ. పలుతావుల్వెదచల్లు తెమ్మరలు పైపైడాయ రేరాజు వె
న్నెలగాయన్ మధుపాళి మ్రోయఁ గలకంఠీపాళి కూయన్ మరు
ల్లలనల్గానము చేయ నాఁటి నిశివేళం దోఁటలో నైందవో
పలవేదిన్వసియించు పాంథుని స్మరాపస్మారము ల్చేరవే? — ఆ. ౪.

చ. కిలకిలనవ్వియచ్చెలి సఖీమణులంగని యమ్మలార విం
తలు కనుఁగొంటిరే యిదిగొ తానఁట యిక్కడనున్నవారితోఁ
కలహమొనర్పవచ్చెనఁట కాదనిపట్టిన పీఁటచేతిలో
పలికిని తేఁడు నేఁడు బహుభంగులఁ బ్రేలెడునంచుఁ జూపినన్. — ఆ. ౫.

ఉ. మాటలఁ దాటకాంతకుఁడు మాటికిఁ దేనియలొల్క వేఁడినన్
బాటలగంధిసిగ్గు ప్రతిభాషిత చాతురినడ్డగింపఁగా
గాటపుఁగాంక్షయన్ తరువుకత్తె మదిం ద్వరసేయనల్లనన్
మీటిన మ్రోయు వీణవలె మించు వెలుంగున భర్తతోననున్. — ఆ. ౬.

ఉ. ఈ వెడబుద్ధి నీకెజనియించెనొ యేజడుఁడైనఁ డెల్పెనో
హా విధిఁద్రోయ నీకు వశమా లవణాసురుబారిఁబడ్డ వా
రీవఱ కెవ్వరైన మనిరే యిఁక నూర్వుటు బ్రాహ్మలాఁగినన్
జావకపోదువోటు కొనసాగునె నీ విలువిద్యలిచ్చటన్. — ఆ. ౭.

చ. వలసిన భోజనాభరణ వస్త్రధనాదులఁ జెంది తృప్తులై
పలుమఱుఁ జాలుఁజాలునని పల్కెడువారలె కాని మాకుఁ గా
వలయు నొసంగుమంచనెడు వాగల మందునకైనఁగాన మా
స్థలమున జానకీవిభుని జన్మము వైభవమెన్నశక్యమే. — ఆ. ౮.

పుష్పగిరి - తిమ్మన్న.

ఈకవి సమీరకుమారవిజయ మనెడి యేడాశ్వాసముల కావ్యమును రచియించి, భర్తృహరి నీతిశతకమును తెనిఁగించెను. ఇతఁ డుత్తరరామాయణమును రచియించిన కంకంటి పాపరాజుతో సమకాలికుఁడు. ఇతఁడు రచియించిన సమీరకుమార విజయ ముత్తరరామాయణమంత మధురముగా లేదు. భర్తృహరి నీతిశతకము సహిత మేనుఁగు లక్ష్మణకవి తెనిఁగించినదానికి చాలదు. కవి సంస్కృతాంధ్రములయం దసమాన పాండిత్యముకలవాఁడే యయినను, కవనమం దక్కడక్కడ లక్షణవిరుద్ధము లయిన ప్రయోగములు కానఁబడుచున్నవి. ఈకవి నివాసస్థలము నెల్లూరిమండలములోని మోదుగుంటయయినట్లు నెల్లూరిమండల చరిత్రసంగ్రహమునందు వ్రాయఁబడియున్నది. ఇతఁ డాశ్వలాయనసూత్రుఁడు; విశ్వామిత్రగోత్రుఁడు; అప్పనార్యుని పుత్రుఁడు. ఇతఁడు సమీరకుమార విజయమునందు తన్నుగూర్చి యిట్లు చెప్పుకొన్నాఁడు—

సీ. శ్రీహనూమత్పాద సేవాగతాధ్యాత్మ తత్త్వకవిత్వ మహత్త్వవిదుఁడ
నాశ్వలాయనసూత్రహారి విశ్వామిత్రగోత్రాబ్ధిచంద్రుఁడఁ గుశలమతిని
అలపుష్పగిరి యప్పనార్యునకొబళాంబకును సుపుత్రుండ బ్రహ్మవేత్త
నైన వేంకటకృష్ణయాగ్రణికిని వేంకటాఖ్య కవీంద్రున కవరజుండ
సరసగుణయుతుండ వరకవిఁ దిమ్మనా । హ్వాయుఁడ నేను జననమందినకుట
కెల్ల ఫలముగల్గఁ గృతియొక్కటిరచింప । నూహసేయుచున్న వాఁడ నిపుడు.

కవి పదునెనిమిదవ శతాబ్దమధ్యము మొదలుకొని ౧౭౯౦ వ సంవత్సరము వఱకును కవిత్వరచనచేసియుండవచ్చును. ఉత్తరరామాయణముయొక్క కర్తృత్వము నారోపించినట్లే దశకుమారచరిత్రముయొక్క కర్తృత్వమునుగూడఁ గొందఱీకవి కారోపింతురుగాని యీ యారోపణము కేవల నిరాధారముగాఁ గనఁబడుచున్నది. ఈతని పుస్తకములనుండి కొన్ని పద్యము లుదాహరింపఁబడుచున్నవి—

భర్తృహరి నీతిశతకము.

చ. మతిఁగల జాడ్యముల్చెఱుచు, మాటల సత్యముగూర్చు, మానము
న్నతిఁగనయించుఁ, బాపములు నాశ మొనర్చు, మనంబునం బ్రస
న్నత గదియించు, దిక్కుల ఘనంబుగఁ గీర్తులునించు, సాధుసం
గతి యిఁక నేవిశేషములుగల్గఁగఁజేయదు మర్త్యకోటికిన్.

ఉ. నీతు లెఱుంగువారు తమునిందఘటించిన నెంచినన్, మహా
భూతులుపాయకున్న నవిపోయినఁ, జావపుడైనఁ గల్పసం
ఘాతవిరామకాలములఁగల్గినఁ గల్గుఁగా కొకప్పుడున్

నీతిపథంబునం జెదరనేరరు ధైర్యరమాధురంధరుల్.

సమీరకుమారవిజయము.

ఉ. ఆరజనీచరాగ్రణిలయావసరాసిత నీరదాకృతిన్
హారునరాఁగనుంగొని యథాయథలై సురలద్రిరాడ్గుహల్
దూఱెడువారు నిచ్చవిధి దూఱెడువారు కపీంద్రుపెన్కనున్
జేరెడువారు కావుమని చీరెడువారును నైరలంకఁగన్. ఆ. ౧.

ఉ. ఎమ్మెయి జవ్వనంబుఁ గలయింతిపతిం బెడఁబాసియొంటిగాఁ
గ్రిమ్మరుచోట గర్భము ధరించినదన్నను గన్నవిన్నవా
రెమ్మెయిఁ గల్లలేమిగణియింతురొ యెంతురొ బంధుకోటిలో
నమ్మకచెల్ల నానియమమాగడమాయె నికేమిచేయుదున్.—— ఆ. ౨.

చ. రఘుజుఁడొసంగె నుంగరము రామకనుంగొనుమన్నమాత్ర మే
ను మఱచి సాక్షి యొక్కటిఁ గనుంగొనుచుండితిఁగాని తత్ప్రిమో
దమునకు నాదికారణమితండని నిన్గనవైతినెచ్చటన్
భ్రమదలెఱుంగనేర్తురె కృపాళురొనర్చినమేలు మారుతీ.—— ఆ. ౩.

ఉ. ఇంతవిచారమయ్యెఁగద యేనును నీవనుభేదయుక్తి నీ
స్వాంతమునందు వర్తిలుట నన్యుఁడు నేననుచింత యొంతప
ర్యంతము జంతుసంతతి హృదంతమునందు వసించు నంతప
ర్యంతము జన్మమృత్యువుల కంతము లేదు సమీరనందనా.—— ఆ. ౪.

ఉ. రావణుగీవణున్ సమరరంగమునం గుదియించినట్లు నా
లావునకోహటింపక నిలంగలవే రఘురామచేత్తపై
యీపెడక్రోఁతినెక్కడని యేటికివచ్చితి వింతదూరమ
య్యేవిజయంబు చెందఁగలఁడోటు శతాస్యుఁగడంగి రుద్రుఁడున్.—— ఆ. ౫.

శా. హీనాధిక్యము లెంచి పంచితివా నన్నేమాడ్కిఁ బొమ్మంటివా
హీనాత్మంగపిమాత్రుఁ బిల్చుటకుఁ బోనీ యొక్కవేగంబునం
దైనన్ నాకు సమానుఁడే పలుకులేలా నీవెయిట్లాడఁగా
నేనాకాదనువాఁడనంచదలుపక్షీంద్రున్నిరీక్షించుచున్.—— ఆ. ౬.

శా. అన్నా నేముదివాఁడ లేవవడిలేదం డెందొసేవేగఁగా
సన్నాహంబున వచ్చినాఁడవుగదా జాగేల నీకేలనీ
సన్నంబైన మదీయపుచ్ఛ మొకపార్శ్వంబుండుఁ బొందించి పొ
మ్మన్నన్ దన్మహిమంబెఱుంగకుదితాహంకారసంకాత్ముఁడై.—— ఆ. ౭.


వీనికిఁబైని సహితము నేత్రములకును యంత్రములకునుగూడఁ గానఁబడని నక్షత్రములు కోటానకోట్లు వ్యాపించియున్నవి.

ఇఁక నక్షత్రములగతినిగూర్చి కొంచెము విచారింపవలెను. భూభ్రమణమును బట్టి దినమున కొక్కపర్యాయము నక్షత్రములన్నియు నాకాశమున మన భూమి చుట్టును తిరుగుచున్నట్లు కనఁబడుచున్నను, అది భ్రమగాని సత్యముగాదు. రాత్రుల యందు మన మాకాశమువంకఁ గొన్నిగంటలసేపు సావకాశముగాఁ జూచుచుండిన పక్షమున, అన్నియు మనకు సూటిగా తూర్పున కాకపోయినను ఆదిక్కున పొడుగునను వేలకొలఁది నక్షత్రములు తూర్పువైపుననుండి పడమటివైపునకు నడుచుచు ముందుదయించినవి యాకాశమునకెక్కి వాలుచుఁ గ్రుంకుచుండఁగా వాని వెనుకవెనుక వరుసవరుసలుగా క్రొత్తక్రొత్తవి యుదయించుచు పైకెక్కుచు వాలుచు చూపులకద్భుత జనకముగా నుండును. కొన్ని నక్షత్రరాసులు ఉత్తరార్ధగోళమునందుండువారికి సదా రాత్రులు కనఁబడుచు దక్షిణార్ధగోళములో నుండువారికి కనఁబడకుండును; ఆప్రకారముగానే మఱికొన్ని నక్షత్రరాసులు దక్షిణార్ధగోళమునందుండువారికి మాత్రమే కనఁబడుచు ఉత్తరార్ధగోళములోనివారి కెప్పుడును కనఁబడకుండును. మఱికొన్ని రాసులు వేసవికాలములో కనఁబడినవి చలికాలములో నదృశ్యములగుచు, చలికాలములో కనఁబడినవి వేసవికాలములో నదృశ్యములగుచు, ఉండును. రాసులు తమ స్థానములను విడువకపోయినను భూమి తనకక్ష్యలో సూర్యునిచుట్టును తిరుగుచుండుటనుబట్టి యీమార్పులు కలుగుచున్నవి. భూమియొక్క యక్షమది భూమ్యంతరాళములో తిన్నఁగా ఊర్ధ్వ (ఉత్తర) ధ్రువమునుండి యధో (దక్షిణ) ధ్రువమువఱకును వ్యాపించియుండునని యూహింపఁబడుచున్నదిగదా? ఈ యక్షాగ్రముల నిరువైపులను ధ్రువములనుండి క్రిందికిని మీఁదికిని తిన్నఁగా ఋజురేఖగా పొడిగించినపక్షమున, ఆరేఖలే ఖగోళమునకు ధ్రువములగును. ఈధ్రువములనుండియే యాకాశమునందు నక్షత్రాదులయొక్క దూరమును భాగలుగాను కళలుగాను గణించుచున్నారు.

బృహదృక్షరాశిలోని సూచకములనఁబడు రెండునక్షత్రములు తోఁకదగ్గఱ నున్న నక్షత్రమును జూపుచుండును. ఆ నక్షత్రసమీపమునుండి యుత్తరధ్రువ మూర్ధ్వముగా పోవునుగనుక, అది ధ్రువనక్షత్ర మనఁబడును. అది యెప్పుడు నస్తమింపక యక్కడనే నిలిచియుండును. మన ముత్తరమునకు పోయినకొలఁదిని పైకిలేచుచు, దక్షిణమునకు వెడలినకొలఁదిని క్రిందికిదిగుచు, ధ్రువనక్షత్రము కనఁబడుచుండును. దానికి సమీపమున బృహదృక్షరాశి యుండును. బృహదృక్షరాశినే మనవారు సప్తర్షిమండలమని చెప్పుదురు. దానికెదుట లఘుఋక్షరాశియుండును. ఈ రెంటికినడుమ

నుభయపార్శ్వములయందును గల రాసులతోఁ గలిసి యివి యొకరాశిచక్రముగా నేర్పడును. ఉత్తరమున నున్నవారికివి యుదయాస్తమయములు లేనివయి ధ్రువనక్షత్రమునకుఁ బ్రదక్షిణములు చేయుచున్నట్లు కనఁబడును. ఈప్రకారముగానే వానిక్రింద నితరరాశిచక్రములుండును. అవియు గుండ్రముగా ధ్రువనక్షత్రమునకు ప్రదక్షిణములు చేయుచుండునట్లే కనఁబడును. మఱికొంత క్రిందికిఁబోయినతరువాత నక్షత్రములు తూర్పున నుదయించి పశ్చిమమున నస్తమించుచుండునట్లు కనఁబడును. అటుతరువాత నుండు రాసు లొకకాలమునందు కానఁబడి వేఱుకాలముల నదృశ్యములగుచుండును. మన ముత్తరధ్రువమువద్దనే యుండి చూచెదుపక్షమున, సదా ధ్రువనక్షత్రము మన నెత్తిపైనుండి యీ రాసులన్నియు నిరువదినాలుగేసిగంటలకాలమున నొక్కపర్యాయము దానిచుట్టును తిరుగునట్లును, చేరువరాసులు మెల్లఁగాను దూరపురాసులు వేగముగాను తిరుగునట్లును, కనఁబడును గాని యుదయించి యస్తమించునట్లు కనఁబడవు.

దక్షిణధ్రువమువద్ద నీప్రకారముగానే యితర నక్షత్రరాసులు కనఁబడును. భూమధ్యరేఖవద్దనుండువారికి నక్షత్రరాసులు తూర్పున నుదయించి పడమట నస్తమించునట్లు కనఁబడును. ధ్రువములకును భూమధ్యరేఖకును మధ్యనుండువారికిఁ గొన్నిరాసులు చక్రాకారముగా తిరుగునట్లును కొన్ని యుదయించి యస్తమించునట్లును కనఁబడును. ఇవియన్నియు దృశ్యమానగతులు. మనము బండిలోఁ బోవుచుఁ జూచునప్పుడు వృక్షాదులు నడుచుచున్నట్లు కనఁబడినను నొండొంటికిఁగల దూరములో మార్పునొందనట్లే యీ నక్షత్రములు సహితము పూర్వోక్తగతి భేదములవలన దూరవ్యత్యాసమునుబట్టి తమలో నొండొంటికిఁ గలిగియున్న స్థానముల విషయమున మార్పులనొందవు. వేలకొలఁదిసంవత్సరములనుండి నక్షత్రరాసులన్నియు తమతమ స్థానములలో మార్పునుజెందక యేకరీతినే కనఁబడుచున్నవి. నక్షత్రరాశియని చెప్పినప్పుడొక్కరాశిలోని నక్షత్రములన్నియు కుప్పవోసినట్లొక్కచోట గుంపుగానుండునని భ్రమింపఁగూడదు. ఒండొంటికి సమీపమునఁ గానవచ్చుకొన్ని నక్షత్రములను సముదాయముగాఁ జేర్చి యవి యశ్వముఖాదులను బోలియున్నవని భావించి యాయాకారములను బట్టి యా సముదాయమునుగల యాకాశభాగముల కశ్విని మొదలగు నామములను మన పూర్వులు పెట్టియున్నారు. రాశిభాగములను తెలుపుటకు గుఱుతుగానుండు నక్షత్రములు తారలనఁబడును. ఒక నక్షత్రరాశి యీపుటలోని పటమునఁ జూపఁబడియున్నది—



[redacted]

మూడురెట్లధిక వేగముతోఁ బోవుచున్నది. ఈ నక్షత్రము గంటకు రెండులక్షలమైళ్ల వేగముతో నడచుచున్నది. బ్రహ్మహృదయమను నక్షత్రము సెకనుకు ముప్పదిమైళ్ల చొప్పున నడుచుచున్నది. మృగవ్యాధ (లుబ్ధక) నక్షత్రము సెకనుకు పదునాలుగు మైళ్ల చొప్పున నడుచుచున్నది. ధ్రువనక్షత్రము సెకనుకు మైలునరచొప్పున నడుచుచున్నది. తక్కిన నక్షత్రములవలెనే మనసూర్యుఁడును భూమ్యాదిగ్రహములను వెంటఁగొని ముందుకు నడుచుచున్నాఁడు. మన సూర్యునియొక్క గతి వేగమింతయని రూఢిగాఁ దెలియకపోయినను, సెకను కించుమించుగా నాలుగయిదుమైళ్ల వేగముతో శౌరి నక్షత్రమువంక నడుచుచున్నట్లు తెలియవచ్చుచున్నది. మనకంటికిఁ గనఁబడకపోయినను జంతుకోట్లకు వాసయోగ్యములయిన గ్రహము లనేకములు దూరపుసూర్యులయిన ప్రతి నక్షత్రమునకును చుట్టును మన సూర్యునికివలెనే తిరుగుచుండుననుటకు సందేహ ముండదు. పైని జెప్పినట్లు గగనమండలమున నడుచునప్పుడు ప్రతినక్షత్రమును దనకుఁ బ్రదక్షిణములుచేయు గ్రహములనుగూడ వెంటఁగొని పోవుచుండును.

కాంతి విశేషములనుబట్టి నక్షత్రముల నన్నిటిని శాస్త్రజ్ఞులు నాలుగుతరగతు లనుగా విభజించియున్నారు. ఇందు మొదటితరగతివి తెల్లసూర్యులు; ఇవి మిక్కిలి ప్రకాశమానములయినవి. మృగవ్యాధనక్షత్ర మీతరగతిలోనిది. రెండవతరగతివి పసిమి సూర్యులు; మనసూర్యుఁ డీ రెండవతరగతిలోనివాఁడు. మూఁడవతరగతివి చంచల సూర్యులు; ఒకప్పు డధికముగాను, ఒకప్పు డల్పముగాను, ఉండి వీనికాంతి తఱుచుగా మాఱుచుండును. నాలవతరగతివి యెఱ్ఱసూర్యులు; ఇవి మిక్కిలి చిన్నవి. ఈనక్షత్ర ముల వర్ణములు మాఱుచుండుటయుఁగలదు. మృగవ్యాధనక్షత్రము పూర్వకాలమునం దెఱ్ఱగా నుండెనఁట. నూఱుసంవత్సరములక్రిందట తెల్లఁగానున్న నక్షత్రమొకటి యిపుడు పసిమివర్ణముకలదయినది. దీనిదూరము భూమికిని రాజహంస నక్షత్రమునకును గల దూరమునకంటె నయిదురెట్లు హెచ్చుగానున్నది. దీనినుండి వెలువడిన వెలుతురు మనభూమిని జేరుటకు పదునేనుసంవత్సరములకాలము పైఁగాపట్టును. ఇది సెకనుకు ముప్పదిమైళ్లచొప్పున నడుచు చునంతకంతకు భూమినుండి దూరముగాఁ బోవుచున్నది.

మనదృష్టి కేకనక్షత్రముగాఁ గనఁబడునవి కొన్ని దూరదర్శకయంత్రముతోఁ బరీక్షించునప్పుడు రెండుమూఁడు నక్షత్రములకూడిక యయినట్లు తెలియవచ్చుచున్నవి. ఉత్తరార్ధగోళమునందుఁగానఁబడు నక్షత్రములలో నెల్లను భూమికి మిక్కిలి సమీపమున నున్నట్లు తెలియవచ్చిన రాజహంసరాశిలోని యఱువదియొకటవ నక్షత్రము రెండు నక్షత్రముల కూడికచేత నయినది. ఈ రెండునక్షత్రములలో నొండొంటికిఁగల దూరము మన సూర్యునికిని నెప్ట్యూనుకును గలదానిలో సగమున్నది. దూరమునుబట్టి కంటి

కొక్కటిగాఁ గనఁబడెడి యీ రెండునక్షత్రములునుగలిసి పరిమాణమునందు మన సూర్యునిలో మూడవవంతుండును. మందకాంతిగల యీ యాఱవతరగతి జంటతార యొక్క దూరమే మొట్టమొదట కనుఁగొనఁబడినది. ఇది సెకనుకు నలుబదిమైళ్ల చొప్పున నడుచుచున్నది. ఇది మున్నూటయేఁబది సంవత్సరములలో గగనపథమునఁ జంద్రబింబ మంతవెడల్పుగలదూరము నడిచినట్లు కనఁబడినది.

దక్షిణార్థగోళమునఁ గనఁబడెడు నక్షత్రములలో నెల్లను భూమి కత్యంత సమీపమున నున్నట్లు తెలియఁబడియున్న నరాశ్వనక్షత్రమును రెండునక్షత్రముల కూటమి చేతనయిన జంటతారయే. ఇందలి రెండునక్షత్రములకునుగల దూరము మనభూమికిని సూర్యునికిని మధ్యఁగలదానికంటె నిరువదిరెండు రెట్లెక్కువగా నున్నది. ఇంత దూరము కలదైనను కేవలనేత్రమునకీరెండును గలిసి యేకనక్షత్రమువలెనే కనఁబడును. రాజహంసనక్షత్రములోనివానివలెనే యిందలి రెంటిలో నొకటి పెద్దతారగాను రెండవది చిన్నతారగాను ఉన్నది. చిన్నది పెద్దదానిచుట్టును ఎనుబదియైదు గంటలకాలములో తిరుగును. ఇవి రెండునుగలిసి మన సూర్యునికంటె ద్విగుణ పరిమాణమును భారమును గలవిగానున్నవి. మనసూర్యబింబమే మనకంతదూరములో నున్నపక్షమున, ఈనక్షత్రకాంతిలో మూడవవంతుకాంతి కలదయి కనఁబడును. ఆకాశమునందు వెలుఁగునక్షత్రములలో నెల్లను మృగవ్యాధనక్షత్రమును మఱియొకనక్షత్రమును దక్క దీనితో సమానమయినకాంతితోఁ బ్రకాశించునది వేఱొకటిలేదు. ఇది యింగ్లాండు దేశమునఁ గనఁబడదు.

ఈ ప్రకారముగా నక్షత్రము లనఁబడెడు దూరపుసూర్యులు పరిమాణములోను, గతిలోను, వర్ణములోను, సంఖ్యలోను భేదపడి యనంతములుగా నున్నవి. ఏ రెండు సూర్యులును సరిగా నేకరీతిగా నున్నట్లు కనఁబడవు. కొన్ని పెద్దవి; కొన్ని చిన్నవి. కొన్ని శీఘ్రగతిగలవి; కొన్ని మందగతిగలవి. కొన్ని తెల్లనివి; కొన్ని పచ్చనివి; కొన్ని యెఱ్ఱనివి; కొన్ని నీలవర్ణముకలవి; కొన్ని వంగపండుచాయగలవి; కొన్ని బూడిదరంగు గలవి. కొన్ని యొక్కొక్కటిగానున్నవి; కొన్ని రెండు, మూడు, నాలుగు చేరి యున్నవి. కొన్ని కొంతకాలము కనఁబడి కొంతకాలము కనఁబడనివిగానున్నవి; కొన్ని యొకప్పుడు మందకాంతితోను మఱియొకప్పుడు తీక్ష్ణకాంతితోను కానఁబడుచు వృద్ధిక్షయములను పొందునవిగా నున్నవి. తిమింగిలరాశిలోని యొకనక్షత్రము పదునేను దినములు రెండవతరగతి నక్షత్రముగానుండి మూడుమాసము లంతకంతకు క్షీణించి కడపట నదృశ్యమయి యయిదు నెలలట్లుండి మరల కనఁబడి మూడునెలలవఱకును క్రమక్రమముగా మరల వృద్ధినొంది కడపట ప్రకాశమానమగు రెండవతరగతినక్షత్రమయి

యాస్థితియందు పదునేనుదినములుండి మరల యథాపూర్వముగా క్షీణింపనారంభించును. ఈనక్షత్రమున కీమార్పులన్నియు పదునొక్కమాసముల కొక్కసారి కలుగుచుండును. యయాతిరాశిలోని యింకొకనక్షత్రము మఱింత శీఘ్రముగా వృద్ధిక్షయాదులను బొంది మూఁడుదినములలోపలనే యీ మార్పులన్నిటికిని లోనగును. ఇది రెండవతరగతి నక్షత్రమునకంటె నెక్కువకాంతికలదిగాఁగాని, నాలవతరగతి నక్షత్రమునకంటె తక్కువకాంతికలదిగాఁగాని, యెప్పుడును గాదు. మృగశీర్షరాశిలోని యొకనక్షత్ర మీ మార్పుల నిన్నూఱుదినములలోఁ బొందును; వృషపర్వరాశిలోని యొకనక్షత్ర మఱువది దినములలోనే పొందును. మన సూర్యుఁడును పదునొకండు సంవత్సరముల కొక్కసారి కొంతవఱకిట్టిమార్పులను బొందుచుండునని శాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. మనసూర్యుఁడు తన బింబముమీఁద మచ్చలెక్కువగా నున్నప్పుడు మందకాంతితోను, తక్కువగానున్నప్పుడధికకాంతితోను దూరమునుండి చూచువారికి కనఁబడునఁట.

కొన్ని నక్షత్రములు కొంతకాలముమాత్రమే కనఁబడి తరువాత నదృశ్యములగును. అట్టివానిగతి తరువాత నేమగునో యెవ్వరికిని దెలియదు. ౧౫౭౨-వ సంవత్సరమునం దట్టి వింతనక్షత్ర మొకటి కనఁబడినదఁట! అది మృగవ్యాధాది నక్షత్రములకంటెను, శుక్ర బృహస్పత్యాది గ్రహములకంటెను, అధిక కాంతికలదయి పట్టపగలు సహిత మాకాశమునఁ గానవచ్చుచు, అంతకంతకు క్షీణదశనుబొంది కొంతకాలములో నదృశ్యమయిపోయినదఁట! అట్లది యదృశ్యమగుటకుముందు తెలుపునుండి పసిమికిని, పసిమినుండి యెఱుపునకును మాఱినదఁట!

మనకుఁ గానవచ్చు జంటతారలు రెండుతరగతులవిగా నున్నవి. ఇందొక తరగతివి యొండొంటి కపరిమితదూరములోనున్నను ఒకదానికి వెనుకవైపున నొకటి యుండుటచేతనే మనకు జంటతారలుగా కనఁబడును. ఇంకొకతరగతివి నిజముగానే జంటలుగానుండి పెద్దదానిచుట్టును చిన్నది తిరుగుచుండును.


ఆకాశము నిర్మలముగా నున్నప్పుడు చూచెడుపక్షమున దిఙ్మండలము (క్షితిజ) యొక్క యొక్కకొనయందారంభమయి క్రమక్రమముగా పయికాకాశమధ్యమునకు లేచి యొకచోట వెడల్పుగాను ఒకచోట సన్నముగాను ఒకచోట నధికకాంతితోను ఒకచోట మందకాంతితోను ఒక్కచోట నేకముగాను ఒక్కచోట శాఖలుగా చీలి మరలఁ గలియునదిగాను వ్యాపించి క్రిందికి దిఙ్మండలముయొక్క రెండవకొనవఱకును దిగి తెల్లని మేఘవలయమువలె నాకాశము పొడుగున నొక కొననుండి యొకకొనకు కనఁబడును. దీనినే మనవా రాకాశగంగయందురు. కొందఱు దీనిని క్షీరమార్గమందురు. ఇది నక్షత్రప్రవాహము. దూరదర్శకయంత్రముతోఁ జూచునప్పుడు దీనిలో

నక్షత్రరాసులవెనుక నక్షత్రరాసు లనంతములుగా కనఁబడుచుండును. మనసూర్యుఁడీ యాకాశగంగలోని నక్షత్రములలో నొక్కటియయి, మేర కనుఁగొనరాని గొప్ప యిసుకతిప్పలోని యొక యిసుకరేణువువంటిదిగా నున్నది. ఆకాశగంగ యెంత దూరము వ్యాపించియున్నదో దానియం దెన్నినక్షత్రములున్నవో వట్టి యూహలే కాక నిజ మెవరికిని దెలియశక్యము కాదు.


ఈ యాకాశగంగ కాక యాకాశమునం దక్కడక్కడ మేఘాకారములుగా నున్న నక్షత్రజాలములును గొన్నికలవు. వట్టికంటికి ధవళమేఘములవలె కనఁబడినను యంత్రములతోఁ బరీక్షించునప్పు డందలి నక్షత్రములు విభజనగా తెలియవచ్చును. దూరమునను న్న మఱికొన్ని నక్షత్రజాలములు యంత్రములతోఁ జూచునప్పుడు

రెట్లధికదూర మున్నదఁట! ఇటున్నప్పుడు సప్తర్షులనఁబడెడి యేడు సూర్యబింబము లలో నొక్కొక్కదాని కెంతెంతదూరమున్నదో యొకదానితో నొకదాని కేమైన సంబంధమున్నదో లేదో యెవ్వరు చెప్పఁగలరు! ఈయేడు నక్షత్రములలో నయిదు సమవేగముతో నొక్కప్రక్కకే పోవుచున్నవి; రెండు వేఱొకప్రక్కకుఁ బోవు చున్నవి. తోఁకలోని రెండును దేహములోని మూడును గలిసి యొక్కప్రక్కకుఁ బోవు నయిదునక్షత్రములును సెకను కిరువదేసిమైళ్లచొప్పున మహావేగమున నడుచుచు భూమినుండి దూరముగా తొలఁగిపోవుచున్నవి.

చెదరియుండు కిరణపుంజము నొక్కచోటికిఁ జేర్చి దూరవస్తువులను గనఁబఱుపఁ గల దూరదర్శకయంత్రమునువలెనే, కిరణములను విభజించి వస్తుతత్వములను దెలుపఁ గల రూపదర్శకయంత్రమును నిర్మించువిధమును బుద్ధిమంతులు కొంతకాలముక్రిందట కనిపెట్టినారు. ఈ యద్భుతయంత్ర సాహాయ్యముచేత సూర్యునిలో నేయేపదార్థము లున్నవో తెలిసికోఁబడినవి. సూర్యకిరణములు మనకు తెల్లఁగా కనఁబడినను ప్రతికిరణ ములో నేడేసిరంగులున్నవి. కోణములుగల యద్దపుకణికతో సూర్యకిరణమును భాగించి పృథక్కరణముచేసినపక్షమున నింద్రధనస్సునందువలె నెఱుపువన్నె, వంగపండుచాయ, పసపురంగు, ఆకుపచ్చన, శ్యామలచ్ఛాయ, నీలవర్ణము, పాటలకాంతి, అను నేడు రంగులును వరుసగా నొకదానితరువాత నొకటి కానఁబడును. దీనిని శోధింపఁ దలఁచినయెడల నొక చీఁకటిగదిలోనికి తలుపుసందుగుండ నొక సూర్యకిరణమును చొరనిచ్చి, పలకలుతేలిన గాజుకణికతో కిరణమును భేదించి గోడవంకఁ ద్రిప్పినచో తెల్లనిగోడమీఁద నిన్నిరంగులును స్పష్టముగాఁ గానవచ్చును. రూపదర్శకయంత్రములో సూర్యకిరణమును శోధించునప్పుడు రంగులనడుమ నక్కడక్కడ నల్లనిగీతలుకూడఁ గానవచ్చును. ఈగీతలు కొన్ని చేరువగాను, కొన్నిదూరముగాను, కొన్ని విడిగాను, కొన్ని గుంపుగాను, ఉండును. ఈక్రిందిది రూపదర్శకయంత్రము.—



ఈ యంత్రమందలి (sl) చిన్న గొట్టము చీఁకటిగదివంటిది; దానికొనయున్న (s) రంధ్రము తలుపుసందువంటిది; (p) పలకలు తేటిన గాజుకణిక గొట్టములోఁ బ్రవేశించిన కిరణమును పృథక్కరణముచేయును; పెద్దగొట్టమగు (t) దూరదర్శకయంత్రము పృథక్కరణము చేయఁబడిన కిరణమును స్థూలరూపము పొందునట్లుచేయును. రూపదర్శకయంత్రముతోఁ జూచునప్పుడు సూర్యకిరణములో సప్తవర్ణములమధ్యను నల్లగీతలీ క్రిందిరీతిని గనఁబడును—



ఈ గీతలను బట్టి సూర్యునిలో నినుము రాగి మొదలయిన లోహములును, జలవాయువు మొదలయిన యావిరులును, కలవని తెలిసికోఁబడినవి. ఒక్క సూర్యునిలో మాత్రమే కాక కొన్ని యితర నక్షత్రములలోఁగల లోహాదులుకూడ నీయంత్రసాహాయ్యముచేతఁ గనుఁగొనఁబడినవి. ఈ యంత్రముతో నితరనక్షత్రములను శోధించునప్పుడు సూర్యకిరణమునందువలెనే వాని కిరణములయందును ప్రకాశమానములైన వివిధవర్ణములు నడుమనడుమ నల్లగీతలును కనఁబడునుగాని వాని యేర్పాటును సంఖ్యయు వేఱువేఱుగా నుండును.

ఎల్లనిలోహమును మండునట్లుచేసి కోణములుగల యద్దపు కణికలోనుండి దాని వెలుతురును పోనిచ్చినయెడల, సూర్యతేజస్సునందువలెనే వివిధవర్ణములు కనఁబడునుగాని నల్లగీతలుండవు. వాయురూపమయిన యావిరిని వెలిఁగించి దాని వెలుతురు నద్దపు కణికలోనుండి పోనిచ్చినపక్షమున, ప్రకాశమానమైన గీతలు కనఁబడును. ఇట్లేర్పడు గీత లొక్కొక్క లోహమున కొక్కొక్కసంఖ్య కలవిగానుండును. ఇనుమున కఱువదిగీత లేర్పడును. మండుచుండు గట్టిలోహముల వెలుతురు వెలుఁగుచుండెడి యావిరిలోనుండి చొరఁబడివచ్చిన పక్షమున నల్లగీతలేర్పడును. ఏ లోహకాంతి యావిరి మంటలోనుండి వచ్చిన నెన్ని నల్లగీత లేవరుస నేర్పడునో శాస్త్రజ్ఞులు శోధించి తెలిసికొనియున్నారు. ఈ శోధనలనుబట్టియే సూర్యాదులు మండుచుండు ఘనపదార్థములనియు, వాని వెలుతురు లోహపుటావిరి మంటలోనుండి వెలువడుచున్నదనియు, తెలియవచ్చినది. రంగులనడుమనున్న నల్లగీతలను లెక్కించుటవలననే యేయేలోహములున్నవో తెలిసికోవచ్చును.

ఇంతవఱకును దెలిసికొన్నదానినిబట్టి సృష్టి యనంతమైనదని మందమతికి సహితము బోధపడకపోదుగదా? సృష్టికర్తయగు పరమేశ్వరుఁడు సర్వశక్తుఁడుమాత్రమే

కాక సర్వకారుణ్యుఁడునయి యున్నందున సమస్తమును నడుపుచు, సూర్యాది గోళములను మాత్రమే కాక వానిచుట్టును దిరిగెడు గ్రహములలో నున్న తృణాది మేరుపర్యంతమునుగల సమస్త వస్తువులను బ్రహ్మాది పిపీలికాంతమునుగల సమస్త జంతువులను సంతతప్రేమతోఁ గాపాడుచున్నాఁడు. ఈ సృష్టిమహిమానువర్ణనము కొంతవఱకైనను సృష్టికర్తయందలి భక్తివిశ్వాసములను పురికొల్పును గాక!

రాజమహేంద్రవరములోని శ్రీవివేకవర్ధనీ కార్యస్థానమున వెలకుదొరకు పుస్తకములు.

కందుకూరి- వీరేశలింగము గారిచే రచియింపఁబడినవి.

నాటకములు.	రు-	అ-	పై
౧. అభిజ్ఞానశాకుంతలము. (కాళిదాసుని నాటకమునకు తెలుఁగు)	౦	౧౩	౦
౨. రత్నావళి- (శ్రీహర్ష దేవవిరచిత సంస్కృతనాటకమునకు తెలుఁగు)	౦	౬	౬
౩. మాళవికాగ్నిమిత్రము- (కాళిదాసప్రణీత నాటకమునకు తెలుఁగు)	౦	౬	౬
౪. ప్రబోధచంద్రోదయము- (కృష్ణమిశ్రుని నాటకమునకు తెలుఁగు)	౦	౮	౬
౫. రాగమంజరి- (ఇంగ్లీషున ననుసరించి తెలిఁగింపఁబడిన నాటకము)	౦	౮	౬
౬. కళ్యాణకల్పవల్లి (96 పుటలుగల మిక్కిలి రమ్యమయిన నాటకము)	౦	౯	౦
౭. ప్రహ్లాదనాటకము- (భక్తిప్రధానమయిన వచనరూప నాటకము)	౦	౪	౬
౮. చమత్కారరత్నావళి నాటకము-	౦	౪	౬
౯. బ్రాహ్మవివాహము-	౦	౩	౬
౧౦. వ్యవహారధర్మబోధిని-	౦	౩	౬
౧౧. వేశ్యాప్రియప్రహసనము-	౦	౩	౬
౧౨. కౌతుకవర్ధని- (హాస్యప్రధానమయిన చిన్ననాటకము) ...	౦	౨	౬
౧౩. హాస్యసంజీవని, మొదటిభాగము-	౦	౪	౬
౧౪. హాస్యసంజీవని, రెండవభాగము-	౦	౪	౬
౧౫. తిర్యగ్విద్వన్మహాసభ, మూషకాసురవిజయము- (బొమ్మలతోనున్నది)	౦	౨	౬
౧౬. మహారణ్యపురాధిపత్యము- (బొమ్మలతోనున్నది) ...	౦	౩	౬
౧౭. వెనీసువర్తకచరిత్రము- (ద్విపద ప్రథమద్వితీయాంకములు) ...	౦	౪	౬
౧౮. కలిపురుషశనైశ్చరవిలాసము-	౦	౨	౬
౧౯. వివేకదీపిక- (స్త్రీపునర్వివాహ నాటకము మొదటిమూడంకములు) ...	౦	౪	౬
౨౦. సత్యహరిశ్చంద్ర నాటకము-	౦	౯	౦

ఇంగ్లీషున ననుసరించిన ప్రహసనములు.

౨౧. అపూర్వబ్రహ్మచర్యప్రహసనము-	౦	౨	౬
౨౨. విచిత్రవివాహప్రహసనము-	౦	౨	౬
౨౩. మహాబధిరప్రహసనము-	౦	౨	౬

౨౪. పునర్మరణప్రహసనము- ౦ ౨ ౭
౨౫. బలాత్కారగానవినోదప్రహసనము- ౦ ౨ ౭
౨౬. కలహప్రియాప్రహసనము- ౦ ౨ ౬
౨౭. మహామహోపాధ్యాయప్రహసనము- ౦ ౨ ౬
౨౮. యోగనిద్రాప్రహసనము- ౦ ౨ ౬
౨౯. మహావంచకప్రహసనము- ౦ ౨ ౭
౩౦. అసహాయశూరప్రహసనము- ౦ ౨ ౬

పద్యకావ్యములు.

౩౧. అథాగ్యోపాఖ్యానము- (పద్యరూపమునమున్న హాస్యప్రబంధము)౦ ౨ ౬
౩౨. శుద్ధాంధ్ర నిరోష్ఠ్యనిర్వచన నైషధము(అచ్చ తెలుఁగు) ...౦ ౪ ౬
౩౩. రసికజనమనోరంజనము- (అచ్చ తెలుఁగుశృంగారప్రబంధము)...౦ ౬ ౬
౩౪. శుద్ధాంధ్రభారతసంగ్రహము- ౦ ౭ ౬
౩౫. పథికవిలాసము- ౦ ౪ ౭
౩౬. జాన్‌గిల్పిన్ వేటగీతములు- ౦ ౧ ౬
౩౭. నీతిదీపిక-(బాలురనిమిత్తము చేయఁబడిన నీతిపద్యములపుస్తకము)...౦ ౨ ౬
౩౮. స్త్రీనీతిదీపిక- (బాలికలనిమిత్తము చేయఁబడిన నీతిపద్యములు)...౦ ౨ ౬

స్త్రీలకుపయోగపడు పుస్తకములు.

౩౯. చంద్రమతీచరిత్ర(స్త్రీలకుఉపయుక్తమైననీతిబోధకపుస్తకము)...౦ ౪ ౬
౪౦. సత్యవతీచరిత్ర(స్త్రీలకావశ్యకమైనచరిత్ర) ...౦ ౪ ౬
౪౧. సత్యసంజీవని- (స్త్రీలకుపయోగించెడునీతిబోధకమయినకథ)...౦ ౪ ౬
౪౨. సత్యాద్రౌపదీసంవాదము, మాతృపూజయుపితృపూజ, ...౦ ౧ ౬
౪౩. దేహారోగ్యధర్మబోధిని-(శరీరారోగ్యధర్మములబోధించుపుస్తకము)౦ ౪ ౬

షేక్స్పియరు నాటక కథలననుసరించివ్రాయఁబడినకథలు.

౪౪. చమత్కారరత్నావళి- ౦ ౨
౪౫. కురంగేశ్వరవర్తకచరిత్రము- ౦ ౨ ౬
౪౬. కళావతీపరిణయము ౦ ౨ ౦
౪౭. గయ్యాళిని సాధు చేయుట- ౦ ౨ ౦
౪౮. రఘుదేవరాజీయము- ౦ ౩ ౦
౪౯. చిత్రకేతుచరిత్రము- ౦ ౨ ౦
౫౦. సుమిత్రచరిత్రము- ౦ ౨ ౦
౫౧. దానకేసరివిలాసము- ౦ ౨ ౭

ఉపన్యాసములు.

౭౨. వర్ణము-	...౦	౨	౬
౭౩. మనుష్యజీవితముయొక్క పరమార్థము, దానినిపొందుమార్గము.	..౦	౨	౬

వివిధపుస్తకములు.

౭౪. జ్యోతిశ్శాస్త్రసంగ్రహము-౧౨౦పుటలుగలది. పటములతోనున్నది	౧	౨	౦
౭౫. శారీరశాస్త్రసంగ్రహము-	...౧	౨	౦
౭౬. ఆంధ్రకవులచరిత్రము, మొదటిభాగము-౧౫౦ పుటలుగలది	...౧	౨	౦
౭౭. ఆంధ్రకవులచరిత్రము- ద్వితీయభాగము౧౬౦పుటలుగలది	...౧	౨	౦
౭౮. ఉపన్యాసమంజరి-	...౦	౬	౬
౭౯. ఆంధ్రతర్కసంగ్రహము-	...౦	౧	౬
౮౦. సంగ్రహవ్యాకరణము-	...౦	౫	౬
౮౧. కావ్యసంగ్రహము-	...౦	౨	౦
౮౨. నీతికథామంజరి ప్రథమభాగము (౭౨పటములతో)	...౦	౮	౬
౮౩. నీతికథామంజరి ద్వితీయభాగము- (పటములతో)	...౦	౮	౦
౮౪. నీతిచంద్రిక- విగ్రహము-	...౦	౧౩	౦
౮౫. నీతిచంద్రిక, సంధి-	...౦	౬	౬
౮౬. రాజశేఖరచరిత్రము-	...౧	౨ముతు	
౮౭. సత్యరాజాపూర్వదేశయాత్రలు- మొదటిభాగము-	...౨	౬	౬
౮౮. సత్యరాజాపూర్వదేశయాత్రలు. రెండవభాగము.	...౦	౬	౬

పూర్వకవిప్రణీత గ్రంథములు.

౧. కవిరాజమనోరంజనము- (పురూరవశ్చరిత్ర)	...౦	౮	౦
౨. మొల్ల రామాయణము- ...	...౦	౧౧	౦
౩. ప్రభావతీప్రద్యుమ్నము- ...	...౦	౧౩	౦
౪. పాంచాలీపరిణయము. ...	...౦	౬	౬
౫. రామాభ్యుదయము- (మొదటిఐదు ఆశ్వాసములు)	...౦	౪	౬
౬. యయాతిచరిత్రము- ...	...౦	౬	౬
౭. అథర్వణకారికలు- ...	...౦	౨	౬

పదిరూపాయలకంటెతక్కువగాని మొత్తమునకు పుస్తకములు కొన్నపక్షమున నూటికి పదిరూపాయలవంతున పుస్తకములధికముగా నియ్యబడును.

పయిపుస్తకములు కావలసినవారు, గోదావరిజిల్లా, రాజమహేంద్రవరము శ్రీవివేకవర్ధనీ ముద్రాక్షరశాల మేనేజరుగారికివ్రాసి తెప్పించుకోవచ్చును.